RNI.No. APTEL/2014/57702
Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam





# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 12 ‖ సంచిక : 68 ‖ గుంటూరు ‖ గురువారం, జూలై 10, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 1.00 ‖ పేజీలు : 12



## రిటైర్మెంట్ తర్వాత 'రాజకీయాలకు దూరంగా'

- "రిటైర్మెంట్ తర్వాత వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు, ప్రకృతి వ్యవసాయానికే సమయాన్ని కేటాంచాలని నిర్ణయించుకున్నా
- ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.
- సహకార శాఖ మంత్రిగా తన ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉంది
- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా

# మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0

- రాష్ట్ర వ్యాప్తంగా హాజరు కానున్న 2 కోట్ల మంది విద్యార్థులు-తల్లితండ్రులు-ఉపాధ్యాయులు
- సరికొత్త రికార్డు దిశగా ఈ సమావేశం
- పుట్టపర్తిలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరు కానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ మరో రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఒకే రోజున 2 కోట్ల మందితో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రభుత్వం నిర్వహించనుంది. విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు...ఇలా అందరినీ ఒక చోటుకు ప్రభుత్వం తీసుకొస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది రెండో కార్యక్రమం. రేపు పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉపాధ్యాయులతో సీఎం మాట్లాడనున్నారు.

61 వేల విద్యాసంస్థలు...2 కోట్లమంది - మిగతా3లో

## పోలీసుల్లారా.. చంద్రబాబు రేపు మిమ్మల్ని మోసం చేయొచ్చు

- రైతుల తలలు పగలకొడతారా?
- 1,200 మందిని జైల్లో పెడతారా?
- రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా?
- కూటమి ప్రలోభాలు,లంచాలకు పోలీసులు లొంగొద్దు
- రేపు పోలీసులను కూడా చంద్రబాబు మోసం చేయొచ్చు
- అప్పుడు కూడా నేనే మీ తరుపున పోరాటం చేయాల్సి వస్తుంది



**చిత్తూరు**

బంగారుపాళ్యంలో ఇవాళ పోలీసులు వ్యవహరించిన తీరును వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. రైతులను ఏదో రౌడీ షీటర్లుగా వ్యవహరిస్తూ దురుసుగా ప్రవర్తించారంటూ పోలీసులపై మండిపడ్డారాయన. 'రైతుల తలలు పగలకొడతారా? 1,200 మందిని జైల్లో పెడతారా?. రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా?. కూటమి ప్రలోభాలు,లంచాలకు పోలీసులు లొంగొద్దు. - మిగతా3లో

## 'అక్రమ ఓటు'పై వేటు.. ఈసీ చర్యలపై వివాదం ఎందుకు?



- అనర్హులు, నకిలీ ఓటర్లతోపాటు విదేశీయులను ఈ జాబితా నుంచి తొలగించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ
- ఓటర్ల నమోదు నిబంధనలు-1960 ప్రకారం రూపొందించిన ఈ దరఖాస్తులోని అంశాలపై ఇప్పుడు వివాదం నడుస్తోంది



## చైనా మెగా డ్యామ్ నిర్మిస్తోంది

- వాటర్ బాంబ్ పేలనున్నది
- సైనిక ముప్పు కంటే ఇది పెద్ద సమస్య
- అరుణాచల్ సీఎం పెమా ఖండూ
- యార్లుంగ్ త్సాంగ్పో నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద ఆనకట్ట ప్రాజెక్ట్‌ను చైనా నిర్మిస్తున్నది

వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం

"ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వాతావరణ విపత్తుల నుండి కష్టపడి పనిచేసే మన రైతు సోదరులు మరియు సోదరీమణుల ప్రయోజనాలను రక్షించడంలో చాలా ప్రభావవంతంగా ఉందని రుజువు చేస్తోంది. కోట్లాది మంది రైతులు దాని ప్రయోజనాలను పొందుతున్నారు."
- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి





మీ కష్టానికి పూర్తి ఫలితం పొందండి
పంటల బీమా చేయించుకోండి
రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకోండి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రయోజనాలని పొందండి
- 23+ కోట్ల రైతు సోదర-సోదరీ మణులు ఇప్పటివరకు పంటల బీమా లబ్ది పొందారు
- ₹1.75+ లక్షల కోట్ల పరిహారం రైతులకు లభించింది
- 78+ కోట్ల కంటే ఎక్కువ రైతుల దరఖాస్తులు అందాయి
- జాతీయ పంట బీమా పోర్టల్ ద్వారా స్పష్టమైన మరియు త్వరిత క్లెయిమ్ చెల్లింపు

రిజిస్ట్రేషన్ చివరి తేదీ:
వాతావరణ ఆధారిత పధకము క్రింద నోటిఫై చేయబడిన పంటలకు 15 జూలై, 2025
దిగుబడి ఆధారిత పధకము క్రింద నోటిఫై చేయబడిన పంటలకు (వరి మినహా) 31 జూలై, 2025
వరి పంటకు 15 ఆగస్టు, 2025

దేశవ్యాప్తంగా హెల్ప్‌లైన్ 14447

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన

బీమా భాగస్వాములు AIC | FUTURE GENERALI | ICICI Lombard | RELIANCE GENERAL INSURANCE | SBI general | TATA AIG

మీ పంటని నేడే బీమా చేయించుకోడానికి సంప్రదించండి
కామన్ సర్వీస్ సెంటర్ (CSC) | క్రాప్ ఇన్సూరెన్స్ యాప్ https://play.google.com | పోస్ట్ ఆఫీస్ | బ్యాంక్ బ్రాంచ్
@PMFBY
PMFBYకు సంబంధించిన అధిక వివరాల కోసం QR కోడ్ స్కాన్ చేయండి

## సంపాదకీయం

### ఏం ఒరగబెట్టారని శాంతి బహుమతి?

ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు శ్వేతసౌధంలో విందు ఇవ్వడం, అనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం నుండి అధికారికంగా ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేయడం. ఇది జరిగి ఇరవై నాలుగు గంటలు గడవకముందే చంచల మనస్తత్వం, దూకుడు స్వభావం కలిగిన ట్రంప్ ఇరాన్ లోని మూడు అణ్వస్త్ర స్థావరాలపై (నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్) గత నెల (22-జూన్, -2025) మొదటిసారిగా తయారుచేసి పెట్టుకున్న బంకర్ బ్లస్టర్ బాంబులను ప్రయోగించి ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి తన ప్రమేయం లేకున్నా సినిమాలలో తళుక్కున మెరిసే అతిథి పాత్రవలే వచ్చి ఇరాన్‌లో విధ్వంస రచన చేసి ప్రపంచ రాజకీయాలలో ఓ చెడు ముద్రను వేసుకున్నాడు. దీని ఫలితం బహుశా ఇజ్రాయెల్ పాలకులు గాని, దానికి వంతపాడే అమెరికా అధికార గణం కూడా ఇరాన్‌ను తక్కువ అంచనా వేయడమే. గత ఇరవై ఒక్క నెలలుగా ఇజ్రాయెల్ గాజాలో ఎంతటి నరమేధం సృష్టిస్తుందో ప్రపంచం మొత్తం రెండు కళ్ళు వెడల్పు చేసుకోని చూస్తూనే ఉంది. పాలస్తీనలో ఇప్పటి వరకు (18 జూన్, 2025 నాటికి) 57,800 మంది చనిపోయారని నివేదికలు తెలియజేస్తున్నాయి. వీరిలో అత్యధికంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు వీరెవరు ఇజ్రాయెల్ పైకి యుద్ధానికి నేరుగా వెళ్ళినవారు కాదు. అలా అని ఈ ఇరవై ఒక్క నెలల యుద్ధకాలంలో హమాస్ పూర్తిగా తుడిచిపెట్టుకనిపోయిందా అంటే సమాధానం లేని ప్రశ్న. అంటే ఇజ్రాయెల్ హమాస్‌పై యుద్ధం ప్రకటించి ఏం సాధించింది? గాజా ప్రాంతం మొత్తాన్ని నేలమట్టం చేసింది. అక్కడి ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇది చాలదన్నట్లుగా ఇరాన్‌పైకి ఆలోచన వచ్చిందే తడువుగా (13 జూన్, 2025 న) దాడికి ఆదేశాలివ్వడం నేతన్యాహు చేసిన రెండో అవివేకపు ఆలోచన. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే త్వరగా లొంగిపోతుంది. అక్కడి పాలకులతో కాళ్ళబేరానికి రప్పించి అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం (ఎన్‌పిటి) మీద సంతకం చేయించుకోవాలని చూశారు. కానీ వారు అనుకున్నట్లుగా జరుగలేదు. ఫలితంగా రెండు వైపుల పది రోజుల పాటు (23 -జూన్, -2025 వరకు) జరిగిన యుద్ధంలో ఇరాన్ వైపు సుమారు ఎనిమిది వందల మంది, ఇజ్రాయెల్ వైపు వందమంది పౌరులు మరణించినట్లు సమాచారం. ఇక భౌతికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడం చాలా కష్టమైన అంశం. గతంలో ఇజ్రాయెల్ అరబ్ దేశాలతో జరిగిన యుద్ధంలో (1967) కేవలం వారం రోజుల్లోనే గెలిచింది. మళ్ళీ ఇరాన్‌పై అలాగే గెలుస్తామని అనుకోవడం ఇజ్రాయెల్ చేసిన అతి పెద్ద పొరపాటు. ఈ పది రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ రక్షణ కవచం (ఐరన్ డోమ్) ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిసైళ్ళ ముందు తలొంచాల్సి వచ్చింది. ఫలితంగా ఈ 77 సంవత్సరాల కాలంలో ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం ఇరాన్‌తో ఈ పది రోజుల యుద్ధంలో జరిగింది. ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహు అమెరికాను ముగ్గులోకి దించి ఇరాన్‌లోని అణ్వస్త్ర స్థావరాలను ధ్వంసంచేసి సంతృప్తి పడొచ్చు. కానీ దాడికి ముందే (22- జూన్, 2025) ఆయా అణ్వస్త్ర స్థావరాలనుండి శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ తరలించిందన్నది ఓ వార్త కథనం. వెరసి అదే జరిగినా ఇరాన్ అంతర్జాతీయంగా ఈ యుద్ధం ద్వారా ప్రపంచానికి ఓ గట్టి హెచ్చరికను ఇవ్వగల్గింది. ఇరాన్ జోలికి ఎవరు వచ్చినా అంత తేలిగ్గా వదిలి పెట్టం అనేది ఆ హెచ్చరిక సారాంశం. ఈ అంశంలో ట్రంప్ మళ్ళీ ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కురుర్చింది తానేనని చెప్పి అంతర్జాతీయ మీడియాకు ఓ వార్త సాధనంగా మారగలరు కూడా. ఆపరేషన్ సిందూర్ విషయంలో కూడా అనవసరంగా తలదూర్చి తానే రెండు అణ్వస్త్ర దేశాల మధ్య కాల్పుల విరమణ కుదిర్చానని పదేపదే లీకులు ఇచ్చి మన నాయకత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేసే ప్రయత్నం చేయడం గమనార్హం. మరి ఇప్పుడు పాకిస్తాన్ అధికార గణం మళ్ళీ ట్రంప్‌ను నెత్తిన పెట్టుకొని నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని మళ్ళీ సిఫార్సు చేస్తుందేమో చూడాలి. ఇది చాలదన్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ పేరును తన మిత్ర బృందంతో పాటుగా అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డి కార్టర్ నార్వేలోని నోబెల్ కమిటీకి లేఖ పంపించడం గమనార్హం. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో తన హయాం లో ఎలాంటి యుద్ధాలు, యుద్ధ వాతావరణం ఉండదని చెప్పి వ్యూహాత్మకంగానే ఇజ్రాయెల్‌తో పాలస్తీనాలోని హమాస్ తిరుగుబాటుదారుల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటింపచేసి, ఎన్నికలు పూర్తి అయిన మరుక్షణం నుండే తిరిగి గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మారణహోమం సృష్టించడం ప్రారంభించింది. అక్కడ 24 గంటల్లో చిన్న పిల్లలకు ఆహారం దొరకకపోతే సుమారు పద్నాలుగు వేలకు పైగా చిన్న పిల్లలు చనిపోతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ, గాజాలో సహాయ చర్యల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సంఘాలు చెప్పినా వినకుండా నేటికి కూడా ప్రతిరోజు సుమరుగా 60 మందికి పైగా సైన్యం జరుపుతున్న దాడిలో చనిపోతూనే ఉన్నారు.

మరి ఇవన్నీ అమెరికా అధ్యక్షుడికి తెలియకుండా జరుగుతున్నట్లేనా? దీనికి తక్షణం పెద్దన్నగా ఇజ్రాయెల్‌ను ఒప్పించి శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి గాజా/ పాలస్తీనా పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయాలి. అలాగే ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఒ) 1948లో చేసిన ఇజ్రాయెల్ ఏర్పాటుతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాన్ని అగ్రరాజ్యం (అమెరికా) ఇజ్రాయెల్, యురోపియన్ యూనియన్ దేశాలు పాలస్తీనా ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చొరవ తీసుకొని ముందడుగు వేయాలి. తద్వారా పశ్చిమాసియాలో నిత్యం రగిలే రాచపుండు మాదిరిగా ఉన్న పాలస్తీనా సమస్యకు శాశ్వతంగా తెరపడుతుంది. ఇక రెండవది ఒక వైపు నాటోసభ్య దేశాలు, అలాగే యురోపియన్ యూనియన్ దేశాలతో ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ అగ్రరాజ్యం పరోక్షంగా ఉక్రెయిన్ %-% రష్యా మధ్య యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ వుంది. గత రెండున్నర సంవత్సరాలుగా రెండు దేశాల మధ్య యుద్ధం జరగడానికి పరోక్ష కారణం అగ్రరాజ్యమే. దీనినంతటినీ ప్రపంచం గమనిస్తూనే ఉంది. ఈ యుద్ధాన్ని కూడా వెంటనే విరమించేలా డొనాల్డ్ ట్రంప్ క్రియాశీలక పాత్ర పోషించాలి. అలాగే తక్షణమే ఉక్రెయిన్ దేశానికి నాటో సభ్యదేశాలతోపాటు అమెరికా కూడా ఆయుధాల సరఫరా నిలిపివేస్తే యుద్ధం నిలిచిపోతుంది. ఈ విషయంలో కూడా అగ్రరాజ్య అధ్యక్షుడిగా ట్రంప్ చొరవ తీసుకొని ఆయుధాల సరఫరా నిలిపివేయాలి. మూడవ అంశం అగ్రరాజ్యానికి (అమెరికా) ఉగ్రవాద నిర్మూలనే పెద్ద ఎజెండా అయినప్పుడు మన దేశంతో స్నేహం, పొరుగుదేశం (పాకిస్తాన్)తో ఒప్పందాలు ఇలాంటి ద్వంద్వ నీతిని అగ్రరాజ్యం అవలంబించడం మొదటి నుండి వస్తున్నదే. ఇది యావత్ ప్రపంచంలోని మేధావులను తొలుస్తున్న ప్రశ్న. అలాగే ఇజ్రాయెల్ యెమెన్ దేశంతోనూ, సిరియాలోను చేస్తున్న దాడులు వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ అగ్రరాజ్య అధ్యక్షుడిగా ప్రపంచ పెద్దన్నగా పిలువబడే డొనాల్డ్ ట్రంప్ చేయగలడా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న! ఏదీఏమైనా ట్రంప్‌ను ఏరికోరి తెచ్చుకున్న అమెరికా ప్రజలకు మిగిలిన మూడున్నర సంవత్సరాలు అమెరిక సమాజానికి, ప్రపంచానికి ఎలాంటి సందేశం ఇస్తాడో చూడాలి. మొత్తానికి డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడం అనేది ఈ శతాబ్దాపు జోక్ మాత్రమే!

# సంచలనాల "బాహుబలి"కి పదేళ్లు

తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన చిత్రం బాహుబలి. రాజమౌళి ఊహల్లోంచి పుట్టిన బాహుబలి సినిమా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటింది. ఈ సినిమా జూలై 10వ తేదీన 2015 వ సంవత్సరంలో విడుదలై అద్భుతమైన విజయాన్ని సాధించి రికార్డు సృష్టించి, పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు కలెక్షన్లు సాధించింది. సుమారు 180 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా 650 కోట్ల రూపాయల కలెక్షన్లు సాధించి తెలుగు సినీ జగత్తులో బద్దలు కొట్టలేని విధంగా అనేక రికార్డులు సృష్టించింది. భారీ అంచనాలతో పదేళ్ళ క్రితం జూలై 10న విడుదల అయిన బాహుబలి... భారతీయ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఒక బ్లాక్ బస్టర్ గా నిలిచి పోయింది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలిచి, పలు చిత్రాలకు మార్గ దర్శియై, ఎనిమిది ఏళు పూర్తి చేసుకుంది. ప్రభాస్ హీరోగా, రాణా విలన్ పాత్రలో నటించిన ఈ సినిమాకు రాజమౌళి దర్శకత్వం వహించగా ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్ మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సినిమాను నిర్మించారు. అనుష్క, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్, తమన్నా వంటి వారు ఇద్దరు కీలక పాత్రలలో నటించారు. హీరో ప్రభాస్ తన కెరీర్ లో ఈ చిత్రం కోసం ఐదేళ్లు వెచ్చించారు. 2012 సంవత్సరం నుంచి 2017వ సంవత్సరం వరకు మరో ప్రాజెక్ట్ ఒప్పుకోకుండా ప్రభాస్ ఈ సినిమా పూర్తి చేశారు. సినిమా క్లైమాక్స్ ఒక్కదానికే సుమారు 30 కోట్ల రూపాయల ఖర్చయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 36 స్టూడియోలలో ఈ సినిమా కోసం విఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు పని చేశారు. సుమారు 1300 మంది విఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు రాత్రి పగలు తేడా లేకుండా పని చేశారు. సినిమా చిత్రీకరణ జూలై 6, 2013న కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు రాతి ఉద్యా నవనంలో మొదలైంది. సినిమాలో భాగమైన మాహిష్మతి రాజ్యానికి సంబంధించిన భారీ సెట్టుని రామోజీ ఫిలిం సిటీలో కళా దర్శకుడు సాబు సిరిల్ నేతృత్వంలో నిర్మించారు. సినిమాలోని తమ పాత్రలకు అనుగుణంగా ప్రభాస్, అనుష్క, రాణా కత్తిసాము నేర్చుకోగా, ప్రభాస్, రాణాలు అదనంగా గుర్రపు స్వారీలు నేర్చుకోవడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 9000 థియేటర్లలో విడుదలైన సినిమా ఒక్క భారత దేశంలోనే 6500 స్క్రీన్ లలో విడుదల చేయ బడింది. ఈ సినిమాలో నటీనటులు ధరించడం కోసం 1500 వెరైటీలకు ఆభరణాలు తయారు చేయించారు. ఒక్కొక్క క్యారెక్టర్ కి ఒక్కొక్క విధంగా ఈ ఆభరణాలు తయారు చేయించారు. రాజమౌళి సినిమా కోసం తమిళ రచయిత మదన్ కార్కి "కిలికిలి" లేదా "కిలికి" అనే పేరుతో ఓ కొత్త భాషను రూపొందించారు. భాషను 750 పదాలతో, 40 వ్యాకరణ సూత్రాలతో రూపొందించారు. సినిమాలో కనిపించే కాలకేయులు అనే తెగ ఈ భాష మాట్లాడుతుంది. ఒక సినిమా కోసం ఓ భాషను రూపొందించడం భారత దేశంలో ఇదే ప్రథమం. భారత దేశంలో అత్యంత వసూళ్ళు సాధించిన సినిమాలలో ఒకటిగా ఈ సినిమా పేరొందింది. 2015లో.. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ విలన్, ఉత్తమ ఛాయా గ్రహణం, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నేపథ్య గాయకుడు, ఉత్తమ కళా దర్శకుడు, ఉత్తమ నృత్య దర్శకుడు, ఉత్తమ శబ్ద గ్రాహకుడు, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్, ఉత్తమ స్టంట్ మాస్టర్, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో నంది పురస్కారాలు పొందడం విశేషం. 2015 లో వచ్చిన మొదటి భాగము బాహుబలి "ది బిగినింగ్"కి కొనసాగింపుగా బాహుబలి 2 "ది కన్ క్లూజన్" చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 2017 ఏప్రిల్ 28వ తేదీన విడుదల చేసారు. ఈ చిత్రం విడుదలై తొలి రోజే ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల వసూళ్లతో చరిత్ర సృష్టించి, విడుదలైన ఆరు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 800 కోట్లు వసూలు చేసి, ఆల్ టైమ్ అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రంగా నిలిచింది. కేవలం పది రోజుల లోనే 1000 కోట్లు పైగా వసూలు చేసిన మొట్టమొదటి భారతీయ చిత్రంగా నిలిచింది. భారత దేశంలో, ఇది అనేక చలన చిత్రాల రికార్డులను నెల కొల్పింది. హిందీలో, తెలుగు మరియు తమిళ భాషలలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా చరిత్ర పుటల కెక్కింది.

# అభివృద్ధి కాముకులు అక్కిరాజు వాసుదేవరావు

హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మేళ్లచెర్వు శివారు వెంకట్రాపపురం నివాసి అక్కిరాజు వాసుదేవరావు. ఆయన కుటుంబం భూస్వామ్య కుటుంబం కావడంతో విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఆయనను ఆయన తల్లిదండ్రులు కృష్ణా జిల్లాలో చదివించారు. అక్కడ ఆయన ఎస్‌ఎస్‌ఎల్‌సీ వరకు చదవి అంగ్లంలో మంచి పట్టు సాధించారు. 1962ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అక్కిరాజు వాసుదేవరావు సీపీఐ అభ్యర్థి డి.నరసయ్యపై 2,833 ఓట్లతో గెలుపొందారు. 1967ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి అక్కిరాజు వాసుదేవరావు సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన డి.నరసయ్యపై 2,888ఓట్లతో గెలుపొందారు. 1978లో ఏర్పడిన కోదాడ నియోజకవర్గం నుండి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అక్కిరాజు వాసుదేవరావు కాంగ్రెస్‌ఐ అభ్యర్థి కె.లక్ష్మణ్‌రాజుపై గెలుపొందారు. ఎంతో చైతన్యం కల్గిన హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాలకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అక్కిరాజు వాసుదేవరావు నాటి రాజకీయాలకే వన్నె తెచ్చారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవెర్చడంలో ఆయన సఫలీకృతులయ్యారు. 1962 నుండి 72 వరకు వరకు రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే ఎన్నికై బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహా రావుల కేబినెట్ లలో మంత్రిగా పనిచేశారు. అనంతరం 1977 కోదాడ నియోజకవర్గం ఏర్పడిన అనంతరం ఆయన 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొంతకాలం తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. 1983 వరకు కోదాడ ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకున్నారు. తరవాత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చినప్పటికీ స్థానిక పరిస్థితలను అవగతం చేసుకుని, తన శిష్యుడైన చింతా చంద్రారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఇప్పించిన త్యాగశీలి ఆయన. నేటి రాజకీయ నాయకులు పార్టీ టికెట్ల కోసం తన్నుకుంటున్న స్థితిలో ఆయనకు వచ్చిన టికెట్‌ను స్వచ్ఛందంగా వదులుకుని సమకాలిన రాజకీయాలకే వన్నె తెచ్చారు. ఆ నిర్ణయాన్ని కోదాడ ఎన్నికల బహిరంగ సభకు వచ్చిన మాజీ ప్రధాని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ స్వయంగా బహిరంగ వేదిక పైనుంచే అభినందించారు. హుజూర్ నగర్ ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు కోదాడలో డిగ్రీ కళాశాలను ఆర్ట్స్అండ్ సైన్స్ విభాగంతో ఏర్పాటు చేయించారు. తొలుత కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కళాశాలను ప్రారంభించారు. అనంతరం తన బంధువులైన కొండపల్లి రాఘవమ్మరంగారావు నుంచి 60ఎకరాల భూమిని విరాళంగా సేకరించి 1970లో కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు ఫౌండర్ చైర్మన్‌గా ఆయన కొనసాగారు. అదే విధంగా ఆయన కళాశాల అభివృద్ధికి అన్ని వర్గాలను భాగస్వామ్యం చేశారు.

ఆ కళాశాల ద్వారా ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఐఎఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ కళాశాలకు, కళాశాల విద్యార్థులకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. నియోజకవర్గ పరిధిలో వంద గ్రామాలకు ఒకే సారి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత కూడా ఆయనకు ఉన్నదని చెపుతారు. నియోజకవర్గంలో రహదారులను ఏర్పాటు చేయడంలో ఆయన కృషిచేశారు. కనీస రహదారి లేని గ్రామాలకు మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు రహదారి సౌకర్యాలు కల్పించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ద్వారా హుజూర్‌నగర్, కోదాడ రెండు నియోజక వర్గాలకు సంబంధించిన అనేక గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయించారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలలో వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషిచేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాలకు సాగర్‌నీటిని తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఇప్పటికీ ఆయా ప్రాంతాల ప్రజలు కొనియాడుతారు. పీవీ నర్సింహారావు మంత్రి వ ర్గంలో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన అప్పటి కాలువల ఏర్పాటులో ఎంతో కృషిచేశారు. రాజకీయంగా ఆయన రాష్టంలో మంచి గుర్తింపు తెచ్చుకుని జాతీయ నాయకులతో మంచి సత్సంబంధాలను కొనసాగించారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కోదాడకు వచ్చిన సందర్భముగా ఆయనను అభినందించి కేంద్రంలో ఆయన సేవలు వినియోగించు కుంటామని చెప్పారు. అనంతరం ఆమె హత్యకు గురికావడంతో రాజకీయ జీవితానికి అవరోధం ఏర్పడింది. పీవి నర్సింహారావుకు బంధువు, అత్యంత ఆత్మీయుడు అయన వాసుదేవరావుకు మారుతున్న రాజకీయ పరిణామాలతో రాజకీయ జీవితానికి విఘాతం కల్గింది. ఆప్కాబ్ చైర్మన్, ఖాధీ భాగ్యనగర సమితి చైర్మన్ ఆయన కొనసాగారు. జాతీయ స్థాయిలో ఆయనకు మణిశంకర్ అయ్యర్ తదితర ఆనాటి నాయకులతో సత్సంబంధాలు ఉండేవి. రాష్ట్రంలో నాటి నాయకులు, సినిమా పరంగా ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సి నారాయణరెడ్డి, దాశరథిలతో సంబంధాలను కొనసాగించారు. రాష్ట్రానికి జాతీయ నాయకులు ఎవరు వచ్చినా వారి ప్రసంగాలను ఆయనే అనువదించే వారు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో అసెంబ్లీలో పలు సమస్యలపై ఆంగ్లలో మాట్లాడుతుంటే సభ ఆసాంతం ఆలకించేదని నాటి తరం నాయకులు అనుకుంటూ ఉండేవారు.

# పరబ్రహ్మా స్వరూపుడు గురుదేవుడు

గురు దేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

ఆషాఢ శుద్ధపౌర్ణమిని 'గురుపౌర్ణమి' లేదా 'వ్యాసపౌర్ణమి' అని అంటారు. గురువును బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపంగా పూజించే ఉత్కృష్టమైన సంస్కృతి మనది. గురువు త్రిమూర్తి స్వరూపుడు. బ్రహ్మల్గా నాన్ని మనలో పుట్టించి , విష్ణువులా రక్షించి, శివుడిలా అ్ఞనాన్ని తుంచి మంచి చెడులను విశదీకరించి, మానవతా విలువలు, సద్గుణ సంపన్నతలు ఎలా పొందాలో నేర్పుతాడు. గురు పూర్ణిమను పురస్కరించుకుని గురువులను స్మరించడం వల్ల త్రిమూర్తులను పూజించిన పుణ్యఫలం లభిస్తుంది. ఆది యోగి, ఆది గురువైన మహా శివుడు ఆషాఢ పౌర్ణమి నాడు, సప్తర్షులకు జానబోధ చేశాడని శివపురాణం చెబుతున్నది. ఆషాఢ పౌర్ణమి దత్తాత్రేయుడు తన శిష్యులకు జ్ఞాన బోధ చేసిన రోజుగా దత్త చరిత్ర చెబుతుంది. వ్యాస మహాముని ఈ రోజున సత్యవతీ శంతనులకు జన్మించాడని, కొన్ని సంవత్సరాల తర్వాత ఆయన ఇదే రోజున వేదాలను ఋక్, యజుస్, సామ, అథర్వణ వేదాలుగా విభజించాడనీ ప్రతీతి. ఈ పుణ్య విశేషాలను పురస్కరించుకుని ఆషాడ పౌర్ణమి నాడు గురు పూర్ణిమగా, వ్యాస పూర్ణిమగా జరుపు కుంటాము. మనం ఏ రంగంలోనైనా రాణించాలంటే, అనుకున్నది సాధించాలంటే ఉన్నతంగా ఎదగాలంటే గురువు మార్గదర్శకత్వంలో శిక్షణ అత్యంత అవసరం. నిత్యానిత్యాలను వివరించి, వివేక జ్యోతిని వెలిగించి, ప్రగతి పథంలో నడిపించేవాడు గురువు. అందుకే "కృష్ణం వందే జగద్గురుం" అన్నారు. గీతాచార్యుడైన శ్రీకృష్ణభగవానుడు మనకు ఎన్నో విషయాలను బోధించాడు.

"దేవానాంచ ఋషీణాంచ గురుంకాంచన సన్నిభం
బుద్ధిమంతం త్రిలోకేశం తం నమామి బృహస్పతిం"

నవగ్రహాలలో గురుగ్రహం ఒకటి. దేవగురువు బృహస్పతి. గురు గ్రహానికి బృహస్పతి అని పేరు. సూర్యుని నుండి 5వ గ్రహం గురు గ్రహం. ఇతర గ్రహాల కంటే దీని బరువు రెండున్నరెట్లు ఎక్కువ. ఆంగ్లంలో గురు గ్రహాన్ని జుపిటర్ అని అంటారు. రోమన్ దేవతైన జుపిటర్ పేరు మీదుగా దీనికి ఆ పేరు వచ్చింది. గురుగ్రహం తన చుట్టూ తాను తిరిగి రావడానికి 9గం.50 ని.ల పడుతుంది. సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి 11.86సం.ల కాలం పడుతుంది. గురు గ్రహానికి 16ఉపగ్రహాలు ఉన్నాయి. గురు గ్రహం పసుపు పచ్చగా కనిపిస్తుంటుంది. గురువు అంటే సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడు. గురువు శిష్యులలోని అజ్ఞానాంధకారాలను నిర్మూలించి జ్ఞానాన్ని, వెలుగును అందించే వాడు. పురాణాల ప్రకారం దేవతల గురువు బృహస్పతి. సప్త ఋషులలో అంగీరస పుత్రుడు బృహస్పతి. బాల్యంలోనే మహా పండితుడు. బుద్ధిమంతుడైనాడు. వేదాలను కూలంకశంగా అధ్యయనం చేసి, శాస్త్రాలను లోతుగా పరిశీలించి, రూప, గుణ, శీలంతో ప్రకాశించాడు. పరమేశ్వరుడైన శివుని ఆరాధించి అతడిని ప్రసన్నం చేసుకున్నాడు. పరమ పావనమైన కాశిలో శివలింగ ప్రతిష్ఠ చేసి ఘోర తపస్సుచేసి, శివుని అనుగ్రహాన్ని పొందాడు. గురువారం బృహస్పతిని స్మరిస్తూ నామకరణం చేయ బడింది. మానవుల ప్రవర్తనను నిర్ధారించే నవగ్రహాలలో బృహస్పతి ఒకటి. ఇతనికి వాచస్పతి అని మరొక పేరు కూడా ఉంది. కొన్ని వేదము ఋక్కులలో బృహస్పతిని అగ్ని అని భావించారు. గురువు – యజమానులకు పురోహితుడు. దేవతలకు గురువు. గురువు గుణాలకు అతీతుడు. ప్రకృతిలో కనిపించే ప్రతి అంశము మనకు గురువు. గురువు లేకుండా ఏ విద్య రాణించదని శాస్త్ర వచనం. అయోమయ స్థితిలో ఉన్న మనకు ఆనందం మన అంతరాత్మలోనే ఉందని గుర్తు చేసే మహాత్ముడే గురువు. మనం ఏ రంగంలోనైనా రాణించాలంటే, అనుకున్నది సాధించాలంటే ఉన్నతంగా ఎదగాలంటే గురువు మార్గ దర్శకత్వంలో శిక్షణ అత్యంత అవసరం. నిత్యానిత్యాలను వివరించి వివేక జ్యోతిని వెలిగించి ప్రగతి పథంలో నడిపించేవాడు గురువు. అందుకే కృష్ణం వందే జగద్గురుం అన్నారు. గీతాచార్యుడైన శ్రీకృష్ణభగవానుడు మనకు ఎన్నో విషయాలను బోధించాడు.

భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేకస్థానం ఉంది. యోగ సంప్రదాయంలో పరమ శివుడు ఆదియోగి. గురు సంప్రదాయంలో శివుడే ఆదిగురువు. పరమశివుడు తాండవం చేసే సమయంలో ఆయన చేతి ఢమరుకం నుంచి నాదం(శబ్దం) పుట్టింది. నాదం నుంచి వేదం పుట్టింది. ఈ వేదాన్ని శ్రీ మహా విష్ణువు బ్రహ్మదేవునకు ఉపాదేశించాడు (శివకేశవులకు బేధం లేదు, ఇద్దరూ ఒకే పరమాత్మ యొక్క భిన్న రూపాలు). బ్రహ్మదేవుడు ఈ వేదాన్ని ప్రామాణికంగా తీసుకుని సృష్టి చేశాడు. ఆ తర్వాత ఈ వేదాన్ని బ్రహ్మ దేవుడు తన కుమారుడైన వశిష్ట మహర్షికి, ఆయన తన కూమరుడైన శక్తి మహర్షికి ఉపదేశం చేశాడు. శక్తి మహర్షి తన పుత్రుడైన పరాశర మహర్షికి, ఆయన తన కుమారుడైన వ్యాస మహర్షికి ఉపదేశించాడు. వ్యాస మహర్షి ఆషాఢ పౌర్ణమి రోజున జన్మించాడు కాబట్టి, ఆ రోజుని వ్యాస పౌర్ణమిగా పేర్కొంటారు. వ్యాసుని అసలు పేరు కృష్ణ ద్వైపాయనుడు. నలుపు రంగులో ఉన్నవాడు కాబట్టి కృష్ణ అనీ, ద్వీపం (ద్వైపాయనము) మీద జన్మించినవాడు కాబట్టి ద్వైపాయనుడు అనీ ఆ పేరు వచ్చిందంటారు. అప్పటి వరకూ ఉన్న వేదాలన్నింటినీ ఒక చోటకు చేర్చి, వాటిని నాలుగు భాగాలుగా విభజించాడు కాబట్టి ఈ కృష్ణ ద్వైపాయనుడు 'వేద వ్యాసుడు'గా మారాడు. వేదవ్యాస మహర్షి మానవ జాతికే గురువు. అందుకే ఆయన పేరిట వ్యాస పూర్ణిమ రోజున గురు పూర్ణిమగా పండుగను జరుపుకుంటున్నాం. ఈ రోజున దేశమంతా గురు పూజా మహోత్సవాన్ని జరుపుకుంటారు. వేదవ్యాసుడు అనగానే మహాభారతం కూడా గుర్తుకు వస్తుంది. వ్యాసుడు మహాభారత రచయితే కాదు, అందులో ఒక ముఖ్య పాత్ర కూడా! అసలు వ్యాసుడు లేనిదే భారతం లేదు. వ్యాసుని కారణంగానే ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురులు జన్మించారు. అంటే వ్యాసుడు లేకపోతే కౌరవ పాండవులే ఉండేవారు కాదు! వ్యాసుడు భారతాన్నే కాదు, భాగవతం సహా అష్టాదశ పురాణాలన్నీ రాశాడనీ... యోగ సూత్రాలకు భాష్యాన్ని అందించాడనీ అంటారు. ఇక బ్రహ్మ సూత్రాలను రాసింది కూడా వ్యాసుడే అని చెబుతారు. అంటే హిందూ సంస్కృతికి మూలమైన శాస్త్రాలన్నింటికీ వ్యాసుడు మూల పురుషుడన్నమాట. అలాంటి వ్యాసుని గురుపరంపరకు ప్రతినిధిగా భావించి, ఆయన పుట్టిన రోజుని గురువులను ఆరాధించే గురు పౌర్ణమిగా జరుపుకోవడం ఆచారంగా వస్తున్నది. ఏ వ్యక్తికైనా మొదటి గురువు తల్లే. ఆ తర్వాత మనకు జ్ఞానాన్ని అందించి... ఏది మంచో, ఏది చెడో చెప్పే వారు గురువులు. అలాంటి గురువులను పూజించడం కోసం నిర్ణయించిన తిథి గురు పౌర్ణిమ. "గు" అంటే అంధకారం లేదా అజ్ఞానాన్ని, "రు" అంటే నిరోధించుట లేక నశింప చేయుట అని అర్థం. అంటే గురువు అనే పదానికి అజ్ఞానాన్నినశింప చేయువారు అని అర్థం స్ఫురిస్తుంది. హిందూ సంప్రదాయాలు పాటించే భారతదేశం, నేపాల్, ఇంకా బుద్ధ, జైన సంప్రదాయాలు పాటించే చోట్ల గురు పౌర్ణిమను ఘనంగా జరుపు కుంటారు. ఆషాఢ శుద్ధ పూర్ణిమ రోజున విష్ణుమూర్తి, దత్తాత్రేయ, సాయిబాబా పూజతో పాటు ఆదిశంకరాచార్యుల వారిని కూడా పూజించడం ఆచారం. ఈ రోజున ప్రజలు తమ ఆధ్యాత్మిక గురువులను స్మరిస్తారు. పూజిస్తారు. కట్న కానుకలు ఇస్తారు. గుడికి వెళ్లి ప్రార్థిస్తారు, దేవుళ్ల నుంచి ఆశీర్వాదం తీసుకుంటారు. విద్యార్థి... సంఘానికి "దేహం" వంటివాడైతే గురువు... "ఆత్మ". అటువంటి గురువును ప్రతి యేటా సత్కరించుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే కాదు, సమాజం మీద కూడ ఉంది.

# దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి అమరేశ్వరి

సమాజంలో స్త్రీలకు సరైన గౌరవం, మర్యాద లభించని రోజుల్లో కొందరు మహిళలు, ముందుకు వచ్చి, పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని, స్వయం కృషితో వివిధ రంగాల్లో తమ సత్తా చాటుకుని గుర్తింపు పొంది, సాటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని ఆరోజుల్లోనే నిరూపించారు. తాము తలుచుకుంటే ఏమైనా సాధించ గలమని మహిళలు ముందుకు సాగారు. అలాంటి వారిలో జస్టిస్ అమరేశ్వరి ఒకరు. ఒక సాధారణ వ్యవసాయం కుటుంబంలో జన్మించిన ఆమె.. దేశంలో న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో పేదరికం, వివాహం, ఇతర అంశాలు ఏమాత్రం అడ్డురాదని నిరూపించిన ఆమె.. సాటి మహిళల్లో ఏమైనా సాధించగలమన్న చైతన్యాన్ని నింపారు. జస్టిస్ కె. అమరేశ్వరి (కోనమనేని అమరేశ్వరి) భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తిగా చరిత్ర పుటల కెక్కారు. గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10 వ తేదీన జన్మించారు. 14వ ఏటనే పెళ్ళి జరిగినా భర్త ప్రోత్సాహముతో చదువు సాగించారు. ఆమె 1949 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి పొలిటిక్స్ అండ్ హిస్టరీలో ఎంఏ డిగ్రీని పొంది, అదే విశ్వ విద్యాలయం నుండి బిఎల్, డిగ్రీని కూడా తీసుకున్నారు. డి.మునికన్నయ్య ఛాంబర్స్‌లో ఆమె అప్రెంటిస్‌షిప్ చేశారు. 1952 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాదిగా చేరారు. గుంటూరుకు, తరువాత హైదరాబాద్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మారగా ఆమె అదే వృత్తిలో కొనసాగారు. 1960-61 మధ్య కాలంలో బార్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. అక్టోబర్, 1974 లో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుండి 14-2-1977 వరకు రెండేళ్లపాటు అదనపు న్యాయమూర్తిగా పని చేశారు. భారత మహిళా న్యాయవాదుల సంఘమునకు ఉపాధ్యక్షులుగా, 1975-76 మధ్యకాలంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వర్తించారు.

1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కాగా, ఉమ్మడి హైకోర్టు తొలి మహిళా న్యాయ మూర్తిగా జస్టిస్ అమరేశ్వరి 29-4-1978 న శాశ్వత న్యాయ మూర్తిగా నియమితులయ్యారు. దేశములోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990 సంలో సీనియర్ గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ నుంచి గత 13 సంవత్సరాలుగా సుప్రీంకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సాధించిన మహిళ జస్టిస్ కొనమనేని అమరేశ్వరి, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమరేశ్వరి సమర్థించారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు చట్ట పరమైన పరిణామాలు' అన్న అంశంపై నిర్వహించిన ఒక సెమినార్లో ఆమె తన అభిప్రాయాన్ని ముక్కు సూటిగా వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందుకుంటున్న ప్రైవేటు సంస్థలు సిబ్బంది నియామకంలో రిజర్వేషన్లను అమలు చేయాలని గట్టిగా వాదించారు. మహిళలకు మార్గదర్శకురాలై, న్యాయ వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు పొందిన జస్టిస్ అమరేశ్వరి 2009, జులై 25 న కొత్త ఢిల్లీలో మరణించారు.

# కేర్ హాస్పటల్లో అత్యంత అధునాతన ఏఐ ఆధారిత రోబోటిక్ సర్జరీ సిస్టం ప్రారంభం






శేర్లింగంపల్లి , జూలై 09(వుదయం ప్రతినిధి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గల కేర్ ఆస్పటల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన స్ట్రైకర్స్ మాకు రోబోటిక్ సిస్టం ను క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా తో కలిసి స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా వైద్యశాస్త్రంలో పెను మార్పులు వచ్చాయని దానికనుగుణంగా పెరుగుతున్న మోచిప్పల శాస్త్ర చికిత్స విధానం కూడా పెను మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన అన్నారు. కొంత వయసు మీద పడి మగవారు మరియు ఆడవారిలో ఈమొ చిప్పల అరుగుదలతో ఈ మోచిప్పల మార్పిడి జరుగుతోందని ఈనాటి వైద్యం లో ఈ శాస్త్ర చికిత్స కీలకంగా మారిందని ఆయన అన్నారు. భారతదేశంలోని అత్యంత అనునాతన ఏఐ ఆధారిత రోబోటిక్ సర్జరీ సిస్టమును కేర్ ఆస్పటల్ హైటెక్ సిటీ నందు ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ రోబోటిక్ సిస్టం ఆర్థోపెటిక్ శాస్త్ర చికిత్స విధానంలో ఒక గొప్ప ముందడుగు అని ఆయన అన్నారు. రోగికి ఎటువంటి బాధ లేకుండా అతి శీఘ్రంగా ఈ శాస్త్ర చికిత్స ప్రక్రియ పూర్తి చేయవచ్చని, కేవలం 24 గంటలలో రోగిని ఇంటికి పంపించేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. రోగికి అనుగుణంగా ఏఐ ఆధారంగా 3డి సిటీ స్కాన్ ను ఉపయోగించి శస్త్ర చికిత్స ప్రణాళిక తయారు చేయబడుతుందని ఆయన తెలిపారు. అచ్చా ఆధునిక పరికరంతో తుంటి ఎముక మరియు బోన్స్ జాయింట్ల శస్త్ర చికిత్సలు అతి సునాయాసంగా ఈ అత్యాధునిక పరికరంతో ఇటువంటి ప్రమాదం లేకుండా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ మాట్లాడుతూ అత్యాధునికమైన రోబోటిక్ సిస్టం ద్వారా ఎటువంటి బాధ లేకుండా రోగికి వైద్య సహాయం అందించటం చాలా సంతోషించదగ్గ విషయమని ఆయన అన్నారు. మారుతున్న కాలానుగుణంగా వైద్యశాస్త్రంలో వచ్చిన మార్పులకు ఇది ఒక ఉదాహరణ అని, వైద్యులు ఎంతో శ్రద్ధతో రోగులకు సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. మనం తీసుకునే ఆహారాలలో పోషకాలు లేని కారణంగా ఎముకలలో బలం తగ్గి మోచిప్పలు అరగదల ప్రారంభమైందని దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు. వయసు మీద పడిన పెద్దవారికి ఈ మోచిప్పల అరుగుదల ఎక్కువగా కనిపిస్తోందని ఈ అత్యాధునిక వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ ,గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ సెలబ్ డాంగ్, ప్రముఖ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ అశోక రాజు గొట్టుముక్కల ,డాక్టర్ వాసుదేవ జువ్వాడి ,డాక్టర్ జగన్మోహన్ రెడ్డి ,డాక్టర్ శరత్ బాబు ,ఇతర సీనియర్ డాక్టర్లు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉదారతాను చాటుకున్న పూర్వ విద్యార్థులు..

## –తాము చదుకున్న పాఠశాలకు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ అందజేత.

రామకృష్ణాపూర్/జూలై 09(వుదయం ప్రతినిధి) రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ 1990–91 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ .30 వేల విలువైన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను అందజేశారు.



బుధవారం పాఠశాలలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు మందమర్రి మండల విద్యాధికారి దత్తు మూర్తి చేతుల మీదుగా ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారి మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు 1990– 91 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని పాఠశాల చదివిన ఇతర విద్యార్థులు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ .శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోమల, పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ లక్షెట్టి లక్ష్మణ్ మూర్తి, కో కన్వీనర్లు బావండ్ల పెల్లి శ్రీనివాస్, ఈదునూరి సారంగరావు, పి. రమాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు లాటరీ ద్వారా డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు





రామకృష్ణాపూర్/జూలై 09(వుదయం ప్రతినిధి) క్యాతనపల్లి మున్సిపాలిటీలో అర్హులైన లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్రూం ఇండ్లను రెవెన్యూ అధికారులు బుధవారం కేటాయించారు. స్థానిక సింగరేణి ఆర్కేసిఓఏ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారుల సమక్షంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ సతీష్ కుమార్ ముందుగా వికలాంగులకు పదమూడు ఇండ్లను అలట్మెంట్ చేసిన అనంతరం ఇతరులకు అలట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిర్మించిన 286 ఇండ్లకు గాను 230 ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని ఇప్పటికి అనర్హులుగా ఎవరైన ఉన్నట్లయితే తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చున్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండానే పారదర్శకంగా అందరి సమక్షంలోనే ఇండ్ల కేటాయింపు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె విజయవంతం.

## –రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం కి కనువిప్పు కలగాలని అంబేద్కర్ విగ్రహనికి వినతి. –కాసిపేట గనుల కార్మిక సంఘాల నాయకుల ర్యాలీ,నిరసన





కాసిపేట జులై 9 (వుదయం విలేకరి)బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1 ఇంక్లైన్,2 ఇంక్లైన్ గనులలో లో జేఏసీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణి లో తలపెట్టిన సమ్మెను విజయం అయ్యిందని జేఏసీ ఏఐటియుసి ఐఎన్టియుసి సిఐటియూ టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. బుధ వారం జరిగిన అన్ని సమ్మెటలో అని సంఘాల యూనియన్ ప్రతినిధులందరు పాల్గొన్నారు.కాసిపేట గనులపై కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై సమ్మె ప్రభావాన్ని పరిశీలించారు.విధులకు కార్మికుకు రాకుండా వారి నిరసన ను తెలియచేసి సమ్మెను విజయవంతం చేసినందుకు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబిజికేఎస్ ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్,ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మన్ దాస్,టీబిజిక్స్ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బెల్లం అశోక్ ఉద్యోగుల కు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఉద్యోగులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందించారు.భారత రాజ్యాంగం లో కార్మికుల కు హక్కులు కల్పిస్తే మోడీ ప్రభుత్వం, బిజెపి వాటిని కాలరాస్తుందని.హాక్కులను తొలగిస్తూ రాజ్యాంగానికి తూట్లుపొడుస్తున్నారని, మోడీకి కనువిప్పు కలగాలని, బిజెపి ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగాలని జేఏసీ నాయకులు అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం సమర్పించారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేస్తూ,ప్రవేటుకు అప్పచెపుతూ బొగ్గు గనులు బడా పారిశ్రామిక వేత్తలకు అప్పచెప్పుతూనే ఉంది.అదాని, అంబానీలకు మేలు చేసేందుకే పని చేస్తుందని అన్నారు.ఢిల్లీ వేదికగా జరిగిన రైతుల పోరాటాలను ఆదర్శంగా తీసుకొని పని గంటలకు పెంచి శ్రమ దోపిడీకి కుట్రలు చేస్తుందని అన్నారు.సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.4 కోడ్ లు చేయడమంటే కార్మిక రంఘాన్ని విచ్చిన్నం చేయడమేనని అన్నారు. ఐ ఎన్ టి యు సి సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్ మాట్లాడుతూ సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలుపుతూ గత పోరాటాలను ఆదర్శంగా తీసుకొని సింగరేణి కార్మికులు బిజెపి పై తిరుగుబాటు చేసారని, ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తగ్గి కార్మికుల హాక్కులకు భంగం కల్గించకుండా ఉండాలని అన్నారు.44 చట్టాలను 4 కోడ్ లుగా చేసి బడా పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను దోచుకునేల వ్యవకరిస్తుందని,ఈ సమ్మె ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు,దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసి , విమానయాన రంగం,నౌకాయాన,రైల్వే రంగంతోపాటు ఆఖరుకు రక్షణ రంగం కూడా ప్రవేటికరణ చేస్తోందని.అమ్మకానికి అంతరిక్ష పరిశోధన లను కూడా పెడుతుందని అన్నారు. టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ బైరి శంకర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు చట్టాలను మారుస్తూ 44 చట్టాలను 4 కోడ్ లుగా చేసి కార్మిక వర్గాలను బజారున వేసేందుకు పనిచేస్తుందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలయడమే బిజెపి ప్రభుత్వం చేస్తున్న పని అని అన్నారు.ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మినారాయణ మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె అందరూ పాల్గొని సక్సెస్ చేసిన ఉద్యోగులను అభినందించారు.ఇలాంటి పోరాటపటిమను ఐక్య ఉద్యమాలతో కొనసాగించి మోడీకి గుణపాఠం చెప్పాలని కోరారు,మోడీకి అనుకూల పారిశ్రామిక వేత్తలు రుణ మాఫీ జేసి దేశ ఆర్థిక వ్యవస్థ ను చిమ్మ భిన్నం చేయిందని,వారి అప్పులను దేశ ప్రజలపై మోపింది అన్నారు.అనంతరం ర్యాలీగా సోమగుడెం చేరుకుని జాక్ నాయకులు నిరసన లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టియ్నుసి సెంట్రల్ కమిటీ చీప్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్,ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య,టీబిజిక్స్ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బెల్లం అశోక్ ఏఐటీయూసీ కాసిపేట 2 ఇంక్లైన్ పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, కాసిపేట అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ వర్ధమల్ల రాజేందర్,పర్వతి సురేష్,దేవులపల్లి శ్రీనివాస్, ఐ ఎన్ టి యూసి నాయకులు

సోగాల కన్నయ్య,రవి కిరణ్,తిరుపతి,ఓదెలు రాజ్కుమార్,అనిల్,సంపత్,రాజేశం,ముత్యాల.నాగేష్,యు రాజకుమార్, శ్రీమన్, దినేష్, రోహిత్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, టీబీజీకేఎస్ నాయకులు చోల్లంగి శ్రీనివాన్, బెల్లం అశోక్,తోకలు రవేష్, అబ్దులుద్దీన్,రమేష్,సతీష్,అరుణ్,భిక్షపతి,రవి,చిప్పరి శ్రీహరి,రఘురామ్,బల్లెం శ్రీనివాస్,రవి,చౌద లింగయ్య, వర్క్ మెన్ ఇన్సఫెక్టర్ జంజీరాల రంజిత్ కుమార్,సపాట్ అశోక్,సెగ్గెం శంకర్,రాజేష్,అందే శ్రీకాంత్,చేన్నవేని రవి,కొలగాని శ్రీనివాస్,రోహిత్,పెయింటర్ రాజన్న ఉద్యోగులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి






కొత్తగూడ జులై 09(వుదయం ప్రతినిధి): దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా కొత్తగూడ మండల కేంద్రంలో భారత కార్మిక సంఘాల సమైక్య, ఐఎఫ్టియు, అంగన్వాడి, ఆశ వర్కర్స్, తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ సంఘం , అఖిల భారత రైతు సంఘం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐఎఫ్టియు, టి యు సి ఐ, టిఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి కొత్తగూడ అంబేద్కర్ సెంటర్లో రాస్తారోకో చేసి తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ వర్కర్స్ సంఘం ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ వెంకన్న అధ్యక్షతన గ్రూప్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు ఇ శ్రీశైలం, ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి పసునూరి రాజమల్లు, ఏఐఎఫ్టియు, సిపిఐ ఎంఎల్, బుర్ర ఆనంద్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కొమ్మనబోయిన వేణు, టి యు సి ఐ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులుపూనెం ప్రభాకర్ లు పాల్గొని మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసత్వానికి గురి చేసే లేబర్ కోర్సును ప్రతిఘటించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ స్కీమ్స్ వర్కర్ల క్రమబద్ధీకరణ కోసం ఉద్యమించాలని, కనీస వేతనం నెలకు 26,000 ఇచ్చి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాన్ని వెంటనే ఆపాలని, 8 గంటల పని దినాన్ని పరిరక్షించుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ తదితర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని విద్యారంగ సమస్యలను పరిష్కరించి, దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేయడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ వెంకన్న, మోటర్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు భూక్యారామ్ సింగ్, పి వై యల్ మండల కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, అంగన్వాడి టీచర్, ఆయలు, సోమలక్ష్మి, సరిత, లక్ష్మి, తిరుపతమ్మ, శ్రీలత, యాకమ్మ, లక్ష్మి, సరోజన, వెంకటమ్మ, కొత్తగూడసర్కిల్ నుండి సమ్మక్క, స్వప్న, రేవతి, బుచ్చమ్మ, జయసుధ, రాధా, ఎం శ్రీలత, కే నాగమణి, కే విజయ, నీలమ్మ, శ్రీకాళ , కల్తి రమణయ్య, మల్లేష్, పూనం రవికుమార్, హైమద్ పాషా టిఆర్ఎస్ కొత్తగూడ మండల అధికార ప్రతినిధి భానోత్ నెహ్రూ , రవి, తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా తృతీయ మహాసభలు...

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
## ఎమ్మెల్సీ ఎల్ రమణ
## ఎమ్మెల్యేలు డాక్టర్ యం సంజయ్ డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
## కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు





జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డులో గల సుమంగళి గార్డెన్లో బుధవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జగిత్యాల జిల్లా తృతీయ మహాసభలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్సీ ఎల్ రమణ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు లు పాల్గొన్నారు



ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ ప్రజా సమస్యలను పత్రికల ద్వారా ప్రచురిస్తూ ప్రభుత్వం ద్వారా పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్సీ ఎల్ రమణ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు అనుబంధ)జగిత్యాల జిల్లాలోని వివిధ మండలాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.

**ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి**
**బిజినపల్లి లో నూతన సీసీ కెమెరాల ఏర్పాటు**
**ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్**

నాగర్ కర్నూల్ జూలై 09(వుదయం ప్రతినిధి)నేరాలను కట్టడి చేయడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రజలు ముందుకు రావాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారంనాడు జిల్లాలోని

బిజినపల్లి మండల కేంద్రంలో నూతన సీసీ కెమరాలను ఏర్పాటు చేశారు.ఈ సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజినపల్లి మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. నేరాలను నిరోదించేందుకు భవిష్యత్తులో పోలీస్ శాఖకు మరిన్ని సాంకేతిక వనరులు సమకూర్చేందుకు తాను మద్దతుగా ఉంటానని ఎమ్మెల్యే




హామినిచ్చారు.ప్రజల సురక్షిత జీవనానికి పోలీస్ శాఖ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఈ సీసీ కెమెరాలు భద్రతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ప్రస్తుతం మహిళలపై అత్యాచారాలు, నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు మహిళల రక్షణకు ఒక శక్తివంతమైన ఆయుధమన్నారు. వీధుల్లో ట్రాఫిక్ జామ్ తో పాటు రోడ్డుప్రమాదాలను తగ్గించడంలో కూడా ఈ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారుసీసీ కెమెరాలు ఉండడం వల్ల నేరస్తుల్లో భయం పెరిగి ప్రజల్లో భద్రత పట్ల భరోసా ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండల కేంద్రంలో కూడా సీసీ కెమెరాల నెట్వర్క్ ను విస్తరించాలన్నది మా లక్ష్యం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కెమెరాల కు సహకారం చేసిన వారిని ఘనంగా సన్మానించారు . కార్యక్రమంలో నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు , డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ , సీఐ అశోక్ రెడ్డి మరియు నియోజకవర్గ ఎస్ఐ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న మధిర డిపో ఆర్టీసీ కార్మికులు



మధిర జూలై 9( ప్రుదయం ప్రతినిధి) కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొనడం జరిగింది. మధిర డిపో ఆర్టీసీ కార్మికులు తమ విధులను బహిష్కరించి సార్వత్రిక సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కార్మికులకు ప్రయోజనమయ్యే చట్టాలను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు,ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తిమ్మినేని రామారావు మధిర డిపో జేఏసీ యకులుఅరుణకుమారి,పద్మావతి, రామచంద్రా రావు, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా,కాలేశా, లేలిన్, శ్రీనివాసరావు,అనిత తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే లో పాల్గొన్న ఉపాధ్యాయులకు వెంటనే రెన్యుమరేషన్ చెల్లించాలి: నాగూర్ వలి టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి



మధిర జూలై 9 (ప్రుదయం ప్రతినిధి) సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని, సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు తక్షణమే డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి ఆధ్వర్యంలో ఈరోజు పాఠశాలల లంచ్ విరామ సమయంలో మధిర తహసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొని అంకితభావంతో విజయవంతం చేశారని సర్వే పూర్తయి సంవత్సరం అవుతున్నా ఇంతవరకుసంబంధిత ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వడం గానీ డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వటం గాని జరగలేదని ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని కొన్ని మండలాలు ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ ఇచ్చారని, తహసిల్దార్ కార్యాలయం నుండి సర్టిఫికెట్లు ఇచ్చినట్లయితే ఉపాధ్యాయులు సిసిఎల్ ఉపయోగించుకోవటానికి వీలు పడుతుందని,కావున సమస్యను అర్థం చేసుకోవాలని వెంటనే డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కార్యదర్శి నాగూర్ వలి తహసీల్దారుకి విజ్ఞప్తి చేయడం జరిగింది. టీఎస్ యుటిఎఫ్ ప్రాతినిధ్యానికి మధిర తహసిల్దార్ స్పందిస్తూ సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు తక్షణమే డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ప్రాతినిధ్యం చేసిన వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయటానికి అంగీకరించిన మధిర తాసిల్దార్ కి టీఎస్ యుటిఎఫ్ కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ నాయకులు లాల్ అహ్మద్, విజయ్ కుమార్, గుర్రం శ్రీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తిపీఠంలో నేడు గురు పౌర్ణమి ఉత్సవాలు



నారాయణపేట టౌన్ జూలై 09(ప్రుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠంలో నేడు గురు పౌర్ణమి ఉత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు పూజశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద పురోహిత్ తెలిపారు. స్వామి శాంతనంద సభ మండపంలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా సాయంత్రం 6 గంటలకు శ్రీ వేద వ్యాస మహర్షి పూజా కార్యక్రమం, గురుపూజోత్సవం, శక్తిపీఠం మార్గదర్శకులు ఆధ్యాత్మిక గురువులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ యజ్ఞ నారాయణ పురోహిత్ వారికి పాదపూజ,గురువందన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 8-30 గంటలకు శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద పురోహిత్ అనుగ్రహ భాషణము, 9 గంటలకు వేదాశీర్వచనం ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేద లబ్ధిదారుల బ్రతుకులు అస్తవ్యస్తం.

**-బి.ఎస్.పి భూపాలపల్లి జిల్లాఅధ్యక్షులు. పొన్నం బిక్షపతి గౌడ్.**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కష్టాలు చూస్తే వర్ణనాతీతంగా ఉందని పొన్నం భిక్షపతి గౌడ్ గారు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాలకవర్గం బాధ్యత వహించాలని ఇండ్ల మంజూరుతో ఉన్న ఇండ్లను కూలకొట్టుకోనీ వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఇచ్చే 5లక్షల రూపాయలలో 3లక్షల 50 రూపాయలకు పైన కూలి మేస్త్రీలకే ఖర్చుయితున్నాయని ధనిక అగ్రవర్ణాలు తప్ప నిరుపేదలైనా బిసి ఎస్సి ఎస్టి మైనార్టీలు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే ప్రస్తుత పరిస్థితుల్లో లేరని అలాంటి నిరుపేదలకు ప్రభుత్వమే ఇల్లు కట్టించాలని ఈ పథకాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని వ్యవసాయ పెట్టుబడుల కాలంలో ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసే అవకాశం లేనందున ప్రభుత్వం దృష్టి సారించాలని ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సాధించింది శూన్యం అని ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను జనాలలో ఎండకడతామని ఆయన అన్నారు .

## జువ్వాడి భవన్ లో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు.

**-కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగరావు**



కోరుట్ల జూలై 09 (ప్రుదయం ప్రతినిధి) మెట్పల్లి పట్టణంలో గల జువ్వాడి నర్సింగరావు స్వగృహం జువ్వాడి భవన్ లో పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమం శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ సీతక్క ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు సీతక్క అని పిలువబడే దన్సరి అనసూయ జననం 9జూలై 1971 ఒక భారతీయ రాజకీయ నాయకురాలు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమం శాఖలకు క్యాబినెట్ మంత్రిగా పనిచేస్తున్నారని ఆమె తెలంగాణ శాసనసభలో ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు ఆమె 2009 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు 2018 , 2023లో తెలంగాణ శాసనసభ ఎన్నికలలో విజయం సాధించింది ఆమె జూన్ 2018లో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారని ఆగస్టు 2019లో ఛత్తీస్‌గఢ్ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారన్నారు ఆమెను కొన్నిసార్లు తెలంగాణ ఉక్కు మహిళ అని పిలుస్తారన్నారు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తోపాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ ధర్మామీటర్ అందించిన గంగాధర్



నారాయణపేట టౌన్ జూలై 9(ప్రుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లా దామర్ గిద్ద మండలంలోని బాపన్ పల్లి, క్యాతన్ పల్లి, దామర్ గిద్ద ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఆటోమాటిక్ సెన్సార్ తో కూడిన డిజిటల్ ధర్మామీటర్లను బుధవారం అందజేశారు. అపోలో హాస్పిటల్ సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ ఏ.గంగాధర్ ప్రభుత్వ పాఠశాలలకు ఈ డిజిటల్ పరికరాలు అందచేశారు. పరికరాలు ఉచితంగా అందజేసినందుకు అపోలో హాస్పిటల్ సీనియర్ మేనేజర్ ని పలువురు అభిన%శీ%దించారు.

## ఫార్మర్ భూదార్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**-వ్యవసాయ విస్తరణ అధికారి యువరాజ్**




అలంపూర్ జూలై 09 (ప్రుదయం ప్రతినిధి) అయిజ శివారులోని పొలాలు కలిగి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూధార్ కార్డు యొక్క రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి యువరాజ్ అన్నారు. మీరు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని యెడల పిఎమ్ కిసాన్ లో వచ్చే సంవత్సరానికి 6000 రూపాయల సహాయాన్ని పొందలేరు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఏ ఇతర పథకాలు కూడా పొందలేరు. కాబట్టి ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా అయిజ రైతువేదిక నందు నమోదు చేయబడునని అయిజ వ్యవసాయ విస్తరణ అధికారి యువరాజ్ తెలిపారు. పొలం కలిగిన రైతు ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకంతో పాటు ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ తీసుకుని స్వయంగా రైతు తప్పనిసరిగా రావాలని తెలిపారు.

## విధులకు ఆటంకం కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



గద్వాల జూలై 09 (ప్రుదయం ప్రతినిధి) విచారణకు వెళ్లిన రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసన గా మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పరుమాల శివారులో గల పొలం సర్వే కోసం విచారణకు వెళ్లిన ఆర్ఐ రామకృష్ణను, సిబ్బందిని ఇటిక్యాల హెడ్ కానిస్టేబుల్ జ్యోతిప్రకాష్, అతని కుమారుడుతో పాటు భార్య అడ్డుకోవడంతోపాటు అధికారుల్ని అడ్డుకొని, అసభ్యపదజాలంతో తిడుతూ విధులకు ఆటంకం కలిగించారని విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకొని, రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ, అధికారులు పాల్గొన్నారు.

## రామాలయ తాత్కాలిక కమిటీ ఏర్పాటు



జన్నారం, జూలై 9(ప్రుదయం విలేకరి) జన్నారం పట్టణంలోని శ్రీ సీతారామ దేవాలయ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ కన్వీనర్ ఎం.నర్సింగరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గా ఇన్ని సంవత్సరాలు కొనసాగిన మిక్కిలినేని రాజశేఖర్ ఆదివారం రోజున రాజీనామా చేయడంతో ఈ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం రోజున ఆ దేవాలయంలో తాత్కాలిక కమిటీ సభ్యులుగా గుండ సుధాకర్,మేచినేని మోహన్ రావు,వేగే రామకృష్ణ,గోలి చందు, గోలి రాము లను నియమించారు. ఈ తాత్కాలిక కమిటీ 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కాగా ఆలయ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడానికి పొనకల్ పట్టణానికి చెందినవారై ఉండి హిందూ సాంస్కృతిక సాంప్రదాయాలను గౌరవించేవారు తమ వివరాలను 20వ తేదీలోగా తాత్కాలిక కమిటీకి తెలియజేయాలని కోరారు. దాతలు,గ్రామస్తులు,ఆధ్యాత్మిక మార్గంలో ఉండే వారు కమిటీ చైర్మన్ గా వ్యవహరించి ఆలయానికి సేవచేసే వారికి మాత్రమే అవకాశం ఉంటుందని వారన్నారు.

## మధిరలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



మధిర జూలై 9 (ప్రుదయం ప్రతినిధి) భారతదేశవ్యాప్తంగా జరిగిన జాతీయ సమ్మె కు మద్దతుగా మధిర పట్టణంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ఆశ వర్కర్లుఅంగన్వాడీలు మధ్యాహ్న భోజన వర్కర్లు ఆటో వర్కర్లు మున్సిపల్ వర్కర్లు ఎలక్ట్రికల్ వర్కర్లు వివిధ రంగాలకు చెందిన కార్మికులు కార్మిక సంఘ నాయకులు కాంగ్రెస్ సిపిఎం టిడిపి సీపీఐ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సభలో సిఐటియు జిల్లా నాయకులు శీలం నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలను రూపొందించి కార్మికులకు సంఘం నిర్మించుకునే హక్కు పని గంటల హక్కు పని భద్రత హక్కు ఇతర హక్కులను అణిచివేయాలని కేంద్రం చూస్తోందని దీనిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకొని రావాలని పంటలకు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని రైతాంగాన్ని ఆదుకోవాలని పంటలకు సరిపడా ఫెర్టిలైజర్స్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్లు ఆశ వర్కర్లు అంగన్వాడీలు హమాలీ వర్కర్లు ఆటో వర్కర్లు పని భద్రత కల్పించాలని కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక మతోన్మాద పోకడలను ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మధిర మండల పట్టణ కార్యదర్శిలు మంద సైదులు, పడకంటి మురళి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీ, టీడీపీ మండల అధ్యక్షులు మార్నీడు పుల్లారావు, కోనేరు రాణి,సిపిఐ మండల కార్యదర్శి ఓట్ల కొండలరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు వివిధ రకాల ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్సిసి క్యాడెట్లకు "సర్టిఫికెట్ల" అందజేత




శాలిగౌరారం, జూలై 9, (ప్రుదయం ప్రతినిధి): ఇటీవల సికింద్రాబాద్ లో జరిగిన టీఎన్ "సి" క్యాంపు షూటింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని వల్లాల ఆదర్శ పాఠశాల ఎన్సిసి క్యాడెట్లకు ఆర్మీ అధికారులైన సుబేదార్ సత్పాల్ సింగ్ , హవల్దార్ మహమ్మద్ ఇబ్రహీం, హవల్దార్ రాజు సర్టిఫికెట్లను, జ్ఞాపకను అందజేశారు. అనంతరం జూనియర్ ఎన్సిసి శిక్షణ కొరకు 52 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ 31(టి) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్యా రెడ్డి పాఠశాలను సందర్శించి ఎన్సిసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ... ఎన్సిసి ద్వారా విద్యార్థులకు దేశభక్తితో పాటు క్రమశిక్షణ అలబడుతుందని, ఎన్సిసి సర్టిఫికెట్ తో ఉన్నత విద్య,ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్సిసి శిక్షకురాలు సంధ్యా రాణి పాల్గొన్నారు.

## గంజాయి వ్యసనాలపై నార్కోటిక్స్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు



హుస్నాబాద్ కోహెడ జూలై 09 (ప్రుదయం ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రం మరియు పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాల నివారణకు సంబంధించి నార్కోటిక్స్ డాగ్స్ తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నుమానాస్పద ప్రదేశాలైన కిరాణా షాపులు, టీ కొట్లు, పాన్ షాపులు మొదలైన చోట్ల ఈ తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా ఎస్ఐ అభిలాష్ గారు మాట్లాడుతూ: "పోలీస్ కమిషనర్ మేడం గారి ఆదేశాల మేరకు మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి కలిగి ఉండడం, విక్రయించడం, రవాణా చేయడం చట్టానికి విరుద్ధం. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు లేదా పాన్మసాలా ప్యాకెట్ల రూపంలో దాచినా కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ప్రతి పౌరుడు సహకరించి గంజాయి రహిత సమాజం కోసం ముందుకు రావాలి. యువత తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని సూచించారు గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సమాచారం ఉంటే

-డయల్ 100

-టోల్ ఫ్రీ నెంబర్: 1908 (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో)

లేదా కోహెడ పోలీసులకు నేరుగా తెలియజేయవచ్చు ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్, కోహెడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఐదు గ్రామాల విలీనానికి విరుద్ధంగా అధికార పార్టీ అడ్డంకులు మల్లికార్జున రెడ్డి



హుస్నాబాద్ (ప్రుదయం) జూలై :09 హుస్నాబాద్ మండలంలో కలుపాల్సిన గౌరవెల్లి, గోవర్ధనగిరి, రేగొండ, చౌటపల్లి, జనగామ గ్రామాల విలీనాన్ని అధికార పార్టీ నేతలే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి ఆరోపించారు ఇప్పటికే పది నెలల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రజలకు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. అక్కన్నపేట్ మండలానికి దూరంగా ఉన్న ఈ గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం ఎదురు చూస్తే, బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉంది," అని మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పర్శరాములు, పార్టీ నాయకులు పాకాల శ్యామ్ సుందర్ గౌడ్, గోపగోని అరవింద్ గౌడ్, బైరగోని శ్రీనివాస్, ఎమ్.డి. అజీజ్, మంద లింగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఏ బి వి పి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.






గద్వాల జూలై 09 (వుదయం ప్రతినిధి) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గద్వాల నగరంలో ఏబీవీపీ జెండా ఆవిష్కరణ చేశారు. తదనంతరం ర్యాలీ నిర్వహించడం జరిగింది గద్వాల నగరంలోని రామానంద తీర్థ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వరల్డ్ ఆర్గనైజింగ్ ఆఫ్ స్టూడెంట్ అండ్ యూత్ నేషనల్ కన్వీనర్ చలమాల నిఖిత పాల్గొన్నారు. దేశంలో 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఓం ప్రకాష్ బెహల్ అనే ప్రొఫెసర్ చే ప్రారంభమైన ఏబీవీపీ నేడు ప్రపంచంలో కొన్ని లక్షల సభ్యత్వాలతో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక విద్యాసంస్థ ఏబీవీపీ అన్నారు. నేటికీ 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మండల సెంటర్లలో, ప్రతి హై స్కూల్ సెంటర్లో ఏబీవీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అదేవిధంగా భారతదేశానికి స్వతంత్రం 1947లో రావడం జరిగింది దానికంటే ముందు దేశం కోసం స్వతంత్రం కోసం జాతీయ జెండా కోసం కొన్ని వేల మంది తమ ప్రాణాలను అర్పించిన చరిత్ర మన యొక్క భారతదేశ చరిత్ర కానీ స్వతంత్రం వచ్చిన తర్వాత 1949 నుంచి నేటి వరకు 42 మంది ఏబీవీపీ కార్యకర్తలు తమ ప్రాణాలను దేశం కోసం, సమాజం కోసం, విద్యార్థుల కోసం తమ ప్రాణాలను అర్పించారు. అదేవిధంగా 1947 తర్వాత జాతీయ జెండా కోసం ఏ ఒక్క వ్యక్తి కూడా ప్రాణాలర్పించిన చరిత్ర లేదు. కానీ ఏబీవీపీ కార్యకర్త సామా జగన్మోహన్ రెడ్డి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేసి ఉత్సవాలు జరుపుతుండగా అక్కడికి వచ్చినటువంటి నక్సలైట్లు ఆ యొక్క జాతీయ జెండాను దించి నల్ల జెండా ఎగరవేయడం జరిగింది. ఇది చూసిన ఏబీవీపీ కార్యకర్త వారితో పోరాడి నల్లజెండాను దించి జాతీయ జెండా ఎగరవేశాడు. తమని వ్యతిరేకించాడు అనే నేపంతో సామా జగన్ మోహన్ ని వరంగల్ నడిబొడ్డున 42 కత్తిపోట్లతో వారిని చంపారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాల్లో నక్సలైట్లు ఎంతోమంది తీవ్రవాద సంస్థల కు చెందినటువంటి వ్యక్తులు విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి విద్యార్థులను పాటలతో ఆటలతో ప్రేరేపించి వారిని నక్సలిజం వైపు అడవి బాట పట్టించడం జరిగింది. దీనిని అడ్డుకున్నటువంటి కల్వకుర్తి వాస్తవ్యులు నేరేడు చంద్రా రెడ్డిని, కల్వకోలు కృష్ణ వర్ధన్ రెడ్డిని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హాస్టల్లో ఉన్నటువంటి ఏబీవీపీ కార్యకర్తలపై కాల్పులు జరిపి చంపడం జరిగింది. అదేవిధంగా నల్గొండలో ఒక జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నటు వంటి వేచూరి శీనన్న ఏబీవీపీ కార్యకర్త ఆ కళాశాలలో గద్దర్ లాంటి నక్సలైట్లు పాటలతో తమ యొక్క ఆటలతో ప్రేరేపించి ఆకర్షించుకొని విద్యార్థులను అడవి బాట పట్టించారు. దానిని అడ్డుకున్నటువంటి శీనన్న కళాశాల బయట గేటు దగ్గర అతి కిరాతకంగా చంపడం జరిగింది. అయినప్పటికీ కూడా దేశంలో గాని రాష్ట్రంలో గాని ఎక్కడ కూడా ఏబీవీపీ తలవంచకుండా విద్యార్థి సమస్యలపై సామాజిక సమస్యలపై దేశ సమస్యలపై పోరాడుతూ విద్యార్థులను జాతీయ భావాలు కలిగిన విద్యార్థులుగా తయారు చేయడమే ఏబీవీపీ యొక్క పని. ఏబీవీపీ వ్యక్తిని నిర్మాణమే దేశ నిర్మాణం అని చెప్పి వివేకానందుని మాట ఏబీవీపీ బాటగా స్వీకరించి ముందుకు వెళుతున్నటువంటి ఒక సంస్థ ఏబీవీపీ ఈ రకంగా చెప్పుకుంటూ పోతే దేశంలోకి బంగ్లాదేశ్ నుంచి చొరబడుతున్నటువంటి తీవ్రవాదులను అడ్డుకోవాలని నేపథంతో కేంద్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లక్ష మంది విద్యార్థులతో పురవీధులలో తిరుగుతూ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభతో ఆ రాష్ట్ర ప్రజలకు ధైర్యం ఇవ్వడం అదే రకంగా కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసరడం జరిగింది. అదేవిధంగా మన యొక్క భారతదేశానికి స్వతంత్రం కోసం 1857లో మొట్టమొదటగా స్వతంత్ర సంగ్రామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో సిపాయిల తిరుగుబాటుగా వక్రీకరించింది. కానీ ఏబీవీపీ మొదటి స్వతంత్ర సంగ్రామ యుద్ధానికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2007లో దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకి ప్రతి మండలానికి ప్రతి గ్రామానికి ప్రతి హై స్కూల్ సెంటర్ కి ఏబీవీపీ రథయాత్ర పేరుతో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించి మారుమూల గ్రామంలో ఉన్నటువంటి ప్రతి విద్యార్థికి కూడా అది సిపాయిల తిరుగుబాటు కాదు దేశ స్వతంత్రం కోసం ప్రారంభమైనటువంటి మొట్టమొదటి స్వతంత్ర సంగ్రామయుద్ధంగా తెలియజేసినటు వంటి ఘనత ఏబీవీపీ దే. పాలమూరు జిల్లాలో గతంలో ఆకలి కేకలతో కరువు కాటకాలతో అల్లాడుతున్న పాలమూరు జిల్లా ప్రజలను రైతులను దృష్టిలో ఉంచుకొని జల ఉద్యమ పాదయాత్ర పేరుతో అలంపూర్ నుంచి నల్లమల్ల అచ్చంపేట అడవుల వరకి పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలమూరు జిల్లా ప్రజల గోస వినిపించినటువంటి చరిత్ర ఏబీవీపీ ది అదేవిధంగా పాలమూరు జిల్లాలోని కోడంగల్, కోస్గి ప్రాంతాలలో రెండు గ్లాసుల పద్ధతిని, వలసను ఆపడం కోసం ఏబీవీపీ సంవత్సరం పాటు సామాజిక సమరసత అనే పేరుతో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి కోడంగల్, కోస్గి ప్రజల యొక్క గోడును వినిపించినటువంటి చరిత్ర. ఈ రకంగా చెప్పుకుంటూ పోతే దేశ సమస్యల కోసం పైన కానీ సామాజిక సమస్యల పైన గాని విద్యార్థుల సమస్యల పైన గాని నిరంతరం ముందుండి పోరాడుతున్న విద్యార్థి సంస్థ ఏబీవీపీ కావున రాబోవు రోజుల్లో ఇలాంటి కార్యక్రమాల్లో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలని విజయవంతం చేయవలసిందిగా చలమల నికిత అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కావలి ఆంజనేయులు, నగర ఉపాధ్యక్షులు నరేష్ పటేల్, కళాశాల అధ్యక్షుడు రఘువంషి, ఉపాధ్యక్షుడు తేజ, గద్వాల నగర మీడియా ఇన్చార్జ్ సురేష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి నరేష్, సాయి, సత్య రెడ్డి, నితిన్, రమేష్, సూరజ్, నవీన్, తారక్, సాయి హర్ష, చంద్రశేఖర్, కౌశిక్, రాకేష్, పూర్వ కార్యకర్తలు జి తిరుమలేష్, లక్ష్మీపుత్ర, శ్రీనివాస్, గణేష్ అలాగే వివిధ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, ఇతర కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# సార్వత్రిక సమ్మెలో ఎల్ ఐ సి ఉద్యోగులు



గద్వాల జూలై 09 (వుదయం ప్రతినిధి) దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో గద్వాల ఎల్ఐసి బ్రాంచ్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాల ఐక్య సంఘటన సంఘటనలో ప్రధాన డిమాండ్లను ఈ ఒక్కరోజు సమ్మె ద్వారా ప్రస్తావించబడినది. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఇన్సూరెన్స్ కంపెనీలను బలోపేతం చేయాలి. బ్యాంకు గ్రామీణ బ్యాంకు ఇన్సూరెన్స్ రంగా ప్రైవేటీకరణ వంటి ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలి. ఇన్సూరెన్స్ వ్యాపారంలో 100% ఎఫ్డిఐ లను తీసుకువచ్చే ఆలోచనలు కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది వాటిని వెంటనే విరమించు కోవాలి. ప్రభుత్వ రంగ సాధారణ భీమా కంపెనీలను విలీనం చేసి వాటిని బలోపేతం చేయాలి. తగినంత పర్మనెంట్ ఉద్యోగ నియామకాలు బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలలో చేపట్టాలి. టెంపరరీ ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. నేషనల్ పెన్షన్ స్కీం రద్దు చేసి అందరికీ 1995 పెన్షన్ స్కీం వర్తింపజేయాలి. జీవో నెంబర్ 57 ప్రకారం 1996 నోటిఫికేషన్ ద్వారా ఎల్ఐసి లో నియామకాలు పొందిన వారందరికీ పాత పెన్షన్ను వెంటనే అమలు చేయాలి. ఖాతాదారుల సేవల మీద చార్జీలు తగ్గించాలి. ఇన్సూరెన్స్ పాలసీల మీద జీఎస్టీని రద్దుచేసి పాలసీదారులకు మేలు చేయాలని రంగారావు కోరారు. ఉద్యోగ కార్మిక లేబర్ కోడ్లను వెంటనే విరమించుకోవాలి. ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడుతూ కేంద్రం తిలోదకాలు ఇచ్చిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశము క్రమం తప్పకుండా నిర్వహించాలి. వీటితోపాటు ప్రజలందరికీ సమగ్ర సాంఘిక సంక్షేమ పథకాన్ని అమలుపరచాలి కనీస వేతనాన్ని 26,000గా ప్రకటించాలి. కార్మిక సంఘాలకు గుర్తింపునిచ్చి ద్వైపాక్షిక చర్చలకు అవకాశాన్ని కల్పించాలని తదితర అంశాలను ఈ సమ్మె ద్వారా ప్రస్తావించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి ఆధ్వర్యంలో ఐసిఇయు ప్రెసిడెంట్ డి సూరజ్, వైస్ ప్రెసిడెంట్ శివశంకర్, రాఘవేంద్ర, మల్లికార్జున్, రంగయ్య, ప్రవీణ్ కుమార్, చైతన్య, నర్సింగ్ మనీష్, సుదర్శన్ శెట్టి, శైలేష్, పద్మ, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా 77వ ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం





అలంపూర్ జూలై 09 (వుదయం ప్రతినిధి) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జోగులాంబ గద్వాల జిల్లాలోని ఐజ శాఖ ఆధ్వర్యం లో జాతీయ విద్యార్థి దినోత్సవం ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని అన్ని కాలేజీ, పాఠశాలల విద్యార్థులతో తిక్కవీరేశ్వర దేవాలయం నుండి పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా మీదుగా రాయచూరు చౌరస్తా వరకు మహా ర్యాలీ నిర్వహించి ఏబివిపి జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రముఖ్ (అధ్యక్షులు) ఆంజనేయులు పాల్గొని మెయిన్ చౌరస్తాలో జెండా ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఏబివిపి 1949 జూలై 9 న 5గురు విద్యార్థులతో ఢిల్లీ యూనివర్సిటీలో ప్రారంభించడం జరిగింది. దేశసేవకై జూలై 9,1949న ప్రారంభమై విద్యార్థులలో నిరంతరం కర్తవ్య భావాన్ని, జాతీయ సేవను పెంపొందిస్తూ నేటి వరకు కోట్లాదిమంది విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దిన శక్తివంతమైన విద్యార్థి యువశక్తి కేంద్రం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్. ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు, నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఏబీవీపీ మొదటి జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ ఓం ప్రకాష్ బెహల్ తో ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన మహాసభలో ఏబీవీపీ ప్రారంభించడం జరిగింది. అయితే జాతీయ పునర్ నిర్మాణం ద్వారా భారత్ కు పూర్వవైభవం తీసుకురావడం జరిగింది. విద్యారంగంలో విదేశీ విష భావజాలాలను ఎండగడుతూ మెకాలే విధానాలను అంతం చేస్తూ భారతీయ విద్యా కోసం నిర్మాణాత్మక ఆందోళనత్మక సహభాగాత్మక కార్యక్రమాలతో ఏబీవీపీ సత్యవాద సిద్ధాంతంతో ముందుకు ప్రయాణం చేస్తుంది. "విద్య జీవితం కోసం-జీవితం దేశం కోసం"అంటూ"విద్యార్థి శక్తిని జాతీయ శక్తిగా మరల్చడమే ఏబీవీపీ విధానం" జనంలోని జ్యోతులం జాతి కొరకు వెలుగుదాం అన్న నినాదమే ఏబీవీపీ ప్రధానం. జాతీయత మా ఊపిరి దేశభక్తి నా ప్రాణం అనే జీవించే విద్యార్థులను తయారు చేస్తున్న కర్మాగారమే ఏబీవీపీ. "జ్ఞానం,శీలం, ఏకత పరిషత్ ప్రత్యేకత" అనే నినాదంతో సంఘటనాత్మకంగా ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించింది ఎబివిపి. ఈ కార్యక్రమం లో ఏబివిపి పూర్వ కార్యకర్తలు మాల మల్లికార్జున్, మునిస్వామి, ఎబివిపి ఎస్ఎఫ్డి స్టేట్ కో కన్వీనర్ వెంకటేష్, ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకేష్, ఏబీవీపీ నగర్ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి నరేష్, స్పోర్ట్స్ ఇంచార్జ్ అశోక్, రాఘవేంద్ర, మీడియ ఇంచార్జ్ బలరాం, కళాశాలల కన్వీనర్ నిఖిల్, అయిజ కార్యకర్తలు మధు, పవన్, వెంకటేష్, ఉమేష్, పరుష, ప్రణీత్, బన్నీ, వేణు, గోవర్ధన్,ఇర్ఫాన్, తేజ, కృష్ణ, రాకేష్, రామ్ చరణ్, సద్దాం, అఖిల్, జస్వంత్, వీరేంద్ర, వినీత్, శ్రీహరి, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.**




నారాయణపేట టౌన్ జూలై 9(వుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లాలోని కొత్త మండలాలైన గుండుమాల్, కొత్తపల్లి ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను బుధవారం కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఒక్కో మండల కాంప్లెక్స్ భవన నిర్మాణాన్ని రూ. 8.80 కోట్ల వ్యయంతో చేపట్టనుండగా గుండుమల్ పిహెచ్ సి పక్కన గల రెండు ఎకరాల స్థలంలో నిర్మించే మండల కాంప్లెక్స్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయని వేగంగా పనులు చేయించాలని అధికారులను ఆమె ఆదేశించారు. తర్వాత కొత్తపల్లి మండల కేంద్రానికి సమీపంలోని వేయి గజాల స్థలంలో కొనసాగుతున్న కొత్తపల్లి మండలం ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ నిర్మాణ పనులను సైతం కలెక్టర్ పరిశీలించారు. మండల కాంప్లెక్స్ బేస్ మెంట్ కంటే ఇటీవల వేసిన బీటీ రోడ్డు ఎత్తు కావడంతో కాంప్లెక్స్ భవనం కిందకు అవుతుందని, రోడ్డుకు సమాన ఎత్తులో కాంప్లెక్స్ భవన బేస్ మెంట్ ను పెంచాలని అధికార పార్టీ నాయకులు కలెక్టర్, కడ ప్రత్యేక అధికారిని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బేస్ మెంట్ ఎత్తు పెంచడం వీలవుతుందా అని పంచాయతీరాజ్ అధికారులు అడిగారు. నిబంధనల ప్రకారం ఎత్తు పెంచడం కుదరదని అధికారులు స్పష్టం చేశారు. సమీపంలోనే చెరువు ఉందని, ఆ చెరువు నీళ్లు కూడా మండల కాంప్లెక్స్ ఆవరణలోకి వచ్చే అవకాశం ఉందని నాయకులు చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారుల రిపోర్ట్ తీసుకోవాలని, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలిపి పరిష్కార మార్గం చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై కలెక్టర్ సంతృప్తి. గుండుమల్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంతృప్తి వ్యక్తం చేశారు. పైలెట్ గ్రామమైన ముదిరెడ్డి పల్లి కి మొత్తం 129 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, దాదాపు 40 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వాటిలో ఆరు ఇండ్ల నిర్మాణాలు స్లాబ్ దశ కూడా పూర్తయ్యాయి. 80 శాతం పనులు పూర్తయిన నాలుగు ఇందిరమ్మ ఇండ్ల లోకి వెళ్లిన కలెక్టర్ మిగతా గ్రామాలతో పోలిస్తే ఇక్కడ నిర్మాణాలు త్వరగా పూర్తి అవుతున్నాయని లబ్ధిదారులను ఆమె అభినందించారు. గ్రామంలో ప్రారంభం కానీ మిగతా ఇండ్ల నిర్మాణాలను కూడా త్వరగా మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు.జూనియర్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన. కొత్తపల్లి మండలం భూనేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న కొత్తపల్లి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెరగాలని, నిర్మిత గడువు లోపు కళాశాల భవన నిర్మాణం పూర్తి కావాలని ఆమె ఆదేశించారు. భూనేడు జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అప్పుడే ప్రారంభం కావడంతో విద్యార్థుల వద్దకు వెళ్లిన కలెక్టర్ భోజనం నాణ్యతగా ఉందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారంలో ఎన్ని సార్లు గుడ్లు ఇస్తున్నారని ఆరా తీశారు. పాఠశాలలో గతేడాది ఉత్తీర్ణత శాతం కంటే ఈ సారి మెరుగు పరచాలని హెచ్ ఎం కు సూచించారు. పాఠశాలలో ఈ సారి విద్యార్థుల సంఖ్య ఎంత పెరిగిందని ప్రశ్నించగా గతేడాది 426 మంది విద్యార్థులు ఉండగా ఈ సారి 438 మంది విద్యార్థులు ఉన్నారని హెచ్ ఎం కలెక్టర్ కు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తపల్లి , గుండుమాల్ తహసీల్దార్లు జయ రాములు, భాస్కర స్వామి, గుండుమల్ ప్రత్యేక అధికారి రెహమాన్, పీ ఆర్ డీఈ విలోక్, ఆయా మండలాల ఎంపీవోలు, సంబ%శీ%ధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరం.

**-మండల పశువైద్యాధికారిణి డాక్టర్ కొమ్మెర మనిషా పటేల్**

**-ముత్యంపేట పశువైద్యాధికారి డాక్టర్ జి అశోక్**

**-పశు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం శ్రీనివాస్ డాక్టర్ కె సుష్మ డాక్టర్ పి విశాల్ కుమార్ డాక్టర్ ఆర్ సురేష్**



మెట్ పల్లి జూలై 09 (వుదయం విలేఖరి) మెట్ పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో పశువైద్య పశుసంవర్ధక శాఖ పశువైద్య కళాశాల కోరుట్ల వారి అధ్వర్యంలో ఉచితంగా పశువైద్య శిబిరాన్ని కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం శ్రీనివాస్ డాక్టర్ కె సుష్మ డాక్టర్ పి విశాల్ కుమార్ డాక్టర్ ఆర్ సురేష్ లు ప్రారంభించారు ఆవులు గేదెలకు చూడి పరీక్షలు గర్భకోశ వ్యాధి చికిత్సలు అనారోగ్యం ఉన్న గొర్రెలు మేకల్లో చికిత్స అందించడం అలాగే పశువులకు నట్టల నివారణ మందులు పంపిణి చేయడం జరిగిందని మెట్టుపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మెర మనీషా పటేల్ ముత్యంపేట పశు వైద్యాధికారి డాక్టర్ జి అశోక్ లు తెలిపారు అలాగే పశువుల్లో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది రమణయ్య రమాదేవి అజయ్ ఆఫీస్ సబర్డినేట్ దిలీప్ గ్రామస్తులు పాడి రైతులు పాల్గొన్నారు

# ఏషియన్ పెయింట్స్ కొత్త కార్పొరేట్ ఫిల్మ్ 'సోచా భీ నహీ హోగా' విడుదల




హైదరాబాద్,జూలై 09 (వుదయం ప్రతినిధి) భారతదేశంలో ఇళ్లను అందంగా ఉంచడంలో అగ్రగామిగా నిలిచిన ఏషియన్ పెయింట్స్ తాజాగా తమ కొత్త కార్పొరేట్ ఫిల్మ్ 'సోచా భీ నహీ హోగా' ను విడుదల చేసింది. ఈ వీడియోల ద్వారా సృజనాత్మకత, డెకర్తో రంగుల వాడకాన్ని కొత్తగా అర్థం చేసుకునేలా చేస్తుంది. ఈ వీడియోల్లో ఒక యువ జంట తమ ఇంటిని పునఃనిర్మించుకునే క్రమంలో ఎదురయ్యే అనుభవాలను హృదయానికి హత్తుకునేలా చూపిస్తుంది. ఏషియన్ పెయింట్స్ మొబైల్ యాప్ సహాయంతో ఇంటి మార్పు ప్రక్రియ సులభంగా, ఆనందదాయకంగా, సరికొత్త ఐడియాలతో ఉంటుంది. ఈ వీడియోలలో ఏషియన్ పెయింట్స్ ఇంటి మార్పు ప్రాజెక్టులో ప్రతి దశలో ఇంటి యజమానులకు ఎలా మద్దతు ఇస్తారో చూపిస్తారు. ఎక్కడ ఆగిపోయినా, వారు అనుకున్న దాన్ని అందించేందుకు హైపర్ పర్సనలైజ్డ్ సలహాలు, ఇంటి సందర్శనలు, ఆన్లైన్ గైడెన్స్ లేదా స్టోర్లో నిపుణుల సాయం అందజేస్తారు.

'సోచా భీ నహీ హోగా' నాలుగు భాగాల వీడియోలో ఇంటి అందాన్ని మెరుగుపరచడానికి అవసరమైన సులభమైన పరిష్కారాలు కలవు. ఒక వీడియోలో భార్య తమ ఇంటికి ప్రముఖ డిజైనర్ సబ్యసాచి శైలిని తీసుకురావాలని కలగంటుంది. భర్త ఆశ్చర్యపోతాడు, కానీ ఏషియన్ పెయింట్స్ నిపుణుడు 'సబ్యసాచి ఫర్ నిలయా' కలెక్షన్ చూపించగానే ఆశ్చర్యం పడతాడు. భర్త 'సబ్యా?' అని ఆశ్చర్యంగా అడుగుతాడు. అప్పుడు నిపుణుడు నవ్వుతూ సమాధానంగా 'సచ్చీ' అంటాడు. మరో వీడియోలో స్టైలిష్ డిజైన్లను, గ్లోబల్ లుక్స్ను ఇష్టపడే ఇంటి యజమానుల కోసం భార్య తన భర్తకు ఇష్టమైన దేశం ఇటలీ దేశ ఫీలింగ్ని ఇంట్లోకి తీసుకురావాలనుకుంటుంది. రాయల్ ప్లే వాల్ టెక్చర్ వాడుతూ, నిపుణుడు రాయల్ ప్లే క్యాటలాగ్ చూపిస్తాడు. దాన్ని చూసిన భర్త ఆనందంతో నవ్వుతూ చెబుతాడు 'సోచా భీ నహీ హోగా!'. ఫస్ట్ వీడియోలో భార్య ఓ రంగు గురించి ఆలోచించగా.భర్త కలర్ విత్ ఏషియన్ పెయింట్స్ యాప్ను ఉపయోగించి ఆ రంగుకు సరిపడే సరైన కాంబినేషన్ను సూచిస్తాడు. ఈ యాప్ వాల్ ఆ రంగు ఎలా కనిపిస్తుందో చూపిస్తుంది. దీంతో వారు ఆత్మవిశ్వాసంతో కలర్ ను ఎంపిక చేసుకుంటారు. ఈరోజు వినియోగదారులు తమ వ్యక్తిత్వానికి తగ్గ కలర్ కాంబినేషన్ల కోసం చూస్తున్నారు. రెండో వీడియోలో ఆ జంట ఏషియన్ పెయింట్స్ వాట్సాప్ చాట్బాట్, ఇన్-స్టోర్ నిపుణుల సాయంతో వారిద్దరి శైలికి, ఇంటి వాతావరణానికి సరిపోయే లుక్ ఎంపిక చేసుకునే గైడెన్స్ అందుతుంది. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ స్వింగ్లే మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా గృహ యజమానుల ఆదరాభిమానాలు చూరగొంటున్నామని చెప్పారు. 'సోచా భీ నహీ హోగా' ద్వారా పెయింటింగ్ను కేవలం ఒక కార్యనిర్వహణ ప్రక్రియగా కాకుండా, ప్రజల ఊహాశక్తిని మరిపించే దిశగా తీసుకువెళ్తున్నామని చెప్పారు. ఈ సిరీస్ ప్రతి ఇంటిని తమ వ్యక్తిత్వం ప్రతిబింబించే విధంగా చూడమని ప్రేరేపిస్తుందన్నారు. రంగులు, టెక్చర్లు, డిజైన్లు అన్నీ ఒక ఉల్లాసభరితమైన అనుభూతిని ఇస్తాయన్నారు. మా నమ్మకం 'హర్ ఘర్ కుచ్ కెహతా హై' ద్వారా మనిషి తన ఇంటి రూపకల్పన కథను చెప్పగలగాలి అనే దిశగా ప్రయాణిస్తున్నామని తెలిపారు. ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములుగా చేసుకోవడానికి అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. సౌందర్యం, సృజనాత్మకత, వ్యక్తిత్వం కలిసిన ఇంటి మార్పు యాత్రను ప్రారంభించమని కోరారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందే

జన్నారం, జూలై 9(వుదయం విలేకరి) బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు మొండి కత్తి లింగన్న అన్నారు.బుధవారం రోజున హైదరాబాదులో ఎమ్మెల్సీ కవితను వారు మర్యాదపూర్వకంగా కలిశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి,ఈనెల 17న జరిగే చలో రైలు రోకో కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు.తమ పూర్తి మద్దతు కూడా ఉంటుందని వారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండుకూరి రాజు, కమిటీ సభ్యులు ఉన్నారు.



# దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె మహాముత్తారం మండల కేంద్రంలో విజయవంతం.

## -కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి.



జులై 9 భూపాలపల్లి వుదయం (ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండల కేంద్రంలో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయడం జరిగింది దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిఐటియు పిలుపునిచ్చింది కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాల స్వతంత్ర ఫెడరేషన్లు ప్రజాసంఘాల పిలుపుమేరకు మహాముతరం మండలంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేయడం జరిగింది ఈ సందర్భంగా లిమహాముత్తరం మండల్ ప్రజాసంఘాల నాయకులు పోలం రాజేందర్ దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతును ప్రకటించిందని వారు అన్నారు సమ్మె రోజున గ్రామీణ బందుకు పిలుపునిచ్చిందన్నారు ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం మహాముతరమ్ మండల కేంద్రంలో విజయవంతంగా జరిగిందని వారు తెలియజేశారు కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడు అమలు చేస్తుందన్నారు కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను ముందుకు తెచ్చింది అన్నారు వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలతో లేబర్ కోడ్ లను అమలు 5 సంవత్సరాలు ఆలస్యమైన ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మికుల హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తుందన్నారు భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను నేడు ఈ చట్టాల ద్వారా ముప్పు వాటిల్లుతున్న అన్నారు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలులోకి తెస్తుందన్నారు దీనికి సంబంధించి 12 గంటల పనినీ చట్టబద్ధం చేస్తున్నారని సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నారు కార్మిక సంఘాలు రిజిస్ట్రేషన్ ను కఠిన తరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు కూడా బరితెగిస్తుంది అన్నారు ఉమ్మడి వీర సారాల హక్కులను తొలగించి వాటిని బిఎన్ఎస్ చట్టం ద్వారా నాన్ బెయిలబుల్ కేసులుగా మార్చడం పని స్థలాల వద్ద గేటు మీటింగ్లు కరపత్రాలు పంపిణీ వంటి వాటిని సైతం నిషేధించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటిని తుంగలోకి తొక్కుతుందన్నారు చట్టాలను అమలు చేయని యాజమాన్యాలకు శిక్షలు తగ్గించడం కార్మిక శాఖలు పూర్తిగా ఫెసిలిటీస్ విభాగంగా మార్చడం స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా వెట్టిచాకిరి చేసే విధంగా లేబర్ కోడులను రూపొందించింది అన్నారు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల సమ్మె హక్కు నిర్వీర్యం చేస్తూ సమ్మె చేయలేని కార్మికులకు తిరిగి బానిసత్వంలోకి నెట్ ఎందుకు ప్రయత్నిస్తుందన్నారు అందుకే నాలుగు రెబల్ కోడ్ లను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గానికి చాలా అవసరమని అన్నారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మధ్యాహ్నం భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు టిడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం

## -ఏకశిల పార్క్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీలో పాల్గొన్న టిడబ్ల్యూజేఎఫ్ నేతలు




హనుమకొండ, జూలై 09(వుదయం జిల్లా ప్రతినిధి) : దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు సంఘీభావంగా హనుమకొండ ఏకశిలా పార్కు నుండి హనుమకొండ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించినట్లు హనుమకొండ జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు టీవీ రాజు ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాలతో పాటు 29 చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్ లను తేవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తునందున దానికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి, జర్నలిస్ట్ ల ఐక్యతను చాటుకున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక నల్ల చట్టాలను ఎత్తివేయాలని, దేశంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధంచాలని డిమాండ్ చేశారు. బుధవారం రోజున దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ హనుమకొండలో జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక ఏకశిలా పార్క్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకున్న అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపుల చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు టీవీ రాజు తెలియజేశారు. జర్నలిస్టులకున్న వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపు చట్టాల పునరుద్ధరణతో జర్నలిస్టు వృత్తి ప్రమాణాలను కాపాడుకునేందుకు కేంద్రం తక్షణమే వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన నల్ల చట్టాలను ఎత్తివేసే వరకు జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని జాతీయ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య అన్నారు. ఈ ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దామెర రాజేందర్, కోశాధికారి ఇసంపల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి దాసరి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు మరుపట్ల శంకర్, పశ్చిమ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గిరెడ్డి అనిల్ కార్యదర్శి దామెర వెంకటేష్, కోశాధికారి హుస్సేన్ నాయక్ సంపత్ రెడ్డి, కిరణ్, సుమన్, అంకేశ్వరపు రాజేందర్, ఆర్. అశోక్, ఎండి బస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేసే ప్రధానోపాధ్యాయుడు బ్రదర్ రాజశేఖర్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జులై 09 (వుదయం ప్రతినిధి)బ్రదర్ రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన బెస్ట్ అవైలబిలిటీ స్కీం తల్లిదండ్రులుబి గత తొమ్మిది సంవత్సరాల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం ద్వారా నిరుపేద ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం , బిఏఎస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట శివ శంకర్ అన్నారు. బుధవారం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలోవిద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మంచి విద్యను అందిస్తున్న సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ లో గల సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో జరుగుతుందని. ప్రభుత్వం నుంచి గత మూడు సంవత్సరాలుగా స్కూల్ యాజమాన్యానికి 70 లక్షలు రావలసి ఉండగా, రాకపోయినా మిగతా పిల్లలతో సమానంగా ఎక్కడ తక్కువ చేయకుండా నిరుపేద ఎస్సీ విద్యార్థులను ఎక్కడా లోటు లేకుండా పుస్తకాలతో పాటు బట్టలు ఇచ్చి గత తొమ్మిది సంవత్సరాల నుంచి మంచి విద్యతో విద్యార్థులను తీర్చిదిద్ది గత నాలుగు సంవత్సరాల టెన్త్ క్లాస్ లో బిఏ స్కీం విద్యార్థులందరూ 515 మార్కుల పైబడి ఐదుగురు విద్యార్థులకు 440 మంచి మార్కులు వచ్చేలా నిరుపేద ఎస్సీ విద్యార్థులను తీర్చిదిద్దిన సెయింట్ జోసెఫ్ స్కూల్ యాజమాన్యం , ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి బ్రదర్ కి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు అందరూ పేద నిరుపేద విద్యార్థులు పేద ప్రజల పట్ల తమ ఔన్నత్యాన్ని చాటుకోవడం జరిగిందని ఇదే పద్ధతి కొనసాగిస్తు మంచి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణతో సామాజిక విలువల తో కూడిన విద్య వల్ల సమాజంలో బాధ్యత గల పౌరులుగా తయారవ్వడానికి సెయింట్ జోసెఫ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ గా బ్రదర్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఇదే పట్టుదలతో మరో ఐదు సంవత్సరాలు ప్రిన్సిపాల్ గా కొనసాగాలని సెయింట్ జోసెఫ్ స్కూల్లో విద్యార్థులను ఎంతో పట్టుదలతో క్రమశిక్షణతో విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నారని రాజశేఖర్ రెడ్డి బ్రదర్ వచ్చిన తర్వాత వరుసగా మూడు సంవత్సరాలు టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో పాటు మంచి విద్యను అందిస్తూ టెన్త్ క్లాస్ లో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం బి ఏ ఎస్ పేరెంట్స్, విద్యార్థులు అత్యధికంగా టెన్త్ క్లాస్ బి ఏ ఎస్ విద్యార్థులు 10 మందిలో ఐదుగురు 530 పైబడి మార్కులు మరియు మిగతా ఐదుగురు విద్యార్థులు 440 మార్కులు పైబడి సాధించినందుకు కృషి చేసిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు కందుల గురుమూర్తి, కత్తి భాస్కర్, తిట్ల శంకర్ ,తీట్ల లీలా, సరోజ సంతోష్, లక్ష్మీ ,నమిల్ల రాము, దుర్గాభవాని, భాగ్య , తదితరులు పాల్గొన్నారు.

# సాయి జీనియస్ హైస్కూల్లో అంగరంగవైభవంగా ఆషాఢ మాసం బోనాలు ఉత్సవాలు



కోరుట్ల జూలై 09 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ భీముని దుబ్బా లో గల సాయి జీనియస్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆషాడ మాసంలో జరుపుకొనే బోనాల ఉత్సవాలు పాఠశాల యాజమాన్యం విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి భక్తి శ్రద్ధలతో అంగరంగవైభవంగా వేడుకలను జరుపుకున్నారు పాఠశాలలో అమ్మవారికి బోనాలు నైవేద్యం వండి బోనాలను అలంకరించి ఉపాధ్యాయులు విద్యార్థులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించి అందర్నీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాల బోనాల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ చౌకి సుధ మాట్లాడుతూ అంతరించిపోతున్న మన సంస్కృతి సంప్రదాయాలను మరవకూడదని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదని విద్యార్థులకు సూచించారు ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి ఈ బోనాల ఉత్సవాల్లో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు

# మాతృ భూమికి సేవ చేయడం విద్యార్థుల కర్తవ్యం

## -విద్యార్థి పరిషత్ ఉద్యమాలలో అందరూ భాగస్వాములు కావాలి
## -ఎబివిపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. కర్ణాకర్
## -ఘనంగా ఎబివిపి 77 వ ఆవిర్భావ దినోత్సవం






నాగర్ కర్నూల్ జూలై 09(వుదయం ప్రతినిధి) మాతృ భూమికి సేవ చేయడం విద్యార్థులందరిపై బాధ్యత ఉందని, దేశం కోసం సైనికుల్లా పనిచేయాలని ఎబివిపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కర్నాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎబివిపి ఆవిర్భావ దినోత్సవం (జాతీయ విద్యార్థి దినోత్సవం) పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మహా ర్యాలీ నిర్వహించి రాంనగర్ కాలనీ లోని వివేకానంద విగ్రహం దగ్గర ఏబీవీపీ జెండా ఎగరవేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ కర్ణాకర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 జులై 9 న ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థిని విద్యార్థులతో ప్రారంభమై నేడు ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడిందని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం ఎన్నో ఉద్యమాలు చేస్తు విద్యార్థులకు ఎ సమస్య వచ్చినా వేంటనే పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తుందని అలాగే ఈ దేశం కోసం స్వాతంత్ర్యం రాకముందు ఎంతో మంది చనిపోతే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దేశం కోసం 44మంది కార్యకర్తలు జాతీయ జెండా కోసం తుపాకీ గుండుకు తమ గుండెను అడ్డుపెట్టి జాతీయ వాదం కోసం ఆర్ఎస్ యూ గుండాలకు వ్యతిరేకంగా పోరాడి భరతమాత కాళ్ళ దగ్గర పుష్పాంజలి లాగా వాళ్ళ తలలను సమర్పించారని అన్నారు. విద్యార్థి పరిషత్ కార్యకర్తలు మాత్రమే ఈ దేశం కోసం ఏత్యాగానికైనా వెనుకాడరని అన్నారు. ఇందిర గాంధీ 1975 లో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఎబివిపి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమం చేసిందని తెలిపారు. అస్సాం రాష్ట్రంలోకి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబాటు దారుల వస్తే "సేవ్ అస్సాం టుడే-సేవ్ ఇండియా టుమారో" అను నినాదం తో అస్సాంలో కి చొరబాటు దారులు రాకుండా ఉద్యమం చేసిన ఘనత విద్యార్థి పరిషత్ కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలో జాతీయ వాదుల మీద దాడి జరిగితే చలో కేరళ పేరుతో లక్షమంది పైగా విద్యార్థి పరిషత్ కార్యకర్తలు కేరళ ముఖ్యమంత్రి నియోజకవర్గం లో ర్యాలీ తీసి కేరళలో వున్న జాతీయ వాదులకు మేము అండగా వున్నాం అని చాటి చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు చేయడంలో ఎన్నో ఏళ్లుగా ఎబివిపి ఉద్యమం ఫలితంగా రద్దయ్యిందని, నేడు అక్కడ వున్న ప్రజలు స్వేచ్ఛ వాయువులు పిలుస్తున్నారని అన్నారు. విద్యా జాతీయకరణ కావాలని ఆనాడు గోడ మీద రాసిన రాతలు నేడు పార్లమెంట్ లో చట్టమై అమలులోకి వచ్చి నూతన జాతీయ విద్యా విధానం ప్రారంభం అయ్యిందని గుర్తుచేశారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో ఉద్యమాలు చేసిందని,నా రక్తం నా తెలంగాణ పేరుతో ఒకేరోజు ఇరవై వేల మంది విద్యార్థులతో రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే తెలంగాణ రణభేరి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, తెలంగాణ ఉద్యమం లో ఎంతో మంది విద్యార్థులు చనిపోతుంటే ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దని బ్రతికి వుండి ఆకుపచ్చని తెలంగాణ హరిత తెలంగాణ చూడాలని నా తెలంగాణకు హరితహారం పేరుతో ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. అంతేకాదు ప్రతినిత్యం విద్యార్థులలో వుంటూ ఎటువంటి సమస్య వచ్చినా విద్యార్థి పరిషత్ పరిష్కారిస్తుందని అలాంటి విద్యార్థి పరిషత్ 77వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అందరికీ జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు బిజినపల్లి మండలం పాలెం లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో పాటు విద్యార్థి పరిషత్ నాయకులతో కలిసి ఎబివిపి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, సంయుక్త కార్యదర్శి మల్లేష్, కళాశాల ప్రెసిడెంట్ శివ, భరత్, జహీర్,మహిళా కార్యకర్తలు కీర్తన, కృష్ణవేణి, గాయత్రి, హరిత, శ్రీవాణి, ప్రియ, ప్రవళిక, భార్గవి ఏబీవీపీ నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్దకల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికశీగా తనిఖీ చేసిన

## -జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



గద్వాల జూలై 09 (వుదయం ప్రతినిధి) బుధవారం మల్దకల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ రికార్డ్స్ ను, స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. అందులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, మెన్ రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్ ను పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్ తదితర రికార్డ్స్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టాఫ్ కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించు కోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారో వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని అన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24x7 గస్తీ నిర్వహించాలని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలలో పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాల పై, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,ఎస్సై నందికర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ.

## -పట్టణ అభివృద్ధి ప్రధాన లక్ష్యం.
## -ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల జూలై 09 (వుదయం ప్రతినిధి) జగిత్యాల పట్టణ 21, 22, 32, 33, 34, 39, 40 వార్డుల్లో 1 కోటి రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ పోచమ్మ బోనాల సందర్భంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు పట్టణం పచ్చదనం పారిశుధ్యం కోసం ప్రజల సహకారం అవసరమని జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 140 కోట్ల నిధులు పట్టణ అభివృద్ధికి మంజూరు చేయటం జరిగిందని నూతనంగా జగిత్యాల పట్టణ అభివృద్ధికి 50 కోట్లను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నమన్నారు ప్రజలు లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్రంలో ఎక్కడాలేని విదంగా 4520 డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం జగిత్యాల నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందన్నారు డబల్ బెడ్ రూం ఇండ్ల కు మౌలిక సదుపాయాల కల్పన కు 20 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగిందని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు 4 కోట్ల తో సమీకృత మార్కెట్ నిర్మాణం అదనంగా 30 లక్షల నిధులు మంజూరు చేసి పూర్తి చేయటం జరిగిందన్నారు పట్టణంలో ప్రతి చోట నాణ్యత తో పనులు జరుగుతున్నాయని ఇందిరమ్మ ఇళ్లకు మహిళ సంఘాల ద్వారా 1 లక్ష రూపాయల రుణం ఇచ్చే అవకాశం ఉందని పెట్టి సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు కమిషనర్ స్పందన మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నాయకులు చెట్పల్లి సుధాకర్ దయాళ శంకర్ ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు అల్లే గంగాసాగర్ వీరబత్తిని పద్మజ శ్రీనివాస్ కోరే గంగమల్లు పిట్ట ధర్మరాజు సమిండ్ల వాణి శ్రీనివాస్ అవారీ శివ కేసరి బాబు పులి రమ నాయకులు ఓరుగంటి నగేష్ శ్రీమంజరి గుమ్ముల అంజయ్య శంకర్ రాజు గంగం వేణు గట్టురాజు ఏఓ శ్రీనివాస్ డిఈ వరుణ్ ఏఈ లు అనిల్ శరన్ మున్సిపల్ సిబ్బంది మాజీ కౌన్సిలర్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధనాలు వెనక్కి తీసుకోవాలి.

చంద్రుగొండ, జులై09 :( వుదయం ప్రతినిధి ) కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధనాలు అవలంభిస్తోందని వామపక్షపార్టీల నాయకులు ఆరోపించారు. బుధవారం భారత్ బంద్ లో భాగంగా చంద్రుగొండ ప్రధాన సెంటర్లో వామపక్షపార్టీలు, కార్మిక సంఘాల ఆద్వర్యంలో భారీ ప్రదర్సన, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధనాలు అవలంభిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన వాగ్దాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేలా చట్టాలు తేవడం సరికాదన్నారు. సమ్మెలో భాగంగా కొన్ని బ్యాంకులు బంద్ పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో వామపక్షపార్టీల నాయకులు ఎస్కె ఉమ్మర్, పెద్దిని వేణు, ఐలూరి రామిరెడ్డి, వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణాదేవి ఆలయానికి బిఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ సురేష్ రెడ్డి 1లక్ష 50 వేల రూపాయల నిధులు.

-1 లక్ష 50 వేల రూపాయల నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఆలయ నిర్వాహకులకు అందజేత.

-ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల జూలై 09 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ 28 వార్డులో గల అన్నపూర్ణాదేవి ఆలయానికి భారత రాష్ట్ర సమితి పార్టీ రాజ్యసభ ఎంపీ కె ఆర్ సురేష్ రెడ్డి నిధుల నుండి 1,50,000 రూపాయల విలువ గల ప్రొసీడింగ్ పత్రాన్ని బుధవారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేసిన కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ వివిధ హెూదాల నాయకులు కార్యకర్తలు అన్నపూర్ణాదేవి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కుమారుని పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ



జన్నారం, జూలై 9(వుదయం విలేకరి) జన్నారం పట్టణంలోని అక్కపెల్లి గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కడం గ్రామనికి చెందిన సాయిప్రియ-రమణా రావు దంపతుల కుమార్తె ప్రహార జన్మదినాన్ని పురస్కరించుకొని వాటర్ ప్యూరిఫైయర్ ను అందజేశారు.కాగా వారి కుమారుని జన్మదినాన్ని వినూత్నంగా జరుపుకోవాలని, విద్యార్థులకు మంచి నీటిని అందజేయాలని ఉద్దేశంతో జన్నారం లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి బుధవారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ కు ఈ వాటర్ ప్యూరిఫైయర్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తోట లచ్చన్న సెక్రెటరీ ఎర్ర ప్రవీణ్, ట్రెజరర్, కామెరా ప్రేమ్ సాగర్, జోన్ చైర్ పర్సన్ కస్తూరి సతీష్ కుమార్ లైన్స్ క్లబ్ సభ్యులు అంజిత్ రావు, అనుముల రాజన్న,ఎంఈఓ విజయ్ కుమార్, పవన్, మల్లేష్ ,సందీప్, గోలిమణి తదితరులు ఉన్నారు.

## బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం



నారాయణపేట టౌన్ జూలై 9(వుదయం ప్రతినిధి) పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బల్ రామ్,టి.యు.సి.ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రం లో బుధవారం మున్సిపల్ పార్క్ నుండి పాత బస్టాండ్ వరకు భారీగా ప్రదర్శన నిర్వహించి రాస్తా రోకో చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంస్థలను ప్రైవేటు అప్పగించవద్దని, నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి 282 జీ ఓ వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు పెంచి సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పెట్టుబడిదారులకు ఊడిగం కాస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను పూర్తి స్థాయిలో నిషేధించి అసంఘటిత రంగ కార్మికులకి సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు నర్సింహా, ఆషా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాల మణి అధ్యక్షత వహించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు సాయిలు, వి ఆర్ ఎ ల సంఘం జిల్లా అధ్య క్షులు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలప్ప, చేనేత సంఘం జిల్లా నాయకులు కంచి నారాయణ,అంగన్వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమ్మెకు మద్దతుగా మహాదేవపూర్ భవన నిర్మాణ కార్మికులు

జయశంకర్ భూపాలపల్లి జులై 09(వుదయం ప్రతినిధి) భారతదేశవ్యాప్తంగా చేపట్టిన కార్మికుల సమ్మెకు బుధవారం మహాదేవపూర్ భావన నిర్మాణ కార్మికులు మద్దతు తెలిపారు మహాదేవపూర్ మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో లేబర్ కొడ్స్ రద్దు, కార్మిక చట్టాల పునరుద్దరణకై జూలై 9 వ తేదీన దేశావ్యాప్త బందుకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో మహాదేవపూర్ భవన నిర్మాణా కార్మికులు మద్దతు తెలిపారు ఈ సందర్బంగా భవన నిర్మాణ సంఘం కార్మికులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధించాలి అని, అలాగే బోర్డు నుండి కార్మికులకు రావాల్సిన క్లయిమ్స్ వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు,భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి ప్రభుత్వం తీసుకున్న మొత్తాన్ని బోర్డుకు జమ చెయ్యాలి,అలాగే దేశావ్యాప్తంగా



ఎంతోమంది అమరుల త్యాగాలతో సాధించుకున్న 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకవచ్చి కార్మికుల హక్కులను కలా రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ రంగ సంస్థలాన్ని ప్రయివేటు పరం చేస్తున్నారని,కార్మికుల హక్కుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనకకు తగ్గకుంటే ఈ సమ్మెను ఉదృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ భవన నిర్మాణ కార్మికులు ఉదారి గట్టయ్య, అయిలి సాంబమూర్తి, అర్జయ్యా,సందీప్,వెంకన్న, ఓలి, లక్ష్మణ్,సారయ్య, మహేష్, మధు,కార్మికులు పాల్గొన్నారు

## బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువులో ముందు ఉండాలి

### కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాహితి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన సాహితి

హనుమకొండ, జూలై 09(వుదయం జిల్లా ప్రతినిధి) : బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువులో ముందు ఉండాలని కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాహితి కోరారు. వారి భవిష్యత్ కు బంగారు బాటలు వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తూ, తమ వంతు సహాయ సహకారం అందిస్తున్నతెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా,శిశు సంక్షేమ శాఖా మంత్రివర్యులుదనసారి అనసూయ సీతక్క జన్మదిన సందర్భంగా హన్మకొండ జులై వాడ లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకుసుమారు 350 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాహితి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న బడి బాట కార్యక్రమం లో భాగంగా, భవిష్యత్ తరాల పునర్నిర్మాణం కోసం పాఠశాలల బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాలను అభినందిస్తూ... గౌరవనీయులు మంత్రి సీతక్క జన్మదిన సందర్బంగా సీతక్క స్ఫూర్తి ని ప్రజల లోకి తీసుకెల్లాలనే నా ఆకాంక్ష గా ఈ కార్యక్రమం నిర్వహించనని సాహితి తెలిపారు.



## పేద విద్యార్థులకు అండగా ఉండటం గొప్ప కార్యక్రమం.

-గానుగపాడు సొసైటీ అధ్యక్షులు చెవుల చంద్రరావు.



చంద్రుగొండ, జులై09 ( వుదయం ప్రతినిధి ): పేద విద్యార్థులకు అండగా ఉండటానికి ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందీయమని, పేద విద్యార్థులకు షూష్, స్నాక్స్ అందజేయటం గొప్ప కార్యక్రమం అని గానుగపాడు సొసైటి అధ్యక్షులు చెవుల చందర్రావు అన్నారు. బుధవారం గానుగపాడు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఉపాధ్యాయులు స్వంత ఖర్చులతో పాఠశాలలో చదివే విద్యార్థులకు అందరికి షూష్, స్నాక్స్ రూ. 20వేలు రూపాయలతో అందజేయటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు తాము పనిచేసే చోట ఉన్న విద్యార్థులకు సహాయం చేయటం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి చైర్మన్ గడిదేశి వనజ, ఉపాధ్యాయులు రాందర్రావు, సూర్యం, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## నర్సంపేట లో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు.



నర్సంపేట టౌన్ జూలై 9(వుదయం ప్రతినిధి) నర్సంపేట పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ కూడలియందు జనగాం లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సీతక్క ఆరోగ్యంగా సుఖ సంతోషంగా ఉండాలని ప్రజాసేవకు అంకితమై కలకాలం సేవ చేయాలని భారీ కేకలు కట్ చేసి సీతక్క కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోడం రాణి, వాసం కుమారస్వామి, ఈసం మధుసూదన్, మెరుగు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, చుంచా లక్ష్మీనారాయణ, హైమ, ఇర్ప పుల్లమ్మ, మల్లెల రజిత, చాట్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ కళాశాలలో అలరించిన గోరింటాకు సంబరాలు.



కోరుట్ల జూలై 09 (వుదయం ప్రతినిధి) ఆషాడ మాసం సందర్భంగా కోరుట్ల పట్టణంలో గల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గోరింటాకు సంబరాలు ఎంతగానో అలరించాయి మన సాంప్రదాయం ప్రకారం ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే ఎలాంటి వ్యాధులకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని వర్షాకాలం ప్రారంభంలో వచ్చే వ్యాధులను తట్టుకునే శక్తి ఉంటుందని కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ అధ్యాపక బృందం అధిక సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు

## ఘనంగా అఖిలభారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం



వెల్దండ జులై 9 (వు దయం ప్రతినిధి) మండల కేంద్రంలో బుధ వారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 77 వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏబీవీపీ పూర్వ నాయకుడు నెంట తంబాలు జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడారు 1948లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త బల్రాజ్ మద్దోక్ స్థాపించబడిన ఎబివిపి 1949 జులై 9 న అధికారికంగా నమోదు చేయబడిందని పేర్కొన్నారు.

అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యార్థి సమస్యల కోసం పోరాడి న ఏకైక సంఘం ఎబివిపి అన్నా రు. ఈ కార్యక్ర మంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్ హరీష్ శివ చరణ్ నాగరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతి కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

మక్తల్, జూలై 09(వుదయం ప్రతినిధి): నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ మండలంలోని పెద్దపోర్లలో నూతన గ్రామ పంచాయతి కార్యాలయాన్ని బుధవారం మంత్రి డా. వాకిటి శ్రీహరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో గ్రామాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వైద్య రంగానికిపెద్దపీట

-మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

-ఆసుపత్రి ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి

-ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



లక్షెట్టిపేట, జులై 9 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో విద్యా వైద్య రంగానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ..

ఈనెల 13న ప్రారంభించబోయే ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అన్ని వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ రెడ్డి తోపాటు పలువురు మంత్రులు హాజరవుతారన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి 2013 లో ప్రతిపాదన పంపించాను కానీ అనేక కారణాల జాప్యం జరిగిందన్నారు. ఇప్పుడు తన హయాంలో ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు అడ్మిషన్ల కోసం విద్యార్థుల పోటీ పడతారని తెలిపారు. అభివృద్ధిలో మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ లో నిలుపుత అన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఎవరు కబ్జా చేసిన వదిలే ప్రసక్తే లేదన్నారు. అభివృద్ధి విషయంలో వెనకాడే ప్రసక్తే లేదన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం దాదాపు లక్ష మందితో రెబ్బనపల్లిలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మండల అధ్యక్షులు పింగళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, ఆర్టిఏ నెంబర్ అంకతి శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమేల రాజు, మాజీకౌన్సిలర్లు సురేష్ నాయక్, రామ్ దీని వెంకటేష్, నాయకులు నవాబ్ ఖాన్, గుత్తికొండ శ్రీధర్, వెంకట స్వామి గౌడ్, కొత్త వెంకటేశ్వర్లు, సూరం చంద్రమౌళి, అమీర్, హాజీ, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల నిరసనలతో దేశ వ్యాప్త సమ్మె విజయవంతం.

కుత్బుల్లాపూర్, జులై 9,(వుదయం ప్రతినిధి),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిఐటియు మండల కమిటీ, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ప్రగతినగర్, అలీఫ్ ఇండస్ట్రియల్ ఏరియాలలో కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు పట్ల కార్మిక, ఉద్యోగ నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ బి.వెంకట రామయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ జి వెంకటరాజ్యం, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎం బాలపీరు, పూర్వ విద్యార్థి సంఘ జిల్లా నాయకులు సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత దారుణంగా లేబర్ కోడ్స్ అమలు చేయటానికి ముందుకెళుతుందని, కార్మికులు సమ్మె చేయడం సాధ్యం కాకుండా ఆంక్షలు విధిస్తున్నారని సామాజిక




భద్రత కోడ్ అమలు వల్ల ఉద్యోగులు పొందే ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ 12 నుండి 10 శాతానికి తగ్గిపోతదని యాజమాన్యాల ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయోజనాల కోసం ఈఎస్ఐ ను బలహీన పరుస్తదని కార్మికులకు ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని కనీస వేతనం 26,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేయాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 13 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో వృత్తిపరమైన భద్రత ,ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్స్ కోడ్ తెచ్చారన్నారు. ఇది కార్మికుల వృత్తి భద్రతకు, పని భద్రతకు పని పరిస్థితులు కల్పించేదిగా లేదన్నారు. భవిష్యత్తులో కార్మిక ఉద్యోగ సంఘాలు ఐక్యంగా సమరశీలంగా పోరాటం చేయటం ద్వారానే కేంద్ర బిజెపి ప్రభుత్వ నిరంకుశ విధానాల త్రిప్పుకొట్టగలమని, ప్రతి ఒక్కరూ రేపు రాబోయే కార్మిక ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను ఎదిరించి పోరాడేదానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ యూనియన్ నాయకులు పెంటన్న, నాగ శేషు, సత్యనారాయణ, నరసింహ, మద్దిలేటి, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు.

## జన్నారంలో కుమ్మరి సిద్ధప్ప వరకవి జయంతి

జన్నారం, జూలై 9(వుదయం విలేకరి) జన్నారంలో కుమ్మరి సిద్ధప్ప వరకవి జయంతిని బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రోజున ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సిద్ధప్ప వరకవి చాలా పద్యాలు రాసేవారని ఆ పద్యాలను విద్యార్థులకు నేర్పించే వారని అన్నారు. మారిన పరిస్థితుల్లో ఇప్పుడు పద్యాలు అనేటివి విద్యార్థులకు దూరమైనాయనీ అలాంటి మహనీయుని జయంతిని జరుపుకోవడం చాలా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఆలయ ఫౌండేషన్ సీఈవో టి.రమేష్ బాబు,వాలంటరీ కన్నం



తిరుపతి,బొప్పు కిషన్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్ కడార్ల నరసయ్య, మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు ఐలవేణి రవి, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, మహేంద్ర సంఘం నాయకుడు సంద గోపాల్, కటకం సత్యం,బొట్ల సంజీవ్ ఉన్నారు.

## మధిరలో కార్మికసంఘాల సార్వత్రిక సమ్మెకు మద్దతు గా బిజెపియేతర పక్షాలు భారీ ర్యాలీ

మధిర జూలై 9 (వుదయం ప్రతినిధి) కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కార్మిక విధానాలు విడనాడాలని,ఉపాధిహామీ పథకం పట్టణాలకు విస్తరించాలని లోగడ ఉన్న కార్మిక చట్టాలను తిరిగి ప్రవేశ పెట్టాలని,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరణ ఆపాలని, వ్యవసాయోత్ప త్తులకు కనీస మద్ధతుధర చట్టం చేయాలని, కనీస వేతనం రు 26,000 గా నిర్ణయించాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఫిక్సడ్ టర్మ్ తదితర ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని 8ది గంటలకు బదులు పది గంటల పని విధానం ప్రవేశపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 282 జీవో ను వెంటనే ఉపసంహరించుకోవాలని బిజెపి ఏతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తూ మాట్లాడారు. కార్మికులు, రైతులు,కూలీలు వ్యవసాయకార్మికులు, గుమస్తాలు,ఉద్యోగ సంఘాలు తదితరులు తమ డిమాండ్స్ నెరవేర్చుకోవటానికి ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమ జయప్రదం చేసిన వారందరికి సీపీఎం మారేమల్ల గోపాలరావు, సిపిఐ బెజవాడ రవిబాబు, టీడీపీ మల్లాది హనుమంతరావు, కాంగ్రెస్ సూరం శెట్టి కిషోర్ తదితరులు కృతజ్ఞతలు తెలియ జేశారు.






# బిజినెస్



## వరల్డ్ బిలియనీర్లలో టాప్‌లో టెస్లా అధినేత ఎలాన్ మస్క్



ఆర్థిక అసమానతల సంగతేమోగానీ ప్రపంచంలో కుబేరుల సంఖ్య మాత్రం ఏటా పెరుగుతూనే ఉంది. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య ఈ ఏడాది 3వేల28కి పెరిగింది. ప్రపంచ కుబేరుల మొత్తం సంపద విలువెంతో తెలుసా.. 16.1 లక్షల కోట్ల డాలర్లు. ఆర్థిక అసమానతల సంగతేమోగానీ ప్రపంచంలో కుబేరుల సంఖ్య మాత్రం ఏటా పెరుగుతూనే ఉంది. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య ఈ ఏడాది 3వేల28కి పెరిగింది. ప్రపంచ కుబేరుల మొత్తం సంపద విలువెంతో తెలుసా.. 16.1 లక్షల కోట్ల డాలర్లు. 2025 జులైకి సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. టెస్లా అధినేత ఎలాన్‌మస్క్‌ది బిలియనీర్స్‌లో టాప్ ర్యాంక్. జూన్‌తో పోలిస్తే సంపద విలువ 16 బిలియన్ డాలర్లు తగ్గినా ప్రపంచ కుబేరుల జాబితాలో ఎలాన్ మస్కే టాప్‌లో ఉన్నారు. ప్రపంచ కుబేరుల జాబితాలో సెకండ్ ప్లేస్‌లో ఉన్నారు ఒరాకిల్ కో ఫౌండర్ లారీ ఎలిసన్. ఆయన నాలుగో స్థానం నుంచి రెండో స్థానానికి ఎగబాకారు. ఒరాకిల్ షేరు 32శాతం రాణించడంతో ఆయన ర్యాంక్ పెరిగింది. ఇక ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ 247.9 బిలియన్ డాలర్ల సంపదతో 3వ స్థానంలో ఉన్నారు. 236.8 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఫోర్త్ ర్యాంక్‌లో నిలిచారు. ఇక ఎల్‌వీఎంహెచ్ అధినేత బెర్నార్డ్ ఆర్నాల్ట్ 147.7 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ బిలియనీర్లలో 5వ స్థానంలో ఉన్నారు. గూగుల్ వ్యవస్థాపకుడు లారీ పేజ్ 146.2 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 6వస్థానంలో నిలిచారు. ఇక బెర్క్ షైర్‌హాత్‌వేతో వారెన్ బఫెట్ 7వస్థానంలో ఉన్నారు. ఆయన సంపద 143.1 బిలియన్ డాలర్లకు చేరింది. 141.3 బిలియన్ డాలర్ల సంపదతో మైక్రోసాఫ్ట్ స్టీవ్ బామర్‌కి ప్రపంచ టాప్ టెన్ బిలియనీర్లలో 8వస్థానం దక్కింది. గూగుల్ కో ఫౌండర్ సెర్గీ బ్రిన్ 139.7 బిలియన్ డాలర్ల సంపదతో 9వస్థానంలో నిలిచారు. ఎన్‌విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ 137.9 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 10వస్థానం దక్కింది. ప్రపంచ కుబేరుల సంపద జూన్‌తో పోలిస్తే 100 బిలియన్ డాలర్లు పెరిగి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. వీరిలో తొమ్మిది మంది అమెరికన్లే. సంపద విలువ 7 రోజుల్లోనే దాదాపు 30% తగ్గటంతో టాప్ టెన్ బిలియనీర్ల జాబితాలో మైక్రోసాఫ్ట్ కోఫౌండర్ బిల్‌గేట్స్‌కి చోటు దక్కలేదు. ఇక దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ఉన్నారు రిలయన్స్ ముకేశ్ అంబానీ. 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియా వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీనే.

## బ్రిక్స్‌లో భాగమైన భారత్‌నూ వదలం పదిశాతం అదనపు సుంకం చెల్లించాల్సిందే



బ్రిక్స్‌లో భాగస్వామ్య దేశాలు వేటినీ వదిలేది లేదంటోంది అమెరికా. బ్రిక్స్‌లో భాగమైన భారత్ కూడా పదిశాతం అదనపు సుంకం చెల్లించాల్సిందేనని సంకేతాలిస్తున్నారు ట్రంప్. బ్రెజిల్‌లో సమావేశమైన 11దేశాల బ్రిక్స్ కూటమి ట్రంప్ ప్రతీకార సుంకాలను తప్పుపట్టింది. బ్రిక్స్‌లో భాగస్వామ్య దేశాలు వేటినీ వదిలేది లేదంటోంది అమెరికా. బ్రిక్స్‌లో భాగమైన భారత్ కూడా పదిశాతం అదనపు సుంకం చెల్లించాల్సిందేనని సంకేతాలిస్తున్నారు ట్రంప్. బ్రెజిల్‌లో సమావేశమైన 11దేశాల బ్రిక్స్ కూటమి ట్రంప్ ప్రతీకార సుంకాలను తప్పుపట్టింది. దీంతో మమ్మల్నే వేలెత్తి చూపిస్తారా.. మా డాలర్‌నే దెబ్బతీయాలని చూస్తారా అంటూ ఆవేశంతో ఊగిపోతున్నారు అమెరికా అధ్యక్షుడు. తమ విధానాలను వ్యతిరేకించిన బ్రిక్స్ దేశాలు కొత్త టారిఫ్‌లకు తోడు 10శాతం అదనపు సుంకం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పేశారు. బ్రిక్స్‌తో పెద్ద ముప్పేమీ లేదంటూనే డాలర్‌ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ట్రంప్ . ఆగ్రహం వ్యక్తంచేశారు. కానీ అలాంటిది జరగనివ్వమన్నారు. వారు గేమ్ మొదలుపెడితే తాను కూడా మొదలుపెడతానన్నారు ట్రంప్. డాలర్ ఎప్పటికీ రారాజే.. దాన్ని అలాగే కొనసాగిస్తామన్నారు ట్రంప్. ఎవరైనా దీన్ని సవాలు చేయడానికి ప్రయత్నిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు అమెరికా అధ్యక్షుడు. శ్వేతసౌధంలో ఆరో కేబినెట్ మీటింగ్ సందర్భంగా ఆయన కుండబద్దలు కొట్టేశారు.

భారత్‌తో అమెరికా సంబంధాలు బాగున్నాయి. దాంతో పెద్దన్న మన విషయంలో మొండికేయడనే అనుకున్నారంతా. కానీ ఎవరికీ ఎలాంటి మినహాయింపులూ లేవంటున్నారు ట్రంప్. ఎవరైనా బ్రిక్స్‌లో ఉంటే వారిపై 10శాతం సుంకాలు తప్పవని తేల్చేశారు. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా సహా బ్రిక్స్‌లోని 11 దేశాలు ప్రపంచ జీడీపీలో 40శాతం వాటా కలిగి ఉన్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు సగం ఈ దేశాలదే. అందుకే బ్రిక్స్ కూటమి రియో డిక్లరేషన్‌ని ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. చివరికి వాణిజ్య భాగస్వామిగా ఉన్న భారత్‌కి కూడా ఎలాంటి మినహాయింపులూ ఇవ్వలేనని ట్రంప్ చెప్పేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఆశాజనకంగా ఉన్న సమయంలో ట్రంప్ ప్రకటన భారత్ ఊహించని పరిణామం. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచడంతో పాటు రక్షణ, సాంకేతికత అంశాల్లో సహకారాన్ని పెంపొందించుకునే లక్ష్యంతో వాణిజ్య ఒప్పందానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ విషయంలో అమెరికా పంతాలకు పోదనుకుంటే.. ఆగస్టు 1 నుంచి సుంకాలు అమల్లోకి వస్తాయని, ఈసారి గడువు పొడిగింపేమీ ఉండదని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు డొనాల్డ్ ట్రంప్.

## మళ్లీ పెరిగిన బంగారం ధర!



మగువలకు బిగ్ షాక్ తగిలింది. తగ్గుతూ వస్తుంది అనుకున్న బంగారం ధర నేడు మరోసారి పెరుగుతూ బంగారం ప్రియులను నిరాశకు గురి చేసింది. మన దేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ దేనికీ లేదు. చాలా మంది ఎక్కువగా కొనడానికి ఇష్టపడే దాంట్లో బంగారమే ముందుంటుంది. మగువలకు బిగ్ షాక్..మళ్లీ పెరిగిన బంగారం ధర! మగువలకు బిగ్ షాక్ తగిలింది. తగ్గుతూ వస్తుంది అనుకున్న బంగారం ధర మరోసారి పెరుగుతూ బంగారం ప్రియులను నిరాశకు గురి చేసింది. మన దేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ దేనికీ లేదు. చాలా మంది ఎక్కువగా కొనడానికి ఇష్టపడే దాంట్లో బంగారమే ముందుంటుంది. ఇక త్వరలో శ్రావణ మాసం కూడా ప్రారంభం అవుతుండటంతో చాలా మంది శుభకార్యాలు చేస్తుంటారు. దీంతో ఇప్పుడే గోల్డ్ కొనుగోలు చేయాలని భావిస్తుంటారు. ఇలాంటి సమయంలో బంగారం ధర పెరగడం వారికి నిరాశకు గురి చేస్తుంది. ప్రస్తుతం గోల్డ్ రేట్స్ అనేవి ఆకాశాన్నంటుతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే గోల్డ్ రేట్స్ లక్షమార్క్ దాటిన విషయం తెలిసిందే. కాగా, నేడు బుధ వారం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. జూలై 9, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,850 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,610గా ఉంది. జూలై 9, 2025 మంగళ వారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,840గా ఉండగా,నేడు రూ.10 పెరగడంతో గోల్డ్ రేట్ రూ.98,850గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.90,600గా ఉండగా, నేడు రూ.10 పెరగడంతో గోల్డ్ రేట్ రూ.90,610గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.98,850 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,610 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,19,800లుగా ఉంది.

## నయా ఈవీలో అదిరే ఫీచర్లు



ప్రపంచవ్యాప్తంగా ఈవీ వాహనాల క్రేజ్ అమాంతం పెరుగుతుంది. టాప్ కంపెనీల నుంచి స్టార్టప్ కంపెనీల వరకు ప్రతి ఒక్కరూ తమ మోడల్ ఎలక్ట్రిక్ వాహనాలను రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ కంపెనీ బీఎండబ్ల్యూ మోట్రాడ్ గతంలో సీఈ–04 పేరుతో ఈవీ స్కూటర్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆ ఈవీ స్కూటర్‌కు అప్‌డేటెడ్ వెర్షన్‌ను కంపెనీ రిలీజ్ చేసింది. బీఎండబ్ల్యూ కంపెనీ తన పూర్తి–ఎలక్ట్రిక్ మ్యాక్సీ–స్కూటర్ అయిన అప్‌డేటెడ్ సీఈ–04 ఇటీవల ఆవిష్కరించింది. ఈ కొత్త మోడల్ గత మోడల్ మాదిరిగానే పవర్‌ట్రెయిన్‌తో వస్తుంది. అయితే రోజువారీ వినియోగం, సౌకర్యం కోసం మరిన్ని రంగు ఎంపికలతో పాటు కొన్ని పరికరాల అప్‌డేట్స్ ఆకట్టుకుంటున్నాయి. డిజైన్ అప్‌డేట్ అనేది ప్రధానంగా మూడు ట్రిమ్‌ల కోసం కొత్త పెయింట్ స్కీమ్‌లపై దృష్టి సారించాయి. బేస్, అవంట్‌గార్డ్, ఎక్స్‌క్లూజివ్ వేరియంట్స్‌లో ఈవీ స్కూటర్స్ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ప్రత్యేకమైన ట్రిమ్ పొడవైన విండ్‌స్క్రీన్, కంఫర్ట్ సీట్లు, ఐచ్ఛిక సెంటర్ స్టాండ్‌తో వస్తుంది. ఈ స్కూటర్ లిక్విడ్–కూల్డ్ పర్మనెంట్ మాగ్నెట్ మోటారుతో శక్తినిస్తుంది. ఇది 42హెచ్‌పీ గరిష్ట అవుట్‌పుట్, 62 ఎన్ఎం వరకు టార్క్‌ను అందిస్తుంది. ఈ స్కూటర్‌పై గంటకు 120 కిలోమీటర్ల గరిష్ట వేగంతో దూసుకుపోవచ్చు. అలాగే ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే దాదాపు 130 కిలోమీటర్ల పరిధిని అందిస్తుంది. 60.6 ఏహెచ్ సామర్థ్యంతో లిథియం–అయాన్ బ్యాటరీతో వచ్చే ఈ ఈవీ స్కూటర్‌ను సాధారణ గృహ సాకెట్, వాల్‌బాక్స్ లేదా పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల ద్వారా ఛార్జ్ చేయవచ్చు. ప్రామాణిక 2.3 కేడబ్ల్యూ సెటప్‌తో పూర్తి ఛార్జ్ నాలుగు గంటల కంటే కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. కానీ ఐచ్ఛిక 6.9 కేడబ్ల్యూ క్విక్ ఛార్జర్‌ని ఉపయోగించి ఒక గంట 40 నిమిషాలకు తగ్గించవచ్చు.

## పేరుకుపోయిన కార్ల నిల్వలు



దేశంలో కార్ల అమ్మకాలు పడిపోవడంతో పాటు ఎగుమతుల్లోనూ మందగింపుతో వాహన నిల్వలు పేరుకుపోతున్నాయి. వరుసగా పెంచిన ధరలకు తోడు, డిమాండ్ పడిపోవడంతో అమ్మకాలు లేక దేశవ్యాప్తంగా డీలర్ల వద్ద కోట్ల రూపాయల విలువైన కార్ల నిల్వలు పోగుబడుతున్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొనే అమ్మకాల సవాళ్ల గురించి ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) ఆందోళన వ్యక్తం చేసింది. సరఫరా పరిమితులు, అధిక ఇన్వెంటరీ స్థాయిలు రిటైల్ విక్రయాల వృద్ధికి అడ్డంకిగా మారాయని తెలిపింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా సుంకాల నుంచి వచ్చే స్పిల్‌ఓవర్ ప్రభావాలు వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. అదే సమయంలో చైనా అరుదైన లోహాల ఎగుమతి నిషేధాలు వాహన సరఫరాను మరింత ఒత్తిడికి గురి చేయవచ్చని ఎఫ్ఏడీఏ పేర్కొంది. ఈ ఏడాది మే లో విక్రయాలతో పోల్చితే జూన్‌లో రిటైల్ వాహన అమ్మకాలు 9.4 శాతం క్షీణించాయి. ఒక కారు షోరూంలో ఉండే సగటు సమయం, లేదా ఇన్వెంటరీ రోజులు మే నెలలో 52–53 రోజులుగా ఉండగా.. జూన్‌లో సుమారు 55 రోజులకు పెరిగాయి. ఇది ఎఫ్ఏడీఏ సిఫారసు చేసిన 21 రోజుల గడవు కంటే చాలా ఎక్కువ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన హెచ్చు సుంకాలు, దేశీయంగా కఠిన ఫైనాన్సింగ్ విధానం భారతీయ కార్ల తయారీదారులకు తీవ్రమైన సవాళ్లుగా నిలిచాయని ఎఫ్ఏడీఏ పేర్కొంది. అయితే ప్రస్తుతం దేశంలో స్వల్ప కాలంలోనే సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాల నమోదుతో సమీప భవిష్యతులో అమ్మకాలు పెరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది.

## మళ్లీ గోల్డ్‌మన్ శాక్స్‌కు రుషీ సునాక్



బ్రిటన్ మాజీ ప్రధాని రుషీ సునాక్ మళ్లీ వృత్తి బాట పట్టారు. అంతర్జాతీయ ఇన్వెస్టమెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సునాక్ సీనియర్ సలహాదారు (అడ్వైజర్)గా చేరనున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది. 2024 జూలైలో జరిగిన బ్రిటన్ ఎన్నికల్లో సునాక్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీ ఘోర ఓటమి పాలైంది. అనంతరం సునాక్ బ్రిటన్ ప్రధాని పదవితోపాటు పార్టీ ఆధ్యక్ష హోదా నుంచీ తప్పుకున్నారు. అయితే, రిచ్‌మాండ్, నార్త్‌అల్లెర్టన్ ఎంపీగా మాత్రం కొనసాగుతున్నారు. రాజకీయాల్లో చేరక ముందు కూడా ఆయన గోల్డ్‌మన్ శాక్స్‌లోనే పనిచేశారు. 2001–2004 మధ్యకాలంలో ఆయన కంపెనీలో తొలుత సమ్మర్ ఇంటర్న్‌గా, ఆ తర్వాత జూనియర్ అనలిస్ట్‌గా పనిచేశారు. ఇప్పుడు సీనియర్ అడ్వైజర్ హోదాలో కంపెనీ యాజమాన్యం, క్లయింట్లకు భౌగోళిక రాజకీయ, ఆర్థిక సంబంధిత అంశాలపై సలహాలు ఇవ్వనున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ నుంచి లభించే పారితోషికాన్ని సునాక్ తన భార్య అక్షతా మూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి కూతురు)తో కలిసి ప్రారంభించిన రిచ్‌మాండ్ ప్రాజెక్ట్‌కు విరాళంగా ఇవ్వనున్నారు. ఈ చారిటీ సంస్థ బ్రిటన్ వాసుల్లో గణాంక నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.


# జాతీయం – అంతర్జాతీయం

## రాజ్యాంగంతోనే సామాజిక న్యాయం



నాగ్‌పూర్: రాజ్యాంగం ద్వారానే పౌరులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం దక్కుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. దేశంలో అన్నింటికన్నా రాజ్యాంగమే అత్యున్నతమైనదని చెప్పిన అంబేద్కర్, న్యాయవ్యవస్థపై కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం చేసుకోకుండా స్వేచ్ఛగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పౌరుల హక్కులను కాపాడేందుకు న్యాయవ్యవస్థ కాపలా ఉండాలని అంబేద్కర్ తెలిపారని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో మనందరినీ రాజ్యాంగం ఐక్యంగా ఉంచుతుందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారని చెప్పారు. రాజ్యాంగం నిశ్చలంగా ఉండదనీ, ఎప్పుడూ మారుతూ ఉంటుందని ఆయన అన్నారన్నారు. దేశాన్ని పాలించేవారు కుల, మతాలను దాటి కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని సూచించినట్టు తెలిపారు. అంతకుముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌ను మహారాష్ట్ర అసెంబ్లీ సన్మానించింది. అత్యున్నత న్యాయ పీఠాన్ని అందకున్న ఆయనను అభినందిస్తూ మహారాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. జస్టిస్ గవారును శాసనసభ తరఫున ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సన్మానించారు. జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవారు 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. సీజేఐ జస్టిస్ గవారు తండ్రి ఆర్ఎస్ గవారు బీహార్, కేరళ గవర్నర్‌గా పనిచేశారు. అంబేద్కర్ వాది అయిన ఆర్ ఎస్ గవాయ్ పార్లమెంట్ సభ్యులుగా కూడా పనిచేశారు. 1985లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదులతో కలిసి పనిచేసి అనతికాలంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ తర్వాత మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నాగ్‌పూర్ బెంచ్‌లో కెరీర్ ప్రారంభించిన ఆయన తన పట్టుదలతో సీజేఐ స్థాయి వరకు ఎదిగారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డు సాధించారు.

## ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదు



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా గట్టి కౌంటర్ ఇచ్చారు. అమెరికా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తానంటూ డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా స్పందిస్తూ.. ప్రపంచం ఇంతకు ముందులా లేదు. అందువల్ల ప్రపంచానికి చక్రవర్తి కూడా అవసరం లేదని వ్యాఖ్యానించారు. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు కార్యక్రమంలో లూలా మాట్లాడుతూ..మన దేశాలు సార్వభౌమాధికారాన్ని కలిగి ఉన్నాయి. ట్రంప్ సుంకాలను జారీ చేస్తే.. ఇతర దేశాలకూ అదే చేసే హక్కు ఉంది. అగ్రరాజ్యానికి అధ్యక్షుడైన ఆయన సుంకాల గురించి సోషల్ మీడియాలో ప్రపంచాన్ని బెదిరించడం బాధ్యతారాహిత్యంగా భావిస్తున్నా. ఇలాంటి అంశాలపై ఇతర దేశాలతో మాట్లాడేందుకు చాలా వేదికలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. ఒకరిని ఎదుర్కోవడం కోసం బ్రిక్స్ ఎవరికీ హాని చేయదని, కానీ రాజకీయాలు చేసేందుకు మరో ఉదాహరణ ఉండాలని మాత్రమే ఈ కూటమి కోరుకుంటోందని లూలా వ్యాఖ్యానించారు. బ్రిక్స్ సదస్సు వ్యాఖ్యానించారు. బ్రిక్స్ సదస్సు జరుగుతున్న వేళ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ఒక పోస్టు పెట్టారు. అందులో 'బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు' అని పేర్కొన్నారు. దీంతో ట్రంప్ హెచ్చరికలపై చైనా ఆచితూచి స్పందించింది. బ్రిక్స్ ఘర్షణను కోరుకునే కూటమి కాదని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు. ఏ ఒక్క దేశాన్నీ అది లక్ష్యంగా చేసుకోదన్నారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన లీవిట్ మాట్లాడుతూ.. బ్రిక్స్ సదస్సును ట్రంప్ నిశితంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అందులోని దేశాలు బలపడుతున్నాయని ఆయన అనుకోవడం లేదన్నారు. కానీ అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ట్రంప్ భావిస్తున్నారన్నారు. అమెరికా ఫస్ట్ విధానానికి అధ్యక్షుడు కట్టుబడి ఉన్నారని తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో 35% మహిళలకే



పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రజాకర్షక నిర్ణయాలు ప్రకటించడంలో పోటీ పడుతున్నాయి. తాజాగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అలాంటి ప్రకటనే చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగం లోని అన్ని పోస్టులకు ఆ ప్రత్యేక రిజర్వేన్ వర్తిస్తుందని సీఎం చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ సర్వీసుల్లో స్త్రీల పాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పాట్నాలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళా ఓటర్ల కోసం రిజర్వేషన్ ప్రకటించగా, యువత కోసం బీహార్ యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీనికింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వారి సంక్షేమం, ఉన్నతికి సంబంధించిన అంశాలపై కమిషన్ సలహాలు ఇవ్వొచ్చు. అలాగే మెరుగైన విద్య , ఉపాధి అవకాశాల విషయంలో ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోనుంది. ఇదిలా ఉంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికారపక్షమైన ఎన్డీయే, ప్రతిపక్ష మహాగట్ బంధన్ సీట్ల పంపిణీకి సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు మిత్ర పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రధాన కూటముల్లోనూ అంతర్గత విభేదాలనూ అధిగమించడానికి గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రాతిపదికన సీట్ల పంపకం చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. మరోవైపు విపక్ష కూటమి మహాగట్ బంధన్ సీట్లపంపిణీపై ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించింది. దీనికి అన్ని పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యారు. కొన్ని పార్టీలు తమకు ఎక్కువ సీట్లు కావాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని పార్టీలు తాము పోటీ చేయాలనుకొంటున్న సీట్ల జాబితా ఇవ్వాలని ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ మిత్ర పక్షాలను కోరారు.

ఈ ఏడాది అక్టోబర్ , నవంబర్ నెలల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

### చైనా వీసా 70 దేశాలకు ఉచితం

చైనా తన వీసా నిబంధనలను సడలించింది. 70 దేశాలకు చెందిన పౌరులకు వీసా అవసరం లేదంటూ అనూహ్య నిర్ణయం తీసుకుంది. 30 రోజులపాటు తమ దేశాన్ని సందర్శించడానికి అనుమతిస్తున్నామని సోమవారం ప్రకటించింది. దీంతో ఆ దేశ పర్యటక సంస్థలు, వ్యాపారులు ఎక్కువ మంది టూరిస్టులు చైనాకు వస్తారని భావిస్తున్నారు. చైనా అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి, పర్యాటకరంగ అభివృద్ధికి ఈనిర్ణయం తీసుకుంది. కోవిడ్ అనంతరం 1.38 కోట్ల మంది పర్యాటకులు మాత్రమే వచ్చారు, 2024 లో 2 కోట్లు రాగా ప్రస్తుతం రెట్టింపు వస్తారని ప్రభుత్వ వర్గాల అంచనా. 2023 డిసెంబర్‌లో ఫ్రాన్స్ , జర్మని, ఇటలీ , నెదర్లాండ్, స్పెయిన్, మలేషియా దేశాల పౌరులకు వీసా లేకుండా ప్రవేశాన్ని కల్పించింది. ప్రస్తుతం మొత్తం ఐరోపా దేశాలు, ఐదు లాటిన్ అమెరికా దేశాలు , నాలుగు మిడిల్ ఈస్ట్ దేశాలు, ఉజ్బెకిస్తాన్‌లతో పాటు అజర్ బైజాన్‌కు అవకాశం కల్పించనుంది. ఆఫ్రికా దేశాలతో సత్సంబంధాలున్నప్పటికీ వాటిని మినహాయించింది. ఈ కొత్తవీసా నిబంధన ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షి స్తుందని, కొత్త అవకాశాలను కల్పిస్తుందని వైల్డ్ చైనా , ట్రిప్.కాం గ్రూప్ సంస్థలు ప్రకటించాయి.

## వరద బీభత్సం..

### 109కి చేరిన మృతుల సంఖ్య

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఓ సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులు, కౌన్సిలర్లు సహా మొత్తం 109 మంది ఈ జల ప్రళయానికి బలయ్యారు. మరో 160 మందికి పైగా గల్లంతైనట్టు అధికారులు వెల్లడించారు. గ్వాడలుపే నది వెంట సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.గ్వాడలుపే నది తీరంలోని హంట్ ప్రాంతంలో ఉన్న 'క్యాంప్ మిస్టిక్'లో ఈ ఘోరం జరిగింది. ఈ క్యాంప్‌కు చెందిన 27 మంది చిన్నారులు, కౌన్సిలర్లు మరణించినట్టు క్యాంప్ నిర్వాహకులు సోమవారం తెలిపారు.

ఈ ఊహించని విషాదంతో తాము తీవ్ర వేదనకు గురయ్యామని, బాధిత కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గల్లంతైన వారి కోసం స్థానిక అధికారులతో కలిసి గాలిస్తున్నట్టు చెప్పారు. కెర్ కౌంటీ షెరీఫ్ లారీ లీథా ప్రకారం.. క్యాంప్‌కు చెందిన మరో ఐదుగురు చిన్నారులు, ఒక కౌన్సిలర్ ఆచూకీ ఇంకా లభించలేదని తెలుస్తోంది. వరదలు సంభవించినప్పుడు క్యాంప్‌లో సుమారు 750 మంది చిన్నారులు ఉన్నారు. ఈ వరదల కారణంగా మొత్తం 161 మంది గల్లంతయ్యారని, వారిని గుర్తించేందుకు గ్వాడలుపే నదీ వ్యవస్థ అంతటా గాలింపు చర్యలు కొనసాగుతాయని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ మంగళవారం మీడియాకు తెలిపారు.

తప్పిపోయిన తమ బంధువులు లేదా స్నేహితుల గురించి సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గవర్నర్ అభ్యర్థన మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెర్ కౌంటీని విపత్తు ప్రాంతంగా ప్రకటించారు. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యంగా సెలవుల సమయంలో జరిగిన ఈ దుర్ఘటనలో చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గాజాపై కొనసాగుతున్న దాడులు



ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుగుతుండగానే మరోవైపు గాజాపై ఇజ్రాయిల్ దళాల దాడులు కొనసాగుతున్నాయి. ఉత్తర ప్రాంతంలో మంగళవారం జరిగిన పేలుడులో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా 14 మంది గాయపడ్డారు. కాగా వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూతో చర్చలు జరిపారు. పాలస్తీనా ప్రజలను గాజా నుండి బలవంతంగా ఖాళీ చేయించి, పొరుగు దేశాలకు తరలించేందుకు ఉద్దేశించిన వివాదాస్పద ప్రతిపాదనపై వారిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఇదిలావుండగా ఎమనలో హౌతీలు ఎర్ర సముద్రంలో మరో నౌకను ధ్వంసం చేశారు. అందులోని గ్రెనేడ్లను లక్ష్యంగా చేసుకొని హౌతీలు దాడి జరిపారు.ట్రంప్, నెతన్యాహూ మధ్య శ్వేతసౌధంలోని బ్లూ రూమ్‌లో విందు సమావేశం జరిగింది. పాలస్తీనాకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు అమెరికా, ఇజ్రాయిల్ ఇతర దేశాలతో కలిసి పని చేస్తున్నాయని నెతన్యాహూ చెప్పారు. గాజాలో నివసిస్తున్న వారు పొరుగు దేశాలకు తరలిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 'గాజాలోనే ఉండాలని అనుకుంటే ఉండొచ్చు. కానీ వారు బయటకు వెళ్లాలనుకుంటే వెళ్లే అవకాశం కల్పించాలి. అది జైలులా ఉండకూడదు. ఓ బహిరంగ ప్రదేశంలా ఉండాలి. ప్రజలకు స్వేచ్ఛగా అవకాశం కల్పించాలి' అని చెప్పుకొచ్చారు. ట్రంప్‌తో సమావేశం సందర్భంగా నెతన్యాహూ ఆయనకు ఓ లేఖ అందజేశారు. ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తున్నానని అందులో నెతన్యాహూ తెలియజేశారు.

## డికె.. సిఎం కావడం ఖాయం

బెంగళూరు : కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉండదని చెప్పినా ఉత్కంఠ కొనసాగుతోంది. ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఓవైపు సిద్ధరామయ్య చెబుతున్నా, అక్కడి పరిస్థితులు మాత్రం ప్రతికూలంగా కనిపిస్తున్నాయి. సీఎం పదవిని ఆశించడంలో తప్పులేదు కదా అని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బహిరంగంగా తన కోర్కెను వెల్లడించడంతో సీఎం మార్పు అంశం తార స్థాయికి వెళ్లింది. తాజాగా డీకేకు అనుకూలంగా ఎమ్మెల్యే సీసీ యోగేశ్వర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ లోని మెజార్టీ ఎమ్ఎల్ఎల మద్దతు , ప్రజల మద్దతు ఆయనకే ఉందని చెప్పారు. "చాలా మంది ఎమ్మెల్యేలు ఒకే మాటపై ఉన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఇది కేవలం నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. పలువురు ఎమ్ఎల్ఏలు , ప్రజలు ఇదే కోరుకుంటున్నారు" అని మంగళవారం యోగేశ్వర్ అన్నారు.

అయితే నిర్ణయం మాత్రం అధిష్టానం చేతిలో ఉందని చెప్పారు. డీకేకు 100 మంది ఎమ్ఎల్ఏల మద్దతు ఉందని మరోనేత చెప్పుకొచ్చారు. సీఎం మార్పు సిద్దరామయ్య , డీకే శివకుమార్ వర్గాల మధ్య తీవ్ర అంశంగా మారిన నేపథ్యంలో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇటీవల వారిద్దరితో సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత సోమవారం డీకే సిఎం పదవిని ఆశించడంలో తప్పులేదు కదా అని తన కోరికను పరోక్షంగా బయటపెట్టారు. ఈ తరుణంలో ఆయనకు మద్దతు ఇస్తూ ఎమ్ఎల్ఎలు ప్రకటనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## కుప్పకూలిన వంతెన.. నదిలో పడిపోయిన వాహనాలు

వడోదర: గుజరాత్‌లో విషాద సంఘటన చోటుచేసుకుంది. వడోదర జిల్లాలోని మహిసాగర్ నదిపై ఉన్న 45 ఏళ్ల గంభీర వంతెన కూలిపోయింది. బుధవారం (జూలై 9) ఉదయం 7.30 గంటల సమయంలో వంతెనలోని ఒక భాగం కుప్పకూలడంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని పద్రా పోలీసు ఇన్‌స్పెక్టర్ విజయ్ చరణ్ తెలిపారు. ప్రమాదానికి గురైన వాహనాల్లో రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు ఉన్నాయి. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్స్ సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు దాదాపు 10 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నదిలో చిక్కుకున్న మరికొంత మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

పద్రాను ఆనంద్ జిల్లాకు అనుసంధానించిన ఈ వంతెన చాలా కాలంగా శిథిలావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేపాల్ ప్రధాని వివాదాస్పద వ్యాఖ్యలు



శ్రీరాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు తమ దేశంలోనే జన్మించాడని ఆయన పేర్కొన్నారు. సోమవారం కాఠ్‌మాండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఓలి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు నేపాల్ లోనే జన్మించాడని ఓలి పునరుద్ఘాటించారు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని, ఈ విషయం ప్రచారం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం సంకోచించవద్దని పిలుపునిచ్చారు. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరని ప్రశ్నించారు. రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉందని, అది ఇప్పటికీ అక్కడే ఉందన్నారు. దీన్ని తాము అంతగా ప్రచారం చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

అది కొందరిని బాధిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన శివుడు , విశ్వామిత్రుడు కూడా తమ దేశం లోనే జన్మించారని పేర్కొన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, వాల్మీకి రామాయణం లోనే ఇది కూడా ఉందన్నారు. ఇక గతం లోనూ ఓలి ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. 2020లో అయోధ్య తమ దేశం లోని చిత్వాన్ లోని థోరిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడే రాముడు పుట్టాడని ఆయన అన్నారు. అలాగే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేసిన ప్రాంతం కూడా తమ దేశంలోనే ఉందన్నారు. అప్పట్లో ఓలి చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలో నేపాల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది . ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. రాముడు జన్మస్థలంపై అనేక అభిప్రాయాలు ఉన్నాయని , రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని తెలియజేసింది.

## రైలులో గ్యాంగ్ రేప్.. మహిళను రైలు పట్టాలపై విసిరేసి..

న్యూఢిల్లీ: హర్యానాలో పానిపట్ రైల్వేస్టేషన్‌లో దారుణం జరిగింది. రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులోని ఖాళీబోగీలో ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసిన దుండగులు, ఆమెను సోనిపట్ రైలుపట్టాలపై విసిరివేయడంతో ఆమె రెండుకాళ్లు పోగొట్టుకున్నట్లు తెలిసింది. జూన్ 24 నుంచి ఆమె కనిపించకుండా పోయిందని ఆమె భర్త జూన్ 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె గతంలో కూడా ఇలా కనిపించకుండా పోయినా, తనంత తానే తిరిగి ఇంటికి వచ్చేదని పేర్కొన్నాడు. బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించింది. తాను పానిపట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉండగా ఓ వ్యక్తి తన భర్త తీసుకురమ్మన్నాడని చెప్పి తనను తీసుకువెళ్లి ఖాళీగా ఉన్న బోగీలో ఎక్కించాడని, అతడు, మరో ఇద్దరు తనపై అత్యాచారం చేశారని, తర్వాత సోనిపట్ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి తనను రైలుపట్టాలపై విసిరివేశారని, తనపై నుంచి రైలుపోవడంతో కాళ్లు కోల్పోయామని చెప్పినట్లు ఆమె పోలీసులకు వివరించింది. పట్టాలపైపడి కాళ్లు కోల్పోయిన ఆ మహిళ అరుపులు, ఏడుపు విని సమీపంలో దుకాణందారు, స్థానికులు రైల్వే పోలీసులకు తెలుపడంతో వాళ్లు మొదట సోనిపట్ జనరల్ ఆస్పత్రికి, తర్వాత రోహక్ పిజిఐకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు గ్యాంగ్‌రేప్ కేసు నమోదు చేసి, పానిపట్ రైల్వేపోలీసులకు కేసు అప్పగించారు.

## నేపాల్-చైనా సరిహద్దులో కూలిన వంతెన..

కాఠ్‌మాండు: రుతుపవనాల కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నేపాల్–చైనా మధ్య ఉన్న మైత్రి వంతెన బోటెకోషి వద్ద మంగళవారం కొట్టుకుపోయింది. ఈ వరదల కారణంగా 12 మంది నేపాలీలు, 6 మంది చైనీయులు గల్లంతయ్యారు. కాట్మాండుకు ఈశాన్యంగా 120 కిమీ దూరంలో ఉన్న ఈ వంతెన వరద బీభత్సంతో మంగళవారం తెల్లవారు జామున 3.15 గంటల సమయంలో కూలిపోవడంతో సరిహద్దులో ట్రాఫిక్ దెబ్బతింది. తప్పిపోయిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఇద్దరు పోలీస్ అధికారులతోపాటు మొత్తం 11 మందిని నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీస్, నేపాల్ పోలీస్ సంయుక్త బృందం రక్షించినట్టు జాతీయ విపత్తునివారణ అథారిటీ వెల్లడించింది. వరదల వల్ల భారీ నష్టం జరిగిందని రసూవా జిల్లా ప్రధాన అధికారి అర్జున్ పాడెల్ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తక్షణం తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. ఈలోగా ధాడింగఖ జిల్లా గజూరి మున్సిపాలిటీ పరిధి లోని త్రిశూలి నది నుంచి రెండు మృతదేహాలను పోలీసులు వెలికి తీయగలిగారు. వరదలతో మునిగిపోయిన రసువగఢి జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన చైనా జాతీయుడు ఒకరితోపాటు మొత్తం 22 మంది కార్మికులను, నేపాల్ ఆర్మీ రక్షించగలిగింది. జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా పాక్షికంగా దెబ్బతింది.

# చక్కని ఆరోగ్యం

## పురుగులున్నాయని మేడిపండును దూరం పెడుతున్నారా..?



మేడిపండు చూడు..మేలమై ఉండు..పొట్ట విప్పి చూడు పురుగులుండు.. ఈ వేమన శతకం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఈ పద్యంలోని మేడి పండు చూసేందుకు అచ్చం అంజీర పండులాగే ఉంటుంది. కానీ, పొట్టనిండా పరుగులే నిండివుంటాయి. కానీ, ఈ పండును ఒక సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. మేడి పండు తినడం వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. మేడిపండులో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటాయి. రక్తహీనత ఉన్నవారికి చాలా మంచిది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యానికి మంచిది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పచ్చి పండ్లకు మధుమేహాన్ని దూరం చేసే శక్తి ఉంది. మేడిపండులో పురుగులు ఉండడం సర్వసాధారణం. అయితే కొన్ని రకాల పురుగులే ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. అనేక పోషక విలువలు గల ఈ మేడిపండు తినేటప్పుడు జాగ్రత్తగా పురుగులు తీసి తినండి. అంతేగానీ, ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా ఉన్న ఈ పండు తినడం మానకూడదని నిపుణులు చెబుతున్నారు. మేడి పండ్లలో మంచి మొత్తంలో మెగ్నీషియం ఉంటుంది. మేడిపండు..దీని హైబ్రిడ్ రకాలను అత్తిపండు, అంజీర అంటారు. మేడిపండు చూడడానికి గుండ్రంగా ఉంటుంది. పచ్చగా ఉన్నప్పుడు కాస్త పుల్లగా, చేదుగా ఉండే మేడి పండు పండిన తరువాత పసుపు రంగులోకి మారుతుంది. అప్పుడు రుచి కూడా తియ్యగా ఉంటుంది. అయితే, నాటు పండయిన మేడిపండ్లలో పురుగులు ఉంటాయి. మేడి పండ్లు, ఆకులు, బెరడు, వేర్లు ఔషధ సంపదగా పరిగణిస్తారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. కరోనా అనంతరం ప్రజలు మేడిపండును దాని కాండం, ఆకులు, పండ్లను విస్తృతంగా వినియోగించారు. దీని పండ్లు, ఆకులు, బెరడులు అంటువ్యాధులతో పోరాడే గొప్ప శక్తిని కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. మేడి పండ్లు తినటం వల్ల అద్భుతమైన శక్తి లభిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని తరచూ తినటం వల్ల వయసు పైబడిన లక్షణాలు బయటపడకుండా ఉంటాయి. వృద్ధాప్య సంకేతాలను దూరం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఊపిరితిత్తుల వ్యాధులు, గొంతు నొప్పి, మంట, విరేచనాలను నయం చేయడానికి కూడా మేడిపండ్లు మంచి మందులా పనిచేస్తుంది. మేడి పండ్లలో మంచి మొత్తంలో మెగ్నీషియం ఉంటుంది.

ఇది ఈ లక్షణాలన్నింటినీ తొలగిస్తుంది. మీ జీర్ణక్రియను చక్కగా ఉంచుతుంది.

## మధుమేహం బాధితులు తేనె తింటే ఏమౌతుందో తెలుసా..?



షుగర్ కంటే కూడా తేనె తియ్యగా ఉంటుంది. కానీ, చక్కెరలో కంటే తేనెలో ఆయుర్వేద గుణాలు మెండుగా ఉంటాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తేనెలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. తేనెలో రోగనిరోధక శక్తి ఉన్నప్పటికీ ఇందులో చక్కెరలు అధికంగా ఉంటాయి.. తేనెలో ఉండే గ్లైసెమిక్ ఇండెక్స్ చక్కెర కంటే తక్కువ స్థాయిలో ఉంటుంది. కానీ ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. కాబట్టి తేనె విషయంలో జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. తేనెలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. దగ్గుతో ఇబ్బంది పడుతున్న వారికి తేనె తినిపిస్తే ఉపశమనం లభిస్తుంది. తేనెలో యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు కనిపిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. సాధారణంగా చక్కెరను ఉపయోగించే చోట తేనెను తక్కువ మొత్తంలో ఉపయోగించవచ్చు. కానీ, తేనె తీసుకునే ముందు, మీరు మీ వైద్యుడిని సంప్రదించడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. లేదంటే, ఒక రోజుకు ఒక టీస్పూన్ కంటే ఎక్కువ తేనె తీసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. తేనెలో ఐరన్, కాల్షియంతో పాటు ఇతర పోషకాలు కూడా ఉంటాయి. అయితే బ్యాలెన్స్‌డ్ డైట్‌లో చక్కెర కంటే తేనె వాడటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ, మధుమేహం బాధితుల్లో తేనె, చక్కెర రెండూ చేటు చేస్తాయి. వీటిని డైట్‌లో చేర్చుకుంటే రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

తేనె చక్కెర కంటే తియ్యగా ఉంటుందని మీరు గుర్తుంచుకోవాలి. కాబట్టి, షుగర్ బాధితులు దీనిని తక్కువ పరిమాణంలో మాత్రమే తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. తేనెలోని చక్కెరలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి, మధుమేహులు తేనె తీసుకోవడం మానుకోవాలి.

## గోల్డెన్ వాటర్.. అమృతం కన్నా పవర్‌ఫుల్..

ఉదయం తీసుకునే మొదటి ఆహారం లేదా పానీయం.. మీ ఆరోగ్యం భవిష్యత్తులో ఎలా ఉంటుందో నిర్ణయిస్తుంది. మీరు ఖాళీ కడుపుతో ఆరోగ్యకరమైన ఆహారం తిన్నా.. లేదా పానీయం తాగినా మీరు రోజంతా చురుగ్గా ఉంటారు.. కానీ మీరు మీ రోజును జంక్ ఫుడ్ లేదా అనారోగ్యకరమైన పానీయాలు, పదార్థాలతో ప్రారంభిస్తే, వ్యాధులు వెంటనే చుట్టుముడుతాయి. ఉదయం తీసుకునే మొదటి ఆహారం లేదా పానీయం.. మీ ఆరోగ్యం భవిష్యత్తులో ఎలా ఉంటుందో నిర్ణయిస్తుంది. మీరు ఖాళీ కడుపుతో ఆరోగ్యకరమైన ఆహారం తిన్నా.. లేదా పానీయం తాగినా మీరు రోజంతా చురుగ్గా ఉంటారు.. కానీ మీరు మీ రోజును జంక్ ఫుడ్ లేదా అనారోగ్యకరమైన పానీయాలు, పదార్థాలతో ప్రారంభిస్తే, వ్యాధులు వెంటనే చుట్టుముడుతాయి.. కానీ ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఏమిటి.. ఆరోగ్యకరమైన పదార్థాలను ఎలా తీసుకోవాలి.. అనే దానిపై తరచూ సందేహం ఏర్పడుతుంటుంది.. అయితే.. తేలికైన పానీయాలు, ఆహారం అన్ని ఆరోగ్యానికి మంచివేనని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. ప్రకృతి ప్రసాదించిన మొక్కలు, సహజ పదార్థాలు మన శరీరానికి ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి.. అలాగే.. ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.. అటువంటి పరిస్థితిలో, ఈ కథనంలో పసుపు నీరు ప్రయోజనాలు ఏంటి..? ఖాళీ కడుపుతో తీసుకుంటే.. శరీరానికి ఎలాంటి ప్రయోజనం చేకూరుస్తుంది..? పసుపు అనేది భారతీయ వంటశాలలలో ఉపయోగించే ఒక



సాధారణమైన పదార్థంగా భావిస్తారు.. కానీ పసుపు చాలా శక్తివంతమైన మసాలా దినుసు.. దీనిలో ఉండే కర్కుమిన్ శాస్త్రీయంగా యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, రోగనిరోధక శక్తిని పెంచేదిగా పరిగణించబడుతుంది. ముఖ్యంగా పసుపును ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటితో తీసుకుంటే, దాని ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. ఆయుర్వేదం - సైన్స్ రెండూ పసుపు నీరు ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని ధృవీకరిస్తున్నాయి. ఢిల్లీ ప్రభుత్వ ఆయుర్వేద విభాగంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.పి. పరాశర్.. దీని గురించి ప్రయోజనాలతోపాటు.. ఎన్నో విషయాలను చెప్పారు. గోరువెచ్చని పసుపు నీరు శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. జీవక్రియను చురుగ్గా ఉంచుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల మీరు రోజంతా తేలికగా ఉన్నట్లు అనిపిస్తుంది. పసుపులో ఉండే లక్షణాలు జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తాయి.. ఇది ఆహారాన్ని త్వరగా, సరిగ్గా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, మలబద్ధకం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ప్రేగులను శుభ్రపరచడంలో కూడా సహాయపడుతుంది.

## కాకరకాయలో బోలెడు పోషకాలు..

కాకరకాయ అనగానే చాలా మంది మోహం చాటేస్తారు. చేదుగా ఉంటుందని పక్కనపెడుతుంటారు. కానీ ఉన్న పోషకాల విలువ తెలిస్తే మాత్రం ఔరా అనాల్సిందే. కాకరకాయ తింటే మధుమేహం కంట్రోల్ అవుతుందని అందరికీ తెలుసు. అయితే ఇదే కాకుండా ఎన్నో లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు, పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను దూరం చేయడంలో కాకరకాయ మంచి ప్రయోజనాలు అందిస్తుంది. కాలేయాన్ని డీటాక్స్ చేసి.. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. కాకరకాయలో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడానికి, మొత్తం



రోగనిరోధక పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. బరువు తగ్గాలనుకునేవారు కూడా తమ డైట్‌లో కాకరకాయను తరచూగా తీసుకోవచ్చు. కేలరీ తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కాకరకాయలోని యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు పింపుల్స్, ఎగ్జిమాను దూరం చేసి స్కిన్ హెల్త్ని మెరుగుపరుస్తాయి. కాకరకాయలోని యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు పింపుల్స్, ఎగ్జిమాను దూరం చేసి స్కిన్ హెల్త్ని మెరుగుపరుస్తాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కంటి చూపును మెరుగుపరిచే లక్షణాలు దీనిలో ఉన్నాయి. వృద్ధాప్య సమయంలో వచ్చే సమస్యలు దూరమవుతాయి. కాకరకాయల్లోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను కంట్రోల్ చేస్తాయి. వీటిలో పొటాషియం, ఐరన్ వంటి ఇతర ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఏ, సి విటమిన్లు, జింక్, బయోటిన్ వంటివి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి మెరిసేలా చేస్తాయి. కాకరకాయలోని విటమిన్ సి, ఇతర చర్మ సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. కాకరకాయ కాలేయాన్ని శుభ్రపరచడానికి, విష పదార్థాలను తొలగించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## కాళ్లపై ఇలాంటి చారలు కనిపిస్తున్నాయా..

మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఇటీవల చాలామందిని వేధిస్తున్న సమస్య వెరికోస్ వెయిన్స్. కాళ్లలో సిరలు ఉబ్బి, నరాలు మెలికలు తిరుగుతున్నట్లు కనిపించడం ఈ సమస్య ప్రధాన లక్షణం. దీన్ని ఎక్కువ కాలం నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఈ వ్యాధి ఎవరికి ఎక్కువగా వస్తుంది? దీనికి పరిష్కారం ఉందా? కాళ్లలో ఉబ్బిన



సిరలు (వెరికోస్ వెయిన్స్) సమస్య ఇటీవల చాలామందిలో కనిపిస్తుంది. సిరల గోడలు బలహీనపడటం, వాటిలోని కవాటాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రక్తం గుండె వైపు వెళ్లక, కాళ్లలోనే నిలిచిపోతుంది. దీనివల్ల సిరలు ఉబ్బి, మెలికలు తిరుగుతాయి. 30 ఏళ్లు దాటిన వారిలో ఇది తరచు కనిపిస్తుంది. 50 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య మరింత ఎక్కువ. పురుషుల కంటే మహిళల్లో వెరికోస్ వెయిన్స్ వచ్చే అవకాశాలు అధికం. గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పులు, రుతుక్రమం, రుతువిరతి దీనికి కారణం. మహిళల హార్మోన్లు సిరల గోడలను సడలిస్తాయి. నర్సులు, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ గార్డులు ఇలా ఎక్కువ సమయం నిలబడి పనిచేసేవారి కాళ్లలో రక్తం నిలిచిపోయి, సిరలపై ఒత్తిడి పెరుగుతుంది. వంశపారంపర్యంగా ఈ సమస్య వచ్చే అవకాశం 10 శాతం ఉంటుంది. అధిక బరువు వల్ల కాళ్ల సిరలపై ఒత్తిడి పెరుగుతుంది. అవును, వెరికోస్ వెయిన్స్ కు పరిష్కారం ఉంది. ఇది పూర్తిగా నయం కాకపోయినా, లక్షణాలు తగ్గించి, సమస్య తీవ్రం కాకుండా చూడవచ్చు. చికిత్సా విధానాలు వ్యాధి తీవ్రత బట్టి మారుతాయి.వ్యాయామం: క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. నడక, సైక్లింగ్, ఈత వంటివి మంచివి. రోజుకు కనీసం 30 నిమిషాలు నడవండి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.


ఆరోగ్యకరమైన బరువు: అధిక బరువు తగ్గించుకుంటే సిరలపై ఒత్తిడి తగ్గుతుంది. కాళ్లు పైకెత్తడం: విశ్రాంతి తీసుకునేటప్పుడు కాళ్లను గుండె స్థాయి కన్నా కొద్దిగా పైకి ఉంచండి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. కంప్రెషన్ సాక్స్: కంప్రెషన్ మేజోళ్లు ధరిస్తే సిరలు కుదించుకుపోయి, రక్త ప్రవాహానికి సాయపడతాయి. వ్యాధి మరింత తీవ్రం కాకుండా ఇది నిరోధిస్తుంది.ఆహారం: అధిక పీచుపదార్థాలు, తక్కువ సోడియం ఉన్న ఆహారం తీసుకోండి. మలబద్ధకం తగ్గుతుంది. సిరలపై ఒత్తిడి తగ్గుతుంది. ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు మానుకోండి.

## భలే పవర్‌ఫుల్ ఆకులు ఇలా తిన్నారంటే ఆ సమస్యలన్నీ పరార్

ఆయుర్వేదంలో కొత్తిమీరను ఔషధంగా పరిగణిస్తారు. కొత్తిమీర ఆహార రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జ్యూస్‌లా, కూరల్లోనూ వేసుకుని తీసుకోవచ్చు. కొత్తిమీర ఆకులు ఏ వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయో ఇప్పుడు తెలుసుకుందాం. వంటగదిలో అనేక రకాల ఆకుకూరలు ఉంటాయి. కానీ వాటిలో అత్యంత ప్రత్యేకమైనది 'కొత్తిమీర'. అది పప్పు అయినా, కూర అయినా, రైతా అయినా, చట్నీ అయినా, కొత్తిమీర ఆకులు ప్రతి ఆహారం రుచితోపాటు వాసనను పెంచుతాయి. ఈ ఆకులు రుచిని పెంచడమే కాకుండా, మన శరీరానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఇందులో దాగి ఉన్న పోషకాలు మన ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఆయుర్వేదంలో కొత్తిమీరను ఔషధంగా కూడా పరిగణిస్తారు. కొత్తిమీరను అనేక సాంప్రదాయ వైద్య వ్యవస్థలలో ఉపయోగిస్తారు. ఆధునిక కాలంలో కూడా దాని ప్రాముఖ్యత తగ్గలేదు. US FDA, యూరప్‌లోని ఆహార భద్రతా సంస్థలు కొత్తిమీరను సురక్షితమైన, ఉపయోగకరమైన ఆహారంగా అంగీకరించాయి. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం, కొత్తిమీర ఆకులలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు కనిపిస్తాయి. వాటిలో కళ్ళు, చర్మం, ఎముకలకు చాలా ముఖ్యమైన విటమిన్లు A, C, K ఉంటాయి. దీనితో పాటు, ఫోలేట్, కాల్షియం, పొటాషియం, ఇనుము, మెగ్నీషియం వంటి మూలకాలు కూడా ఇందులో కనిపిస్తాయి. ఈ మూలకాలు శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, వ్యాధుల నుంచి రక్షించడంలో కూడా సహాయపడతాయి. కొత్తిమీర తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో ఈ ఆకులను నమలడం లేదా వాటి నీరు తాగడం వల్ల గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగులను శుభ్రపరుస్తుంది.




# సినిమా



## బ్లాక్ డ్రెస్సులో అందాలతో మతిపోగొడుతున్న సందీప ధార్..



## రవితేజ ఫ్యామిలీ నుంచి మరో హీరో.. ఫస్ట్ లుక్ అదిరిపోయింది

హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'మారెమ్మ' అనే టైటిల్ ఖరారు చేశారు. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపా బాలు కథానాయిక. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'మారెమ్మ' టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. "పవర్‌ఫుల్ రూరల్ గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'మారెమ్మ'. మాధవ్‌ను ఫెరోషియస్ రగ్డ్ లుక్‌లో ప్రజెంట్ చేస్తున్నారు నాగరాజ్. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కుశాల్ రెడ్డి కందాలా, కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి.

## జిమ్‌కి వెళ్లడం మానేశాను.. బరువు తగ్గుకుంటూ వచ్చానంటున్న విద్యా బాలన్



సాధారణంగా బరువు తగ్గేందుకు చాలా మంది జిమ్‌కి వెళుతుంటారు. అయితే జిమ్‌కి వెళ్లడం మానేసిన దగ్గర నుండి బరువు తగ్గుతూ వచ్చిందట. ఓ ప్రముఖ హీరోయిన్. ఆమె మరెవరో కాదు బాలీవుడ్ అందాల నటి విద్యా బాలన్. ఆమె పద్మశ్రీ, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' మరియు 'ఎన్టీఆర్ మహానాయకుడు' చిత్రాలో బసవతారకమ్మ పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో విద్యా బాలన్ తన శరీర ఆకృతి గురించి మాట్లాడింది. కెరీర్ ఆరంభం నుంచి తాను అనేక విమర్శలు ఎదుర్కొందట. లావుగా ఉన్నావు, ఫిట్‌గా లేవు అనే విమర్శలు తీవ్రంగా ఎదుర్కొన్నట్టు చెప్పింది.ల అయితే వాటిని అధిగమించేందుకు కఠినమైన డైట్లు, జిమ్ సెషన్లు ప్రయత్నించిన, ఫలితం కనిపించలేదని పేర్కొంది.అయితే చివరికి చెన్నైకి చెందిన 'అమూర్ న్యూట్రిషన్ గ్రూప్' తో సంప్రదించగా, ఆమెకు బరువు సమస్య ఫాట్ వల్ల కాకుండా శరీరంలో ఏర్పడిన ఇన్‌ఫ్లమేషన్ వల్ల అని స్పష్టమైందట. వారి సూచనలతో ఏడాది పాటు ఎలాంటి వ్యాయామం లేకుండా కేవలం డైటింగ్ ద్వారా బరువు తగ్గానని విద్యా చెప్పింది. నేనెప్పుడూ లేనంత ఆరోగ్యంగా ఉన్నట్లు భావిస్తున్నాను అంటూ విద్యా బాలన్ చెప్పుకొచ్చింది. అయితే, తను పాటించిన పద్ధతి అందరికీ ఒకే ఫలితాన్ని ఇస్తుందని తాను చెప్పడం లేదని పేర్కొనడం కొసమెరుపు. 2003లో బెంగాలీ చిత్రం 'భలో థేకో' ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన విద్యా బాలన్, 2005లో 'పరిణీతా' సినిమాతో హిందీ చిత్రరంగంలో అడుగుపెట్టింది. తర్వాతి కాలంలో ఆమె నటించిన 40కు పైగా చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. 2024లో విడుదలైన హర్రర్ కామెడీ 'భూల్ భూలయ్యా 3' లో మంజులికా, మల్లికా అనే రెండు విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించింది. విద్యా బాలన్ తన నటనతోనే కాదు, స్పష్టమైన అభిప్రాయాలతో, ఆత్మవిశ్వాసంతో కూడిన వ్యక్తిత్వంతోనూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. 46 ఏళ్ల విద్యా బాలన్ ఆరోగ్యంపై ఆమె తీసుకున్న చొరవ, బాడీ షేమింగ్‌కు ధీటుగా ఇచ్చిన సమాధానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

## అల్లు అర్జున్ సినిమాలో విలన్‌గా హాలీవుడ్ నటుడు విల్ స్మిత్?



పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు బన్నీ సూపర్ అప్‌డేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. తమిళ దర్శకుడు అట్లీతో తన నెక్ట్స్ ప్రాజెక్ట్ చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఈ మూవీ షూటింగ్ దాదాపు అమెరికాలో జరుపుకోబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే అల్లు అర్జున్‌తో పాటు దర్శకుడు అట్లీ చిత్రయూనిట్ మొత్తం అమెరికాకు చేరుకుంది. ఈ సినిమాలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. విలన్ రోల్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో హాలీవుడ్ స్టార్ నటుడు విల్ స్మిత్‌ను విలన్‌గా తీసుకుబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే అల్లు అర్జున్ సినిమా పాన్ ఇండియా నుంచి ఇంటర్‌నేషనల్ వరకు వెళుతుంది. కాగా ఈ విషయంపై చిత్రబృందం నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.

# పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోశారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ.8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ప్రకాశం జిల్లా వైసీపీ నేతలు సైతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆనందం వ్యక్తం చేసారని తెలిపారు. 2014-2019 హయాంలో మామిడి రైతులకు 2.50 రూ సబ్సిడీని అందచేసామని, ఈ ఏడాది కూడా ప్రభుత్వం అంతే ఇస్తారని భావించారని కానీ అనూహ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేజీకి 4 రూపాయలు రైతులకు ప్రభుత్వంచే అందచేయాలని నిర్ణయించడం పట్ల రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. జగన్ రెడ్డి ఆత్మ-పరమాత్మ అయినటువంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పల్ప్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఆయన 12 చొప్పున మామిడి పంట కొనే దమ్ము ధైర్యం ఉందా, లేక జగన్ రెడ్డి ఆయన చేత



కొనిపించగలడా అని ప్రశ్నించారు.

పక్కా ప్లాన్ తో మామిడి ట్రాక్టర్లను తెచ్చారు చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి సెక్రటరీ ప్రకాశ్ రెడ్డి అనే వ్యక్తికి 25 ఎకరాల మ్యాంగో తోట ఉందని, ఆ పంటను 12 రూపాయల చొప్పున అమ్ముకున్నాడని, ఆయన పథకం ప్రకారమే తింబోజిపాలెం గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి అనే వ్యక్తికి చెందిన 5 ట్రాక్టర్ బండ్లను ఎప్పుడైతే జగన్మోహన్ రెడ్డి కారు సర్వీస్ రోడ్ వైపు ఉన్న మామిడి తోట ముందుకు వచ్చిందో ప్రకాశ్ రెడ్డికి చెందిన తోటలో నుండి 5 ట్రాక్టర్స్ ను రోడ్ మీద పారబోసి విచక్షణారహితంగా పంటను తొక్కుకుంటూ వెళ్లారని తెలిపారు. ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి మామిడి పంటను రోడ్ పై పోసి, తొక్కుకుంటూ వెళ్తూ కనీస బాధ్యత లేకుండా చూస్తూ రాక్షస ఆనందం పొందటం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.

**పోలీసుల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించారు**

జగన్ రెడ్డి పర్యటనకు సంబంధించి ఆంక్షలు విధించిన పోలీసుల పట్ల వైసీపీ నేతలు, కార్యకర్తలు దురుసుగా వ్యవహరించడం చాలా బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ముకుమ్మడిగా వస్తున్న వైసీపీ అభిమానులను అదుపు చేస్తున్న డిఎస్పీ స్థాయి అధికారి చేయిని రపా..... రపా... నరకండి అంటూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కార్యకర్తలను ఆదేశించడం దేనికి సంకేతం అని అన్నారు. జగన్ పర్యటనలో అవాంఛనీయ ఘటనలు జరుగుతాయన్న ముందుచూపుతోనే డ్రోన్ కెమెరాలను ఉపయోగించామని, అందులో భాగంగానే ట్రాక్టర్ల ఉదంతం బయట పడిందన్నారు. వైసీపీ కార్యకర్త ర్యాలీలో వెళ్తుంటే కిందపడిపోయి తలకు గాయాలయ్యాయని, పోలీసులు లాఠీ ఛార్జ్ చేసారంటూ అవాస్తవాలు ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు.

# ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

-మొదటిపేజీ తరువాయి

గేట్స్ ఫౌండేషనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గర చేసే అంశంపై గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతి వంటి అంశాలపై సీఎం చర్చించారు.

**టెక్నాలజీ కావాలి.. ప్రజలకు ఉపయోగపడాలి..**

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉంది. టెక్నాలజీ ద్వారా చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం. అయితే ఆ టెక్నాలజీ ప్రజలకు ఎంతవరకు చేరువ చేయగలిగామనేదే ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి.. దాదాపు 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైనులోనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంటుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. అలాగే టెక్నాలజీ పరంగా ఆయా అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పని చేస్తున్నాం. అయితే ఆయా రంగాల్లో మనం అందిపుచ్చుకున్న సాంకేతికతను ప్రజలకు.. మరీ ముఖ్యంగా పేదలకు అందుబాటులోకి తేవాలి. టెక్నాలజీ ద్వారా ప్రజలు లాభం పొందాలి. అప్పుడే సాంకేతికతకు సార్థకత చేకూరుతుంది." అని చంద్రబాబు చెప్పారు.

**విద్య, వైద్యం ప్రజలకు భారం కాకూడదు..**

"వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఈ రంగాలు ప్రజలు, పేదలకు అత్యంత అవసరమైనవి. రాన్రాను వైద్యమనేది సామాన్యునికి భారంగా మారుతోంది. ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి. కొన్ని కొన్ని రోగాలకు కోట్లాది రూపాయల మేర డబ్బులు అవసరమవుతున్నాయి. అందుకే ఆరోగ్య రంగాన్ని టెక్నాలజీతో అనుసంధానించే అంశంపై దృష్టి పెట్టాం. ప్రతిఆరు నెలలకోసారి ప్రజలకు రక్త పరీక్షలు చేపట్టాలి. రోగాలు ఏమైనా వచ్చే అవకాశం ఉందా.. అనేది ముందుగానే గుర్తించాలి. ఆ డేటా ఆధారంగా ప్రజలకు



ముందుగానే ఆరోగ్య సలహాలు.. సూచనలు అందించేలా చూడాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా వారికి కావాల్సిన వైద్య సేవలు, సూచనలు అందించాలి. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేస్తే.. సగం రోగాలు తగ్గిపోతాయి. అలాగే మన ఆరోగ్య పద్ధతులు మార్చుకుంటే చాలా రోగాలు దరిచేరవు. ఇక పుట్టిన పిల్లల్లో వైకల్యం మొదలుకుని.. పోషకాహార లోపాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని గుర్తించగలగాలి. దీని కోసం కేర్ అండ్ గ్రో విధానాన్ని అనుసరిస్తున్నాం. ఎవరెవరికి ఏయే ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని.. వారిని నిరంతరం మానిటర్ చేసేలా ఉండాలి. ఆఫ్ లైన్, ఆన్ లైన్ మెడికల్ కన్సల్టేషన్ ఉండాలి. తక్కువ ఖర్చుతో వైద్యం అందాలి. ఇదంతా చేయాలంటే డేటా అవసరం.. అది టెక్నాలజీతోనే సాధ్యం. ఆయుష్మాన్ భారత్ డేటా మిషనుతో మన దగ్గరున్న డేటాను అనుసంధానం చేసుకోవాలి. ఇక విద్యా ప్రమాణాలు మెరుగుపడాలన్న నేటితరంలో టెక్నాలజీ వినియోగం చాలా అవసరం. నాణ్యమైన విద్యను.. తక్కువ ఖర్చుతో పేదలకు.. మధ్యతరగతి ప్రజలకు ఎలా అందించాలనే అంశాలను పరిశీలించాలి. ఇది టెక్నాలజీతో సులువు అవుతుంది. విద్యార్థులకు చక్కటి విద్యను అందించగలిగితే.. వారి భవిష్యత్తు అందంగా ఉంటుంది. పంటలు వేయడం మొదలుకుని.. పంట అమ్ముకునేంత వరకు రైతులు ఎలాంటి మెళుకువలు అనుసరించాలనే అంశంపై పక్కా సమాచారం అవసరం. భూసార పరీక్షలకు సంబంధించిన డేటా రైతులకు అందుబాటులో ఉంటే.. దానికి అనుగుణంగా సాగు చేస్తారు.

ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుంటారు. అలాగే డిమాండుకు తగ్గట్టు ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. పండించిన పంటను మంచి ధరకు వచ్చేలా చూడాలి. ఇలా రైతుకు ప్రతి అడుగులోనూ టెక్నాలజీ అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది." అని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రజలకూ కెపాసిటీ బిల్డింగ్ అవసరమే..**

"ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగులో రాష్ట్రం దేశంలో నాలుగో స్థానంలో ఉంది. రాబోయే కాలంలో మరింత మెరుగ్గా ఉంటాం. కెపాసిటీ బిల్డింగ్ అనేది ఉద్యోగులకే కాకుండా.. ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తాం. ఇప్పుడు ప్రతిదీ ఆన్ లైనులోనే ఉంది. ఫైళ్ల క్లియరెన్సు కూడా ఆన్ లైనులోనే చేస్తున్నాం. మెడికల్ ఎక్విప్మెంట్ తయారీ చేసే మెడ్ టెక్ జోన్ ఏపీలోనే ఉంది. ఇలాంటివి వేరే రాష్ట్రాల్లో లేవు. మెడ్ టెక్ జోన్ కు మరింత టెక్నాలజీ హంగులు అద్దడం ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాలి. అమరావతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తాం. ఈ యూనివర్శిటీ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు రావాలి. దీనికి బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం ఆశిస్తున్నాం." అని చంద్రబాబు అన్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులతో ఈ తరహా భేటీ ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించుకుందామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, బిల్ గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆనం అసంతృప్తికి కారణం అదేనా

**నెల్లూరు :** ఆనం రామనారాయణరెడ్డి ఎప్పుడూ అసంతృప్తి నేత మాత్రమేనా? జిల్లాలో తన మాట శాసనం అనుకుంటున్నారా? ఇంకా పాత కాలం నాటి రోజులుగా ఆనం రామనారాయణరెడ్డి భావిస్తున్నట్లుంది. సాక్షాత్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎదుటే మంత్రి నారాయణపై అసంతృప్తిని వెళ్లగక్కి ఆనం రామనారాయణరెడ్డి తన దైన శైలిని ఆయన మరోసారి చాటుకున్నారు. అందుకే సీనియర్ నేతలను పక్కన పెట్టి కొత్త తరం నేతలను రాజకీయాల్లోకి తీసుకు రావాలన్న టీడీపీ అధినాయకత్వం ఆలోచన కరెక్టే అనిపిస్తుంది. ఈ సీనియర్లు తమదే ఆధిపత్యం కావాలని కోరుకుంటారు. ఫలితంగా పార్టీలో రాజకీయ ఇబ్బందులు తలెత్తక తప్పవు. అందుకే టీడీపీలో క్రమంగా సీనియర్ నేతలను పక్కన పెడుతున్నారు.. నెల్లూరు నగరంలో నిన్న అంతర్జాతీయ ప్రమాణాలతో నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి వీఆర్ హైస్కూల్ ను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మంత్రి నారాయణ మున్సిపల్ నిధులు వెచ్చించి ఈ పాఠశాలకు మరమ్మతులుచేయించారు. దీంతో వీఆర్ మున్సిపల్ హైస్కూలు అని నామకరణం చేశారు. అందుకు ఆనం రామనారాయణరెడ్డి అభ్యంతరం తెలిపారు. తమ కుటుంబం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా ఉన్న వీఆర్ విద్యాసంస్థలను మున్సిపల్ స్కూలు అని ఎలా నామకరణం చేస్తారని లోకేశ్ ఎదుటే ప్రశ్నించారు. నారాయణ తన శాఖ నిధులతో ఖర్చు చేస్తే పేరు మారుస్తారా? అని నిలదీశారు. అంతేకాదు నారాయణ మున్సిపల్ పాఠశాలలను దత్తత తీసుకుని వాటిని బాగు చేస్తే మంచిదని హితవు పలికారు. ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలతో లోకేశ్ సయితం విస్తుపోయారు ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ లో ఉన్ననాళ్లు మంత్రిగా ఉండి జిల్లాపై ఆధిపత్యాన్ని చెలాయించారు. అయితే 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన టీడీపీలో చేరారు. కానీ ఆ ఎన్నికల్లో గెలవలేకపోయారు. కానీ తనకు ఎమ్మెల్సీ సీటు కూడా ఇవ్వలేదని నాడు టీడీపీని వదిలేశారు. 2019 ఎన్నికలనాటికి వైసీపీలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి టిక్కెట్ పొంది విజయం సాధించారు. అయితే జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. దీంతో అసంతృప్తికి గురయిన ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికలకు ముందు నుంచే అధికార వైసీపీ ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తూ వార్తల్లోకి ఎక్కారు. అంటే మరోసారి పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. గతంలో టీడీపీని వదిలి వెళ్లినా ఆనం రామనారాయణరెడ్డిని చంద్రబాబు నాయుడు తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. ఆనం కుటుంబానికి నెల్లూరులో ఉన్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకుని ఆత్మకూరు నియోజకవర్గం టిక్కెట్ ను 2024 ఎన్నికల్లో కేటాయించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఆనం రామనారాయణరెడ్డికి మంత్రివర్గంలో చోటు కూడా కల్పించారు. అయితే తనకు ఇష్టంలేని దేవాదాయ శాఖను అప్పగించడం కొంత అసంతృప్తికి గురైన ఆనం అందులోనే ఉంటూ సర్దుకుపోతున్నారు. కానీ నెల్లూరు జిల్లాలో సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కాదని ఆనం రామనారాయణరెడ్డి కి మంత్రిపదవి ఇచ్చినా ఆయన తృప్తిపడనట్లే కనిపిస్తుంది.. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ హవా నడుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, లోకేశ్ కు నారాయణ సన్నిహితుడు కావడంతో జిల్లా అధికారులు కూడా ఆయనకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఆనం రామనారాయణరెడ్డికి ఇబ్బందికరంగా మారింది. తన సొంత జిల్లాలో నారాయణ పెత్తనమేంటన్న అభిప్రాయం ఆయనలో బలంగా ఉన్నట్లుంది. అందుకే లోకేశ్ వేదికపైనే ఉన్నా ఏ మాత్రం సంకోచం లేకుండా విమర్శలు చేయడంతో నెల్లూరు టీడీపీలో విభేదాలు బయటకు భగ్గుమన్నాయి. ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది.

## పోలీసుల్లారా.. చంద్రబాబు రేపు మిమ్మల్ని మోసం చేయొచ్చు

-మొదటిపేజీ తరువాయి

రేపు పోలీసులను కూడా చంద్రబాబు మోసం చేయొచ్చు. అప్పుడు కూడా నేనే మీ తరుఫున పోరాటం చేయాల్సి వస్తుంది. ఒక్కటి గుర్తుంచుకోండి.. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు ప్రతి పోలీసు అధికారికీ ఒకటే చెబుతున్నా. అయ్యా ప్రతి పోలీస్ సోదరుడా.. మీకు కూడా సమస్యలుంటాయి. ఎప్పుడు ఎవరికి ఏ సమస్య వచ్చినా.. పలికేది ఒక్క జగన్ మాత్రమే. పొగాకు రైతులకు సమస్య అయినా జగనే పలుకుతున్నాడు. మామిడి రైతుల సమస్యల పైనా జగనే పలుకుతున్నాడు. మిర్చి రైతులైనా జగనే పలుకుతున్నాడు. ఉద్యోగుల సమస్యలైనా.. వాళ్లకు మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలన్నా, వేతనాల సవరణ (పీఆర్సీ) డిమాండ్ చేయాలన్నా, వాళ్లకు కరవు భత్యం (డీఏ) ఇప్పించాలన్నా, చివరికి చంద్రబాబునాయుడు హామీలను నిలదీస్తూ, ఆయన్ను గట్టిగా ప్రశ్నించాలన్నా, ఆయన సూపర్ సిక్సు, సూపర్ సెవెన్లు అమలు చేయకుండా మోసం చేసిన వైనాన్ని ఎండగట్టాలన్నా.. జగన్ మాత్రమే ముందుంటాడు. ప్రతి పోలీస్ సోదరుడు దీన్ని గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నాను. అధికారంలో ఉన్న ఆ ఎస్పీలు, డీఐజీలు, సీఐలు వీళ్ల మాటలు వినకండి. వీళ్ల ప్రలోభాలకు లొంగకండి. రేప్పొద్దున మీ సమస్యలపైనా ఇదే మాదిరిగానే చంద్రబాబు మిమ్మల్ని మోసం చేసి రోడ్డున పడేస్తే.. అప్పుడు జగన్ అనే వ్యక్తి ముందుకు వస్తాడు. లేదంటే ఈ రాష్ట్రంలో సమస్యల గురించి మాట్లాడేవాడు ఎవడూ ఉండడు. అసలు సమస్యలే లేనట్లు వక్రీకరిస్తారు. డ్రామాలాడతారు. తప్పుదోవ పట్టిస్తారు. అలా సమస్యలను గాలికి వదిలేసే పరిస్థితి వస్తుంది. ఇంకా అందరూ నష్టపోయే కార్యక్రమం కూడా జరుగుతుందని ప్రతి పోలీస్ సోదరుడికీ ఈ సందర్భంగా తెలియజేస్తున్నా. రేపు రాబోయేది జగన్ ప్రభుత్వం. గుర్తుంచుకోండి" అని హితబోధ చేశారాయన. కనీస గిట్టుబాటు ధర లేక తీవ్ర కష్ట నష్టాల్లో కూరుకుపోయిన మామిడి రైతులను బుధవారం వైఎస్ జగన్ పరామర్శించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్‌లో మామిడి రైతులను కలిసి, వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా.. కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారాయన.

## మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0

-మొదటిపేజీ తరువాయి

భాగస్వాములు రేపు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, జూనియర్ కాలేజీలలో మెగా పీటీఎం 2.0ను ఒక ఉత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు ఈ వేడుకలో పాల్గొనున్నారు. మొత్తంగా 2.28 కోట్ల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ మెగా పేరెంట్ టీచర్ సమావేశం సరికొత్త రికార్డు సృష్టించనుంది. ఇక ప్రతీ ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశాన్ని పీటీఎం పేరిట ప్రభుత్వం నిర్వహించనుంది. కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పేరెంట్ టీచర్ మీటింగ్స్ ను ప్రభుత్వ అధీనంలో నడిచే పాఠశాలలో నిర్వహించాలని మంత్రి నారా లోకేష్ సంకల్పించారు. ఈ మేరకు వరుసగా రెండో ఏడాది కూడా పండుగ వాతావరణంలో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

**తల్లిదండ్రులకు పురోగతి కార్డుల అందజేత**

తమ పిల్లలు చదువులో ఎంత పురోగతి సాధిస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది, సామాజిక సమస్యలపై అవగాహన చేసుకుంటున్నారా అనే అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది. అంతేకాదు... విద్యార్థుల చదువులకు సంబందించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించనుంది. తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను, సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకోవచ్చు. పాఠశాల విద్యలో పనితీరు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై చర్చించుకునే సదావకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది.

## డిసెంబర్ నాటికి అమరావతి క్వార్టర్స్‌లోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలోని ఛాంబర్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్, ఆస్పత్రి, క్లబ్ హౌస్ ఉండేలా చూడాలని ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ వినియోగం ఉండాలని దిశానిర్దేశం చేశారు. చట్టసభ సభ్యుల కోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35మంది మంత్రులు, 36 మంది న్యాయమూర్తుల క్వార్టర్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. కృష్ణా నది వెంబడి సీఎం అధికారిక నివాసం, రాజ్‌భవన్ ఉంటాయని తెలిపారు.

**ఆగస్టులో 10 రోజులపాటు వర్షాకాల సమావేశాలు**

ఆగస్టులో పది రోజుల పాటు అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతిలో చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు జరగనున్నట్లు తెలిపారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న లోక్‌సభ స్పీకర్ సూచనతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాతీయ సదస్సుకు అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 50మంది సభ్యులు పాల్గొంటారన్నారు.

# వల్లభనేని వంశీకి ఏమైంది...

**విజయవాడ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర అస్వస్థతతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చేరారు. కొద్ది రోజుల కిందటే ఆయన బెయిల్ పై విడుదలయ్యారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 135 రోజులపాటు ఆయన జైల్లో గడపాల్సి వచ్చింది. ఆ సమయంలోనే పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. జైలు నుంచి ఆసుపత్రులకు తీసుకొచ్చి చికిత్స అందించేవారు. ఇప్పుడు బెయిల్ పై వచ్చిన ఆయన మరోసారి అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు.ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఏపీ పోలీసులు హైదరాబాదుల ఉన్న వల్లభనేని వంశీ మోహన్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై 11 కేసులు నమోదు చేశారు. అనేకసార్లు ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎప్పటికప్పుడు బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యేవి. ఎట్టకేలకు ఈనెల 2న ఆయనకు బెయిల్ లభించింది. దీంతో ఆయన బయటకు వచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ మరుసటి రోజున భార్యతో కలిసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అటు తరువాత మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని వల్లభనేని వంశీని పరామర్శించారు. ఇంతలోనే ఆయన అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పించారు.

నట రత్నాలు, నట శేఖర లు ఎక్కడో వుండరు,
మన చుట్టూ గన్నవరం గాండు, గుడివాడ గుట్కా రూపాల్లో తిరుగుతూ వుంటారు..
వాడు ఆరోగ్యం బాగోపోతే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకోవాలి కానీ,
వీడియోలు తీసి సోషల్ మీడియా లో పెట్టి డ్రామా లు ఎందుకు?

వల్లభనేని వంశీ మోహన్ దూకుడుగా వ్యవహరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఈ ఎన్నికల్లో గన్నవరం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన విదేశాలకు వెళ్లిపోతారని ప్రచారం జరిగింది. ఇంతలోనే పాత కేసులను తిరగదోడుతూ ఏపీ పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టు కూడా చేశారు. దాదాపు 135 రోజులపాటు వంశీ జైల్లోనే గడపాల్సి వచ్చింది. వాస్తవానికి గతంలో కూడా వల్లభనేని వంశీ మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే జైల్లోకి వెళ్లిన తరువాత అనారోగ్యం మరింత తీవ్రమైంది. ఇప్పుడు బయటకు వచ్చినా ఆ ప్రభావం ఇంకా కనిపిస్తోంది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : **SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702.** E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.